తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
బుధవారం 03.12.2025 | సంపుటి : 12 సంచిక : 134 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## సోనియా, రాహుల్‌లకు అండగా
# మనమంతా ఉన్నాం

- నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే అంతిమ లక్ష్యం
- పార్లమెంట్‌లో ఓట్ చోరీపై చర్చ రాకుండా కుట్రలు
- బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఎయిర్‌పోర్ట్ కూడా రాలే
- అభివృద్ధి,సంక్షేమంతో ముందుకు దూసుకెళ్తున్నాం
- పీసీసీ సమావేశంలో సీఎం రేవంత్ ప్రసంగం

**హైదరాబాద్(జనంసాక్షి):**కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టీపీసీసీ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు కీలక సందేశం పంపిస్తూ పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ వైఖరి పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ.. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మిగతా 2లో..



కొత్తగూడంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ కి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హాజరైన డిప్యూటీ సీఎం భట్టి మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు,పొంగులేటి శ్రీనివాసరెడ్డి,వాకిటి శ్రీహరి, ఖమ్మం ఉమ్మడి జిల్లా ఎంఎల్ ఏలు,ఎంఎల్సీ లు,ఉన్నతాధికారులు

# గుజరాత్‌కు ఇచ్చినవన్నీ తెలంగాణకు ఇవ్వాలి

## లేదంటే బీజేపీ నామరూపాల్లేకుండా పోతుంది

- ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు పునాది పడింది ఇక్కడే
- గ్రామాల్లో మంచి సర్పంచ్‌నే ఎన్నుకోండి
- మంత్రులతో కలిసి పనిచేసే వారినే ఆదరించండి
- తెలంగాణ ఉద్యమం పాల్వంచలోనే ప్రారంభమైంది
- ప్రత్యేకరాష్ట్రపోరుకు స్ఫూర్తినిచ్చిన ప్రాంతం కొత్తగూడెం
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సిఎం రేవంత్ శంకుస్థాపన

**కొత్తగూడెం(జనంసాక్షి):** ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది కూడా పాల్వలంచోలనే అని అన్నారు. రాష్ట్ర ప్రజల చిరాకాల వాంఛ మిగతా 2లో..

"తెలంగాణ ఉద్యమానికి పునాది పడింది పాల్వంచలోనే. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నాం. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్. ఆయన పేరును వర్శిటీకి పెట్టుకోవడం గర్వకారణం. దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాం. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి."
- సీఎం రేవంత్ రెడ్డి



# హిడ్మా.. హీరో ఆఫ్ ది ఇయర్

## దేశవ్యాప్తంగా మార్మోగిన గోండ్ బిడ్డ పేరు



- మొట్టమొదటిసారిగా సోషల్ మీడియాలో భారీ చర్చ
- నూనుగు మీసాల దశ నుంచి అతనో ఆదివాసీల గుండెచప్పుడు
- ఆపరేషన్ కగార్‌కు కంగారు పుట్టించిన యోధుడు
- యువతకు మరో చేగువేరా కామ్రేడ్ మాద్వి హిడ్మా

12లో..

'ఒక వీరుడు మరణిస్తే వేల కొలది ప్రభవింతురు' అనే నానుడిని ఓ యోధుడి అమరత్వం రూఢీ చేస్తోంది. వేలాది మంది యువతను ప్రభావితం చేసి అడవి బిడ్డలకు, పర్యావరణ పరిరక్షణకు 'మేము సైతం..' అంటూ కదిలించిన తీరు మరో కొత్త చరిత్రను ఆవిష్కరిస్తోంది. రాజ్యం దృష్టిలో మోస్ట్‌వాంటెడ్‌గా మారితే.. అతని పోరాటం మాత్రం ఆదివాసీల గుండెచప్పుడుగా ప్రతిధ్వనిస్తోంది. రెండున్నర దశాబ్దాలకుపైగా వ్యవస్థలోని లోపాలపై యుద్ధం చేసి ఈ తరపు 'భగత్‌సింగ్'గా అందరి నోటా వినబడుతోంది. విద్యావంతుడు కాకపోయినా కార్పొరేట్ దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాడు. సహజ వనరుల రక్షకుడిగా, పర్యావరణహితుడిగా నిలిచిన హిడ్మా ఇప్పుడు హీరో ఆఫ్ ది ఇయర్‌గా మారడం ఓ చారిత్రక సందర్భం. నేటి యువతరానికి మరో చేగువేరా హిడ్మా..! - సెంట్రల్ డెస్క్ (జనంసాక్షి)

# రెండు దశల్లో 'జనగణన'

- 2026 ఏప్రిల్ నుంచి మొదటి.. 2027 ఫిబ్రవరిలో రెండో దశ
- డిజిటల్ విధానంలో ప్రక్రియ
- కులగణన కూడా నిర్వహిస్తాం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది.కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హెూమ్ వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మిగతా 2లో..





# మహేశ్వరంలో డ్రోన్ డిఫెన్స్ ఫెసిలిటీ సెంటర్

## దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో రూ.8వేల కోట్లతో ఏర్పాటు చేయనున్నాం:మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):** దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో డ్రోన్లకు ప్రత్యేక డిఫెన్స్ ఫెసిలిటీని జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో జెఎస్‌డబ్ల్యూ డ్రోన్ కంపెనీ ఏర్పాటుకు పార్థ జిందాల్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..రూ.8వేల కోట్ల అంచనా వ్యయంతో దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఫెసిలిటీతో మహేశ్వరంలో భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. అనేక రాష్ట్రాలు ఆహ్వానించినప్పటికీ జేఎస్‌డబ్ల్యూ సంస్థ తెలంగాణను ఎంచుకోవడం రాష్ట్ర పారిశ్రామిక విధానం బలాన్ని చాటుతుందని తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరిన్ని పెట్టుబడులు రాబోతున్నాయని, రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వివరించారు.


# పీఎంవో ఇక.. సేవాతీర్థ్

- ప్రధాని కార్యాలయం పేరు మారుస్తూ కేంద్రం ఉత్తర్వులు
- అన్ని రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌ల పేర్లు లోక్‌భవన్‌లుగా మార్పు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి కార్యాలయాన్ని ఇకనుంచి సేవాతీర్థ్‌గా పిలవనున్నారు. దశాబ్దాలుగా సౌత్‌బ్లాక్‌లోని పీఎంవో నుంచి ప్రధానులు విధులు నిర్వర్తిస్తుండగా.. ఆ కార్యాలయం కొత్త భవనంలోకి మారనుంది. ఈ నేపథ్యంలోనే పేరు మార్పుపై ప్రకటన వచ్చింది.రాజ్‌భవన్ మిగతా 2లో..

# 'సర్'పై దిగొచ్చిన సర్కారు

## 9న లోక్‌సభలో చర్చించేందుకు కేంద్రం ప్రభుత్వం అంగీకారం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చర్చించేందుకు అధికార పక్షం అంగీకరించింది. ఈ విషయాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో మంగళవారం సమావేశమైన అనంతరం కాంగ్రెస్ నేత కె.సురేశ్ వెల్లడించారు. డిసెంబర్ 8న వందేమాతరంపై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ జరగనున్నట్లు తెలిపారు.పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజే 'సర్'పై చర్చించాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ ఆందోళనల మధ్య సభ మంగళవారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ఇదే అంశంపై చర్చకు విపక్షం పట్టుబట్టి చివరకు వాకౌట్ చేసింది. చర్చకు ప్రభుత్వం విముఖం కాదని, కాలపరిమితిని నిర్దేశించాలనుకోవడం మాత్రం తగదని అధికారపక్షం పేర్కొంది.రెండోరోజు సమావేశాల్లోనూ ఇవే అంశాలపై విపక్షాలు ఆందోళనకు దిగడంతో స్పీకర్ అఖిలపక్ష సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకు అధికార పక్షం చర్చకు అంగీకరించింది. అయితే, ప్రత్యేకంగా 'సర్'పై కాకుండా.. ఎన్నికల సంస్కరణలు అనే విస్తృత అంశాన్ని సభ ముందు ఉంచనున్నట్లు తెలుస్తోంది.

# 'సంచార్ సాథీ' ప్రైవసీకి ముప్పు

## తొలగించాలని పార్లమెంట్‌లో విపక్షాల డిమాండ్

### అనవరం లేకుంటే తొలగించవచ్చన్న సింధియా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంట్‌లో సంచార్ సాథీపై అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ప్రధానంగా కాంగ్రెస్, శివసేన, తదితర పార్టీలు దీనిని తీవ్రంగా విమర్శిస్తూ ఇది.. ప్రజల ప్రైవసీ ఉల్లంఘనే అంటూ సభా కార్యక్రమాలకు అడ్డు తగిలాయి. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. విపక్ష కాంగ్రెస్ దీని మీద వాయిదా తీర్మానం దాఖలు చేసి మిగతా 2లో..

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు..

# ప్రధాని సహా అన్ని రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం

- సీఎం సూచన మేరకు రాష్ట్రాలకు వెళ్లి సీఎంలను ఆహ్వానించనున్న మంత్రులు
- నేడు ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి రేవంత్..
- ప్రధాని మోదీతో భేటీ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ప్రధానమంత్రి మోదీ సహా అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. దిల్లీ వెళ్తోన్న సీఎం రేవంత్‌రెడ్డి.. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. 'తెలంగాణ రైజింగ్-2025' సదస్సుకు రావాలని ప్రధానిని ఆహ్వానించనున్నారు. అనంతరం పలువురు కేంద్రమంత్రులనూ సదస్సుకు ఆహ్వానిచానున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు పలువురు మంత్రులు గురువారం వివిధ రాష్ట్రాలకు వెళ్లి సీఎంలను ఆహ్వానించనున్నారు. రాష్ట్ర ఎంపీల బృందం.. దిల్లీ సీఎం, కేంద్రమంత్రులు, గవర్నర్లను ఆహ్వానించనుంది.

### మంత్రులకు ఆహ్వాన బాధ్యతలు..

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి - జమ్మూకశ్మీర్, గుజరాత్, దామెదర్ రాజనర్సింహ - పంజాబ్, హరియాణా,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి - ఆంధ్రప్రదేశ్, శ్రీధర్‌బాబు - కర్ణాటక, తమిళనాడు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి - ఉత్తర్‌ప్రదేశ్,పొన్నం ప్రభాకర్ - రాజస్థాన్,కొండా సురేఖ - ఛత్తీస్‌గఢ్ సీతక్క - పశ్చిమ బెంగాల్,తుమ్మల నాగేశ్వరరావు - మధ్యప్రదేశ్, జూపల్లి కృష్ణారావు - అస్సాం,వివేక్ - బిహార్,శ్రీహరి - ఒడిశా, లక్ష్మణ్ హిమాచల్‌ప్రదేశ్,అజారుద్దీన్-మహారాష్ట్ర సీఎంను ఆహ్వానించనున్నారు.



# అక్రమ వలసదారులకు రెడ్‌కార్పెట్ పరవాలా?

## రోహింగ్యాల అదృశ్యంపై కేసులో సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రోహింగ్యా శరణార్థుల అదృశ్యంపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి.. న్యాయస్థానం అసాధారణ రక్షణలు కల్పించాలా అని ప్రశ్నించింది. రోహింగ్యాలు అదృశ్యమవుతున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'వారికి రెడ్‌కార్పెట్ వేసి.. ఆహ్వానించాలని మీరు కోరుకుంటున్నారా' అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. రోహింగ్యాలు సొరంగ మార్గాల ద్వారా భారత్‌లోకి వచ్చి.. ఆహారం, ఆశ్రయం వంటి హక్కులను డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. 'ఉత్తర భారతదేశంలో మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. చొరబాటుదారులు చట్టవిరుద్ధంగా ప్రవేశిస్తే.. వారిని ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత మనకు ఉందా?' అని వ్యాఖ్యానించింది.

## హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్
# పోరుబాట

## ఎనిమిది బృందాలతో ఆయా ప్రాంతాల్లో పరిశీలన చేస్తాం:కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**గ్రేటర్ పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ హిల్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన నిజనిర్ధారణ బృందాలను నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల



స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం మిగతా 2లో..

## ఎస్సీ వసతిగృహంలో
# ఫుడ్ పాయిజన్

- 15 మంది విద్యార్థులకు అస్వస్థత..
- ఒకరి పరిస్థితి విషమం
- గద్వాల జిల్లా కేంద్రంలో ఘటన

**గద్వాల(జనంసాక్షి):**గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఇవాళ ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు యథావిధిగా పాఠశాలకు వెళ్లారు. అరగంట అనంతరం విద్యార్థులకు వాంతులు కావడంతో.. వారిని ఆస్పత్రికి మిగతా 2లో..





# అధిష్టానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారు

## సిద్ధరామయ్య • డీకేతో కలిసి ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్

**బెంగుళూరు(జనంసాక్షి):**కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే పార్టీ ప్రధాన లక్ష్యమని ఇరువురు నేతలు మిగతా 2లో..

# 'సంచార్ సాథీ' ప్రైవసీకి ముప్పు

సంచార్ సాథీపై విస్తృత చర్చ కావాలని డిమాండ్ చేసింది.సంచార్ సాథీ యాప్.. ఫోన్ యూజర్ల కదలికల్ని, మెసేజెస్, కాల్స్ మానిటర్ చేస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ దీనిని ఇదొక డిస్టోపియన్ టూల్ అని.. ఇది ప్రతి భారతీయుడిని మానిటర్ చేయడమే కాకుండా.. వారి ఆర్థిక హక్కులపై దాడిగా అభివర్ణించారు. దీని అమలు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపి రేణుక చౌదరి దీనిపై వాయిదా తీర్మానం దాఖలు చేశారు. మరో ఎంపిప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ ఇది ఒక దారుణమైన పరిణామమని.. ఇది భవిష్యత్‌లో నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. ప్రజల గోప్యతను హరిస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోష్ కూడా దీనిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని విమర్శించారు. విపక్షాల ఆందోళన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. సంచార్ సాథీ యాప్ పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. సంచార్ సాథీ మీద చర్చకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, కానీ ఎజెండా ప్రకారం సెషన్‌లో 14 బిల్లులపై ఫోకస్ పెడదామని సూచించారు. అటు, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికామ్ కూడా దీనిపై స్పందించింది. సంచార్ సాథీ కేవలం ప్రజల సైబర్ సెక్యూరిటీ కోసం ఉద్దేశించింది మాత్రమేనని, ఇందులో ప్రైవసీ ఉల్లంఘన లేదంది. ఈ యాప్ యూజర్ డేటా రక్షిస్తుందని తెలియజేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా కీలక ప్రకటన చేశారు. స్మార్ట్‌ఫోన్ యూజర్లు తమ మొబైల్ నుంచి సంచార్ సాథీ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని చెప్పారు. ఆ యాప్ తప్పనిసరి కాదని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇండియాలో స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే కంపెనీలకు ఇటీవల కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ కీలక ఆదేశాలు ఇచ్చింది. కచ్చితంగా స్మార్ట్‌ఫోన్లలో ప్రభుత్వ సంబంధిత సంచార్ సాథీ యాప్‌ను ప్రీ–ఇన్‌స్టాల్ చేసి ఉంచాలని పేర్కొన్నది. ఆ ఆదేశాలను విపక్షాలు తప్పుపడుతున్నాయి. సంచార్ సాథీ యాప్ వల్ల గోపత్యకు భంగం కలిగే అవకాశాలు ఉన్నట్లు విమర్శలు చెబుతున్నారు. భారత్‌లో విక్రయించే అన్ని మొబైళ్లలో ప్రభుత్వం రూపొందించిన సైబర్ సెక్యూరిటీ యాప్ సంచార్ సాథీని డిఫాల్ట్‌గా అందించాలని కేంద్రం మొబైల్ తయారీ సంస్థలను ఆదేశించింది. దీనిపై సోమవారం రాత్రి పీఐబీ ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. ఈ ఆదేశాల అమలుకు 90 రోజుల గడువు ఇచ్చిన కేంద్రం.. దానికి సంబంధించి 120 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రెస్‌నోట్‌లో స్పష్టం చేసింది. దీనిపై విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కేంద్రం వెనక్కి తగ్గింది. ఇది తప్పనిసరి కాదని వెల్లడించింది. ఆ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని చెప్పింది. అయితే దేశాన్ని నియంతృత్వం వైపు తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ దుయ్యబట్టారు. ఫోన్లపై నిఘానో, సంచార్ సాథీ యాప్ విషయమో కాదు.. అన్ని అంశాల్లో వారి వైఖరి అలాగే ఉందని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇది పెగాసస్ ప్లస్‌ప్లస్. బిగ్ బ్రదర్ మన ఫోన్‌ను, మొత్తం మన ప్రైవేటు జీవితాన్ని స్వాధీనం చేసుకుంటాడని కాంగ్రెస్ నేత కార్తి చిదంబరం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే విపక్షాలు పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం సృష్టించొద్దని, అన్ని అంశాలపైనా చర్చించేందుకు సిద్ధమని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆ విమర్శలను తోసిపుచ్చారు. కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పందించారు. ఆ యాప్‌ను వాడాలనుకోకపోతే.. మొబైల్ ఫోన్ వినియోగదారులు దానిని తొలగించే ఆప్షన్ ఉందని వెల్లడించారు. మీరు దానిని కొనసాగించాలని అనుకుంటే.. మీ ఫోన్‌లో ఉంచుకోవచ్చు. డిలీట్ చేయాలనుకుంటే చేసేయొచ్చు. మీరు ఫోన్ కొనుగోలు చేసినప్పుడు ఎన్నో యాప్‌లు ముందుగానే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. అవి వద్దనుకుంటే తొలగించుకుంటాం కదా. ఇది యూజర్ల రక్షణకు సంబంధించిన అంశం. ఇందులో తప్పనిసరి ఏమీ లేదు. మీరు రిజిస్టర్ కాకపోతే.. అది అచేతనంగా ఉండిపోతుంది. డిలీట్ కూడా చేసుకోవచ్చు. అయితే మోసం నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒక యాప్ ఉందని ప్రతిఒక్కరికీ తెలియదు. కాబట్టి ఆ సమాచారాన్ని వెల్లడి చేయడం ప్రభుత్వ బాధ్యత' అని మంత్రి వెల్లడించారు. ఫోన్ తయారీదారులకు ఆదేశాలు జారీ చేయడం వెనకగల కారణం ఇదేనన్న ఉద్దేశంలో సమాధానం ఇచ్చారు.

# ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నాడు

- మానసికంగా వేధిస్తున్నారు: ఖాన్ సోదరి
- రావల్పిండిలో తీవ్ర ఉద్రిక్తత
- మాజీ ప్రధానికి అనుకూలంగా భారీ ర్యాలీకి రంగం సిద్ధం
- ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం 144 సెక్షన్

ఇస్లామాబాద్(జనంసాక్షి):పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు వస్తోన్న వార్తలను ఆ దేశ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే ఇమ్రాన్‌ఖాన్‌ను చూసేందుకు ఆయన కుటుంబసభ్యులను అనుమతించకపోవడం, అతని ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మంగళవారం మాజీ ప్రధానికి అనుకూలంగా భారీ ర్యాలీకి రంగం సిద్ధం చేశారు. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో సెక్షన్ 144 విధించింది. ప్రజా భద్రత దృష్ట్యా బుధవారం వరకు అన్ని బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని గ్రూపులు రావల్పిండిలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ వెల్లడించింది. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్‌ఖాన్ కుమారులు ఖాసీం, సులేమాన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ తండ్రి విషయంలో ఏదో జరగకూడనిది జరిగినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఆయన సురక్షితంగా ఉన్నారా, లేదా? ఆరోగ్యంగా ఉన్నారా, మరణించారా అనే విషయాలు వెల్లడించకుండా జైలు అధికారులు తమను మానసికంగా హింసిస్తున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. తమ తండ్రిని చూసేందుకు అనుమతించట్లేదన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తమకు ఎలాంటి సమాచారం అందట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలన్నర రోజుల నుంచి ఆయనను ఎవరూ కలవకుండా 'డెత్ సెల్'లో ఒంటరిగా నిర్బంధించినట్లు వస్తున్న వార్తలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన మృతి చెందినట్లు సోషల్‌మీడియాలో ఒక్కసారిగా వదంతులు తెర పైకి వచ్చాయి. బలూచిస్థాన్ రెబల్స్‌కు చెందిన 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించిన పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ సోదరీమణులు ఇటీవల జైలు వద్దకువెళ్లి ఆయనను కలిసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అందుకు అనుమతించకుండా.. తమపై విచక్షణారహితంగా దాడి చేశారని వారు వాపోయారు. దీంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

# గుజరాత్‌కు ఇచ్చినవన్నీ తెలంగాణకు ఇవ్వాలి



నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం అన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం అన్నారు. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయని అన్నారు. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండని సీఎం విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు కంచుకోట అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ కు అండగా నిలబడిందన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడ్డవే పాల్వంచలోనేనని చెప్పారు. 60 ఏండ్లు ఉద్యమం నడవడానికి కారణం ఈ పాల్వంచనే అని చెప్పారు. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ కోసం వేలాది ఎకరాలు భూమి ఇచ్చారని చెప్పారు. దేశంలో వ్యవసాయం అభివృద్ధికి కారణం కాంగ్రెస్ అన్నారు రేవంత్. నాగార్జున సాగర్,శ్రీశైలం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నెహ్రూ కట్టినవేనని తెలిపారు. ఈ పదేళ్లలో ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కృష్ణా,గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా తడవాలన్నారు. ఎడ్యుకేషన్ కు సంబంధించి ప్రతీ అవకాశాన్ని జిల్లాకు ఇస్తున్నామన్నారు. పదేండ్లు పాలించినోళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనదన్నారు. సర్కార్ ఏ సంక్షేమ పథకం మొదలు పెట్టినా..ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని.. సన్నబియ్యం,రేషన్ పంపిణీ ఈ జిల్లా నుంచే ప్రారంభించామన్నారు. మీ ఓటే ఆయుధంగా మారి ప్రజాపాలన అందిస్తుందన్నారు. మంచోడినే సర్పంచ్ గా ఎన్నుకోవాలని.. మందుకో..డబ్బుకో ఓటేస్తే ఊరు మునుగుతుందని సూచించారు.బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు. గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. ప్రజలకు రేషన్ కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు ఇటువంటి అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని అన్నారు. భద్రాద్రి శ్రీ రామ చంద్రుని సాక్షిగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. ప్రజలు వేసిన ఓటు ఫలితంగా రెండు సంవత్సరాల కాలంలో మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలలో మంచి అభ్యర్థులను, పని చేయగలిగే వారిని ఎన్నుకోవాలని, డబ్బులకు మద్యం బాటిళ్లకు, ప్రలోభాలకు లొంగవద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే తెలంగాణ విజయోత్సవాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన మంత్రులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళుతున్నానని, మరోసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తానని, ఇక్కడ ప్రజలు అందించే ప్రేమ పూర్వకమైన స్వాగతం తనకు చాలా ఉత్సాహాన్ని ఇస్తుందని సీఎం తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేస్తుందని, భూమి పరిసరాలు, భూమి లోపల ఉన్న ఖనిజాల గురించి విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం లకు నేడు తొలి అడుగు వేసామని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన వసతులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించి నందుకు ప్రజల తరఫున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు గోదావరి జలాలు, విద్యుత్ కేంద్రం రావాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అన్నారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, ప్రజలు పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు అందించాలని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి,

# హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ పోరుబాట

ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు.ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి.డిసెంబర్ 3, 4 తేదీల్లో హిల్ట్ పాలసీ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా..క్లస్టర్–1లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలో మాజీమంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించనున్నారు.క్లస్టర్–2లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు.క్లస్టర్–3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి నేతృత్వంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కూడిన బృందం మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తారు. క్లస్టర్–4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.క్లస్టర్–5లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియాలను పరిశీలిస్తారు.క్లస్టర్–6లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు.క్లస్టర్–7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, పటోళ్ల కార్తిక్ రెడ్డి.. కాటేదాన్, హయత్‌నగర్‌లో పర్యటిస్తారు. క్లస్టర్–8లో మాజీ మంత్రి మహ్మూద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎండీ సలీం, చందులాల్‌తో కూడిన బృందం బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారు.

# పీఎంవో.. ఇక సేవాతీర్థ్

పేరుతో కొనసాగుతోన్న గవర్నర్ల అధికారిక నివాసాలను ఇకపై 'లోక్‌భవన్'గా మార్చాలని కేంద్రం ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఒడిశా, త్రిపుర, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల గవర్నర్లు తమ బంగ్లాలను లోక్‌భవన్‌గా మార్చారు. మిగతా రాష్ట్రాలు కూడా పేరు మార్చాలని కేంద్రం నుంచి సూచనలు వచ్చాయి. వలసవాదానికి చిహ్నాలుగా ఉన్న పేర్లను తొలగించి ప్రజాస్వామ్య పంథాలో పేర్లను పెడుతున్నట్టు సమాచారం. సెంట్రల్ విస్టా అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలను న్యూ ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌లోకి మార్చనున్నారు. వాయుభవన్‌కు పక్కన ఉన్న ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్–1లో ఒక భవనాన్ని సేవాతీర్థ్–1గా పిలవనున్నారు. దానిలో పీఎంవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన రెండు భవనాలు సేవాతీర్థ్–2, సేవాతీర్థ్–3 నుంచి క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా సలహాదారు కార్యాలయం పనిచేయనున్నాయి. ఇప్పటికే ఎన్‌క్లేవ్‌లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.

**రాజ్‌భవన్.. ఇక 'లోక్ భవన్'**

తెలంగాణ రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మారుస్తూ రాష్ట్రప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసింది. అన్ని రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వలసవాద వాసనలను తుడిచిపెట్టేం దుకు..రాజ్‌భవన్, రాజ్ నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాసిన లేఖకు అనుగుణంగా చాలా రాష్ట్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చారు. ఇప్పుడు ఆ జాబితాలో తెలంగాణ కూడా చేరింది.

# ఎస్సీ వసతిగృహంలో ఫుడ్ పాయిజన్..

తరలించారు. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయని, ఆ విషయాన్ని వార్డెన్‌కు చెప్పడంతో పారవేశారని విద్యార్థులు తెలిపారు. ఆ తర్వాత అరటిపళ్లు, బిస్కెట్లు తిని స్కూల్‌కి వెళ్లారు. కొద్దిసేపటికే కడుపునొప్పి, వాంతులైనట్లు విద్యార్థులు చెబుతున్నారు.

# సోనియా, రాహుల్‌లకు అండగా మనమంతా ఉన్నాం




సీఎం మాట్లాడుతూ.. గాంధీని హత్య చేసిన పార్టీ బీజేపీ అని అన్నారు.. నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించడం మోదీ ప్రభుత్వ లక్ష్యపూర్వక చర్యే అని విమర్శించారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా విచ్చలవిడిగా కేసులు తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విలువలను కాపాడే బాధ్యత అందరిదినని, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు మద్దతుగా నిలబడే తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్దరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు. డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచస్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ – 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమల ను తరలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకెళు న్నామన్నారు. గత పదేళ్లలో తెలంగాణకు ఒక్క ఎయిర్‌పోర్టు కూడా తేలేదంటూ బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 4 ఎయిర్‌పోర్టులు తెచ్చామని గుర్తు చేశారు. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. అందరి కృషితో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కోటి మంది మహిళలకు చీరలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చీరలు అందలేదంటూ ఫిర్యాదులు వస్తే అందుకు డీసీసీలదే బాధ్యత అంటూ సీఎం హెచ్చరించారు. డిసెంబర్ నెలాఖరులోగా మహిళలందరికీ చీరలు అందించాలని డీసీసీలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక రాష్ట్ర పరిపాలన గురించి మాట్లాడుతూ.. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమ దిశగా ముందుకు తీసుకెళ్తున్నాం. కొత్త సర్పంచులు ఎన్నికయ్యే సందర్భంలో జిల్లా అధ్యక్ష పదవులు రావడం మీకు గొప్ప అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సులు వంటి సంక్షేమ పథకాలపై చర్చ పెట్టాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. కేసీఆర్ ఇచ్చిన చీరలు పనికిరావని ప్రజలు నిందించారు. కానీ, మనం నిజాయితీతో కోటి మందికి చీరలు ఇస్తున్నాం. ఏ ఆడబిడ్డ కూడా చీర దక్కకుండా ఉండకూడదని తెలిపారు. డిసెంబర్ నెలాఖరులోగా చీరలు అందజేయకపోతే అది జిల్లా కాంగ్రెస్ కమిటీల బాధ్యత అవుతుందని హెచ్చరించారు. అలాగే అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడుతూ.. నాచారం ప్రాంతంలోని పరిశ్రమలను పట్టణం వెలుపలకు మార్చాలని, ఇందుతో మధ్యతరగతి కుటుంబాలు భూములు కొనుగోలు చేయగలవని, పేదలకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన డిసెంబర్‌లో జరుగుతుందని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రానికి బుల్లెట్ ట్రైన్ ఎందుకు ఇవ్వడం లేదని మోదీని ప్రశ్నిస్తానని, ఇస్తే.. ప్రజలకి మంచిది, ఇవ్వకపోతే తెలంగాణ ప్రజల రియాక్షన్ బీజేపీ చూస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడుతూ.. రాజకీయాల్లో కాళ్లకు కట్టెలు పెట్టడం సహజం. కానీ అక్కడే ఆగిపోవద్దు, ముందుకు సాగాలని కార్యకర్తలకు హితబోధ చేశారు.

# రానున్న పదేళ్లలో అణుయుద్ధం

**ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే అయిదు, పదేళ్లలో అణుయుద్ధం జరగొచ్చని పేర్కొన్నారు. ఎక్స్‌లో ఓ యూజర్ పోస్టుకు సమాధానంగా మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. హంటర్ యాష్ అనే ఓ యూజర్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టాడు. 'అణ్వాయుధాలు ప్ర ధాన శక్తుల మధ్య యుద్ధాన్ని, యుద్ధ ముప్పును నిరోధిస్తాయని ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు పిచ్చిగా నమ్ముతున్నాయి. కాబట్టి.. ఆ ప్రభుత్వాలపై బయటి శక్తుల నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదు' అని రాసుకొచ్చాడు. దీనికి ఎలాన్ మస్క్ బదులిస్తూ యుద్ధం కచ్చితంగా జరుగుతుందని పేర్కొన్నారు. 'యుద్ధం అనివార్యం. 5, 10ఏళ్లలో ఇది జరుగుతుంది' అని రాసుకొచ్చారు. అయితే, తన వ్యాఖ్యలపై మస్క్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటుచేసిన డోజ్ శాఖలో పనిచేసిన మస్క్.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇక, యుద్ధం జరగబోతోందంటూ మస్క్ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొందరు యూజర్లు గ్రోక్‌ను అడిగారు. దీనికి అది బదులిస్తూ.. ఎలాన్ మస్క్ తన పోస్టుకు సంబంధించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదని తెలిపింది. అయితే, గతంలో ఆయన చేసిన ప్రకటన ఆధారంగా.. సామూహిక వలసలు, రాజకీయ కారణాల వల్ల యూరప్–యూకేలోని అంతర్యుద్ధం జరగొచ్చని మస్క్ హెచ్చరించినట్లు తెలిపింది.

# రెండు దశల్లో 'జనగణన'

సమాధానం ఇస్తూ, జన గణన గురించి తెలిపారు. జన గణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. "జన గణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలో జరుగుతుంది. అయితే లద్ధాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పబడే నాన్–సింక్రోనస్ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది" అని నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్? చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాలను తదుపరి జన గణన కోసం పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు.

**కులగణన కూడా..**

మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్? 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా, కుల గణన కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు తెలిపారు.మరో ప్రశ్నకు జవాబిస్తూ, 2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొబైల్ యాప్?ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. ఇంతకు మునుపే రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి. మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. త్వరలో చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లెక్కవేసుకుంటే ఇది 8వది అవుతుంది.

# హరీష్ రావు కంట్రోల్‌లో రాష్ట్ర బిజెపి

- కీలు బొమ్మల్లా రామచందర్ రావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 2 (జనంసాక్షి) : హరీష్ రావు కంట్రోల్‌లో రాష్ట్ర బిజెపి నడుస్తోందని, తెలంగాణ రాజకీయాల్లో త్వరలో సంచలనం జరగబోతుందని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు చేతిలోకి తెలంగాణ బీజేపీ రిమోట్ కంట్రోల్ వెళ్లిపోయిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు చేతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలు బొమ్మల్లా మారిపోయారని అన్నారు. ఇక నుంచి హరీష్ కార్యక్రమాలను కేటీఆర్ కంటే ఎక్కువగా ప్రచారం వచ్చే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రణాళిక చేస్తోందని చెందారు. తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు కీలక నేతలు.. హరీష్ రావు, ఈటల రాజేందర్ వ్యూహంలో ఇప్పుడు బీజేపీ చిక్కిందని అన్నారు. ప్రస్తుతం సామ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచింది. మరోసారి హరీష్ రావు బీజేపీ తీర్థం పుచ్చుకుం టారనే వార్తలకు ఆద్యం పోసినట్టయింది. హరీష్ రావు బీజేపీలో చేరుతారంటూ వస్తున్న వార్తలు కొత్తేమి కాదు. గతంలో కూడా హరీష్ గులాబీ గూటి నుంచి ఎగిరిపోయి కాషాయ జెండా కప్పుకుంటున్నారని అనేక వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై హరీష్ రావు పలుమార్లు స్పందించారు. ఆ వార్తలను ఖండించారు. తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉంటానని క్లారిటీ ఇచ్చారు. అయితే ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయబడ్డ ఎమ్మెల్సీ కవిత హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. హరీష్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్, కేటీఆర్ లకు కవిత సూచనలు చేశారు. కాగా కవిత కూడా హరీష్ రావు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారని పరోక్షంగా హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరి త్వరలో తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిమాణాలు జరుగుతాయని సామ రామ్మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ నిజమవుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.

# హిల్ట్ పాలసీతో భూములకు టెండర్

- అనుయాయులకు కట్టబెట్టే కుట్రలు
- మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ విమర్శలు



హైదరాబాద్, డిసెంబర్ 2 (జనంసాక్షి) : దాదాపు 10 వేల ఎకరాల ప్రభుత్వ భూములను కారు చౌకగా కట్టబెట్టేందుకే హిల్ట్ పాలసీ తీసుకొచ్చారని శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ ఆరోపించారు. కేవలం 45 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి డబ్బులు దండుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బండ ప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పరిశ్రమల స్థాపనకు టీఎస్‌ఐపాస్ తెచ్చి 15 రోజుల్లోనే అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భూ దందా కోసమే హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని ఆరోపించారు. పరిశ్రమలకు భూములు ఇచ్చేటప్పుడే కాదు.. అమ్మేటప్పుడు కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. పర్యావరణవేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సోషల్ ఇంపాక్ట్ స్టడీస్ చేయాలనన్నారు. లీజు భూములకు హిల్ట్ పాలసీ వర్తించదని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని బండ ప్రకాశ్ తెలిపారు. మరి జీవోలో మాత్రం 9 వేల ఎకరాలకు పైనే ఎలా ప్రస్తావించారని అడిగారు. బీఆర్‌ఎస్ పాలనలో ఇలాంటి జీవోలు ఎపుడూ ఇవ్వలేదని.. పారదర్శకమైన విధానం అమలు చేశామని స్పష్టం చేశారు. వ్యవసాయరంగంతో పాటు పరిశ్రమలు నడిపేలా చూడటం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. పరిశ్రమలు లేకపోతే ఉపాధి ఎట్ల అని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమలు స్థాపించే అవకాశం పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సూచించారు. బిడ్డింగ్ ద్వారా ఉపయోగంలో లేని పరిశ్రమల భూములను అమ్మాలని.. చాలా రాష్ట్రాల్లో ఈ పద్ధతి అమలు అవుతోందని తెలిపారు.

హిల్ట్ పాలసీ రావడం వెనుక వేల కోట్ల రహస్య ఒప్పందాలు ఉన్నాయని బండ ప్రకాశ్ ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ లో ఉపాధి కల్పించే పరిశ్రమలు రావడం లేదని తెలిపారు. ఫిలిం యూనిట్లపై ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు తప్ప మానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ రావడం లేదని అన్నారు. టీఎస్‌ఐపాస్ ద్వారా కొత్తగా ఎన్నో పరిశ్రమలు తెచ్చి పదేళ్ల కేసీఆర్ పాలనలో 18 లక్షల మందికి ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. హిల్ట్ పాలసీ రద్దు చేసి పారిశ్రామిక భూములు వేలం వేయాలని డిమాండ్ చేశారు. హిల్ట్ కు వ్యతిరేకంగా మా పోరాటాన్ని ఢిల్లీ దాకా తీసుకెళతామని స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల పర్యటనకు 8 నిజనిర్ధారణ బృందాలను పార్టీ నియమించిందని తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ మంత్రులు ఈ బృందాలకు నేతృత్వం వహించి వేర్వేరు క్లస్టర్లలో పర్యటిస్తారని పేర్కొన్నారు. 8 క్లస్టర్లలో మా నేతల బృందం రేపు, ఎల్లుండి పర్యటించి నిజాలు నిర్ధారించడంతో పాటు భూముల ధరలు నిర్ధారిస్తుందని తెలిపారు. బీజేపీ నేతలు కూడా ఆలస్యంగానైనా హిల్ట్ పై మేల్కొన్నందుకు సంతోషమన్నారు. 5 లక్షల కోట్ల రూపాయల భూకుంభకోణంపై గవర్నర్ కూడా స్పందించాలన్నారు. పర్యావరణవేత్తలు కూడా స్పందించాలని.. మా నిజనిర్ధారణ బృందాల పర్యటనల్లో ప్రజలు స్వచ్ఛంధంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిలువు దోపిడీని అరికట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం భూములను కారు చౌకగా కట్టబెడితే పేదల ఇండ్లకు, ఆస్పత్రులకు, పార్కులకు, స్మశాన వాటికలకు భూములు ఎక్కడ్నుంచి తెస్తారని ప్రశ్నించారు.

## సైబర్ నేరాలపై ఆరు వారాల రాష్ట్ర స్థాయి అవగాహన కార్యక్రమం

- నేడు డీజీపీ చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్ (జనంసాక్షి) : "ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్" అనే పేరుతో ఆరు వారాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి, అవగాహన, ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడానికి టీజీసీఎస్‌బి ఒక విస్తృత కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. డీజీపీ బి.శివధర్‌రెడ్డి నేడు మధ్యాహ్నం 2.45 నిమిషాలకు బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ టవర్-సీలోని ఆడిటోరియంలో ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు , పోలీసు అధికారులు హాజరు కానున్నారు.

# సీఎం ప్రజావాణిలో 311 దరఖాస్తులు

**దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య**

హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 311 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 113, రెవెన్యూ శాఖకు సంబంధించి 34, ఇందిరమ్మ ఇండ్ల కోసం 87, మున్సిపల్ శాఖకు 24, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 52 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**త్వరలో ల్యాబ్ టెక్నీషియన్స్ కు పోస్టింగ్స్ :**



చిన్నారెడ్డి



పోటీ పరీక్షల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 1,260 మంది ల్యాబ్ టెక్నీషియన్స్ కు త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి తెలిపారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజా భవన్ కు భారీ ఎత్తున ల్యాబ్ టెక్నీషియన్స్ తరలి వచ్చారు. తమకు పోస్టింగ్స్ త్వరగా ఇప్పించాలని ల్యాబ్ టెక్నీషియన్స్ కోరారు. వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడిన చిన్నారెడ్డి త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు ల్యాబ్ టెక్నీషియన్స్ కు తెలిపారు. దీంతో ల్యాబ్ టెక్నీషియన్స్ సంతోషం వ్యక్తం చేశారు.

## గంజాయి డాన్ కామాక్షమ్మకు చెక్

- ఆమె ఐదు ఇళ్లను నేలమట్టం చేసిన జనం

నెల్లూరు,డిసెంబర్ 2(జనంసాక్షి) : నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు. నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో స్థానికులతోపాటు సీపీఎం నేతల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. దాంతో కామాక్షమ్మతోపాటు అమె బంధువులు, అనుచరుల నివాసాలను స్థానికులు కూలగొట్టారు

## శ్రీశైలం టోల్‌గేట్ వద్ద రివాల్వర్ స్వాధీనం



నంద్యాల, డిసెంబర్ 2 (జనంసాక్షి) : శ్రీశైలం టోల్‌గేట్ వద్ద రివాల్వర్ కలకలం రేపుతోంది. దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టగా.. ఓ వ్యక్తి నుంచి 9 ఎంఎం పిస్టల్ ఒకటి బయటపడింది. దీంతో సదరు తుపాకీని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. విచారణ చేపట్టారు. కాగా.. రివాల్వర్ తీసుకువచ్చిన వ్యక్తిని మధ్యప్రదేశ్ వాసిగా శ్రీశైలం ఆలయ అధికారులు గుర్తించారు. ఆ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ ఎస్ఐ అని ఆయన పోలీసులకు చెప్పుకున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఈ ఘటనపై విచారణలో భాగంగా.. సదరు వ్యక్తి నుంచి రివాల్వర్ సహా ఐడెంటిటీ కార్డును స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్టు శ్రీశైలం సీఐ ప్రసాదరావు పేర్కొన్నారు.

## యెడ్యూరప్పపై ఫోక్సో విచారణపై స్టే





బెంగళూరు, డిసెంబర్ 2 (జనంసాక్షి) : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పపై పోక్సో విచారణపై సుప్రీంకోర్టు మంగళవారం స్టే విధించింది. విచారణ ప్రక్రియను నిలిపివేయడంతో పాటు, యడియూరప్పపై ఉన్న కేసును రాష్ట్ర హైకోర్టుకు తిరిగి ఎందుకు బదిలీ చేయకూడదో తెలియజేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కర్ణాటక సిఐడికి నోటీసులు జారీ చేసింది. కేవలం అస్పష్టమైన, సాంకేతిక కారణాలతో ఈ అంశం యోగ్యతను పరిశీలించలేమని పేర్కొంటూ .. నవంబర్ 13న తమ క్లయింట్‌పై కేసును కొట్టివేయడానికి హైకోర్టు నిరాకరించిందని యడియూరప్ప తరపున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ్ లూత్రా, సిద్దార్థ్ దేవ్‌లు వాదనలు వినిపించారు. గతేడాది ఫిబ్రవరిలో బెంగళూరులోని తన నివాసంలో జరిగిన బిజెపి సమావేశంలో తనపై, తన 17ఏళ్ల కుమార్తెపై యడియూరప్ప లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలి తల్లి కేసు పోలీసులకు తెలిపారు. 2024 మార్చి 14న సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, సిఐడికి బదిలీ చేశారు. సిఐడి పోక్సో కింద ఎఫ్ఐఆర్‌ను తిరిగి నమోదు చేసి, చార్జిషీట్ దాఖలు చేసింది.

## శబరిమలకు వెళ్లే భక్తులకు ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, డిసెంబర్ 2 (జనంసాక్షి) : శబరిమల వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్. ఇప్పటికే 60 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తాజాగా మరో 10 ప్రత్యేక రైళ్లు నడపాలని నిర్ణయించారు. ఈ ప్రత్యేక రైలు సర్వీసులు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు నడపనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 13 నుంచి 31 మధ్య వివిధ తేదీల్లో ఈ రైళ్లు సర్వీసులందించనున్నాయి. ఈ రైళ్లు ఏయే తేదీల్లో ఎక్కడి నుంచి రాకపోకలు సాగిస్తాయనే వివరాలను వెల్లడించింది. దక్షిణ మధ్య రైల్వే నుంచి నడవనున్న సిర్పూర్ కాగజ్ నగర్ -కొల్లం జంక్షన్ (రైలు నం. 07117), చర్లపల్లి -కొల్లం జంక్షన్ (07119), చర్లపల్లి -కొల్లం జంక్షన్ (07121), హుజుర్ సాహిబ్ నాందేడ్ - కొల్లం (07123) రైళ్లకు బుధవారం (డిసెంబర్ 3) నుంచే టికెట్ల బుకింగ్ ప్రారంభం కానుంది. ఈ నాలుగు రైళ్లకు ఉదయం 8గంటల నుంచి టికెట్లు బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# కొత్త అకౌంట్ ద్వారానే ఎన్నికల ఖర్చులు

**ఎన్నికల పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా**

వికారాబాద్, డిసెంబర్ 2 (జనంసాక్షి) : అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు జరపాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా తమ రిధి మేరకు మాత్రమే ఖర్చు పెట్టాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. నిర్ణీత గడువు లోపల నామినేషన్లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులను సూచించారు. వికారాబాద్, నవాబ్ పెట్ మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను షేక్ యాస్మిన్ బాషా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అవసరమైన వారు హెల్ప్ డెస్క్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.

## పవన్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దు

- జనసేన పార్టీ ప్రకటన విడుదల

అమరావతి, డిసెంబర్ 2 (జనంసాక్షి) : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వస్తోన్న విమర్శలపై జనసేన పార్టీ స్పందించింది. రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం దృష్ట్యా పవన్ కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దని జనసేన పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల కోనసీమ జిల్లాలో దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించేందుకు అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా భాసిల్లుతున్నాయి. రాష్ట్రం విడిపోవడానికి కారణం వీటి పచ్చదనమే. నిత్యం పచ్చగా ఉంటుందని తెలంగాణ నాయకులంతా అంటారు. ఇప్పుడు కొబ్బరికి దిష్టి తగిలినట్లుంది అని పవన్ వ్యాఖ్యానించారు.

# పవన్ కళ్యాణ్ నరదిష్టి వ్యాఖ్యలు దుర్మార్గం

**పదిరోజులైనా మన మంత్రులకు సోయిలేదు**

**మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్**

హైదరాబాద్, డిసెంబర్ 2 (జనంసాక్షి) : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ 'నర దిష్టి' వ్యాఖ్యలపై తెలంగాణలో రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రతిపక్ష నేతలతో పాటు కాంగ్రెస్ మంత్రులు మూకుమ్మడిగా దాడికి దిగారు. కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పది రోజుల తర్వాత స్పందించిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మంత్రులు స్పృహలో లేరని విమర్శించారు. కొందరు వాటర్‌లో నీళ్లు కలుపుకుని స్పృహ కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. మరికొందరు కమిషన్లు పంచుకునే పనిలో బిజీగా ఉన్నారని అన్నారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పది రోజులకు స్పందించడం హాస్యాస్పదమని జగదీశ్ రెడ్డి అన్నారు. ఒక ప్రాంతం, ఒక మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలని సూచించారు. ఉద్యమ సమయంలో తామెప్పుడూ ప్రాంతాలను దూషించలేదని తెలిపారు. అన్నదమ్ములుగా విడిపోయి వేర్వేరుగా కలిసి బతుకుదామని కేసీఆర్ ఆనాడే చెప్పారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ నీడలో హైదరాబాద్‌లో ప్రశాంతంగా ఉన్నామని ఏపీ ప్రజలే చెప్పారని గుర్తుచేశారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటే మంచిదని హితవుపలికారు. పవన్ కల్యాణ్ సినిమాలను ఆపుతామని ఇక్కడి మంత్రి కామెడీగా మాట్లాడుతున్నారని కోమటిరెడ్డిని ఉద్దేశించి జగదీశ్ రెడ్డి విమర్శించారు. వాస్తవానికి అభిమానం వేరు.. రాజకీయం వేరు అని చెప్పారు. తమ అభిమాన హీరోగా ఎవరి సినిమాలనైనా ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. పది రోజుల తర్వాత కాంగ్రెస్ మంత్రులు స్పందించిన తీరు ఇద్దరిలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్టుందని విమర్శించారు. కండ్ల ముందు కృష్ణా నీళ్లు తీసుకెళ్తుంటే అప్పుడూ అలసత్వమే అని మండిపడ్డారు. నీళ్లు, కమిషన్లపై పెట్టిన దృష్టి అభివృద్ధిపై పెడితే మంచిదని సూచించారు. తాజాగా బీఆర్‌ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కూడా పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడుతూ.. పవన్ రాజకీయ ప్రయాణాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సొంతగా ఎన్నికల్లో గెలవలేక, కమ్మ, కాపు సామాజిక వర్గాలను ఏకం చేసి సినిమాలో లాగా సమయానికి చంద్రబాబు వచ్చి కాపాడితే గెలిచి ఉప ముఖ్యమంత్రి అయ్యావు. అసలు తెలంగాణ మీద నీకెందుకు అంత ఏడుపు? తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నావా? అంటూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో ధ్వజమె త్తారు. తెలంగాణ ప్రజలను అవమానించేలా పవన్ వ్యాఖ్యలు ఉన్నాయని, వాటిని బీఆర్‌ఎస్ పార్టీ ఖండిస్తుందని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ వివాదంపై పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

## దేశంలో 811 మందికి ఒక వైద్యుడు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (జనంసాక్షి) : దేశంలో వైద్యులు-జనాభానిష్పత్తి 1:811 అని కేంద్రం పార్లమెంటుకు మంగళవారం తెలిపింది. సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యమంత్రి రాజ్యసభలో సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అల్లోపతి మరియు ఆయుష్ ( ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం,యునాని, సిద్ధ మరియు హోమియోపతి)ల్లో 80శాతం నమోదిత వైద్యులు అందుబాటులో ఉన్నారని ఊహిస్తే, దేశంలో వైద్యులు-జనాభా నిష్పత్తి 1:811గా అంచనా వేయబడిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో 13,88,185 మంది నమోదిత అల్లోపతి వైద్యులు ఉన్నారని, ఆయుష్ వైద్య విధానంలో 7,51,768మంది రిజిస్టర్డ్ ప్రాక్టిషనర్లు ఉన్నారని కేంద్ర ఆరోగ్యమంత్రి జె.పి.నడ్డా తెలిపారు.దేశంలో మెడికల్ కాలేజీలు, అండర్ గ్రాడ్యుయేట్ (యుజి), పిజి వైద్య సీట్లు గణనీయంగా పెరిగాయని అన్నారు. 2014 నుండి మెడికల్ కాలేజీల సంఖ్య 387 నుండి 818కి, యుజి సీట్లు 51,348 నుండి 1,28,875కి, పిజిసీట్లు 31,185 నుండి 82,059కి పెరిగాయని అన్నారు.

# అయ్యా నా భార్యను గెలపించండి

**ఓ వ్యక్తి కన్నీటితో భార్య కోసం ప్రచారం**

సిద్దిపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి) : ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో ఎలాగైనా తన భార్యను సర్పంచ్‌గా గెలిపించాలని ఓ వ్యక్తి ఇల్లిల్లు తిరుగతూ ప్రచారం చేపట్టాడు. ఎలాగైనా గెలిపిస్తే గ్రామానికి సేవ చేస్తానంటూ ఆ వ్యక్తి కంటతడి పెట్టుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలో జరిగింది. నాగుల ప్రశాంత్ అనే వ్యక్తి గత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. రెండో విడత నామినేషన్లకు మంగళవారం చివరి రోజు కావడంతో భార్యతో నామినేషన్ వేయించాడు. గత ఎన్నికల్లో తాను ఓడిపోయాయని.. ఈసారి తన భార్య నాగుల స్రవంతిని గెలిపించాలని వేడుకుంటూ కంటతడి పెట్టుకున్నారు. ఈసారి తనను సర్పంచ్‌గా గెలిపించాలని స్రవంతి ఓటర్లను కోరారు. మహిళకు రిజర్వ్ కావడంతో అతను తన భర్యను బరిలోకి దింపాడు. గతంలోనే తాను ఉన్నదంతా ఖర్చు పెట్టానని అన్నాడు. అందువల్ల ఈసారి గెలిపించాలని వేడుకున్నాడు.

# అఖండ-2 టిక్కెట్ ధరల పెంపు

- ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

అమరావతి, డిసెంబర్ 2 (జనంసాక్షి) : బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ2: తాండవం' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఈనెల 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అఖండ2' టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.సింగిల్ స్క్రీన్‌లో రూ.75, మల్టీ ప్లెక్స్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) ధర పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. డిసెంబరు 4న రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్యలో ప్రీమియర్‌కు కూడా అనుమతి లభించింది. ఈ టికెట్ ధరను రూ.600గా (జీఎస్టీతో కలిపి) నిర్ణయించారు. రోజుకు ఐదు షోలతో పాటు, పెంచిన ధరలు విడుదల తేదీ నుంచి 10 రోజుల పాటు అమల్లో ఉంటాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
3 డిసెంబర్ 2025

## 20వ శతాబ్దం భారతీయ నైతికతనూ
# సంస్కృతికి పునాది వేసిన తరం!

"ప్రకృతి రీతిని అనుసరించి, కుటుంబ బంధాలను కాపాడుకుంటూ, 20వ శతాబ్దం మధ్య కాలం నుండి చివరి దశ వరకు జీవించిన ఆ పెద్దతరం, విలువలలోనూ నైతికతలోనూ భారతీయ సంస్కృతికి పునాది వేసిన తరం."

కనుమరుగవుతున్న పెద్ద తరం గురించి మాట్లాడితే అది కేవలం మనుషుల గురించే కాకుండా ఒక విలువల ప్రపంచం గురించి మాట్లాడినట్టే. మన కళ్లముందు నిశ్శబ్దంగా ముగిసిపోతున్న ఈ తరం భోజనపు అలవాట్ల నుండి సంబంధాల వరకు, విద్య నుండి వినోదం వరకు ప్రతి రంగంలో కూడా విలువలతో నిండి ఉన్న జీవన విధానానికి ప్రతీక. అన్నం తినేముందు పక్కవాళ్ల ఆకలిని గుర్తించిన హృదయం, చిన్న ఇంటి గోడల్లోనూ విశాల మనసుతో జీవించిన స్వభావం, "నేను" అనే స్వార్థ భావన కంటే "మనం" అనే ఐక్యతను గొప్పగా భావించిన మనోభావం కలిసి ఆ తరాన్ని అలంకరించాయి.

పదవ తరగతి సర్టిఫికెట్ కూడా లేకపోయినా జీవితాన్ని ఆచరణలోనే చదివిన జ్ఞానం ఆ పెద్దతరం సొంతం. గడియారం చేయిలో లేకపోయినా కాలాన్ని గౌరవించి పూట పనిని పూటపూటకే పూర్తి చేసిన అలవాటు ఉండేది. లాంతరు వెలిగించిన సాయంత్రాలు గడిపినా బుద్ధిలో మాత్రం ప్రకాశవంతమైన విలువల వెలుగులు ఉండేవి. తపాలా కార్డు మీద కొన్ని పంక్తులు రాస్తూ బంధాల్ని నిలబెట్టుకున్న హృదయం ఆ తరం సొత్తు. ఆస్తి కంటే ఆత్మీయతను ఎక్కువగా నిలబెట్టిన పద్ధతి ఆ పెద్ద మనుషుల ధర్మం. పిల్లల బాల్యాన్ని ఆట పాటలతో నింపి ఆ తర్వాత ప్రభుత్వ బడిలో తెలుగు మాధ్యమంలోనే చదివించి జీవితానికి బలమైన పునాది వేసిన బాధ్యత గల తల్లిదండ్రుల తరం అది. తెలుగులో బలమైన పునాది ఇచ్చి తర్వాత ఇంగ్లీషు నేర్పించి రెండు భాషల్లోనూ నిలబడగలిగే నైపుణ్యాన్ని పిల్లలలో పెంచిన చిత్తశుద్ధి ఆ తరానికి ప్రత్యేక గుణం. చిన్న చిన్న పొలాల్లో శ్రమించి వచ్చిన తిండి అయినా ఆ తిండి వెనుక అనేక త్యాగాలు, ఎన్నో అర్ధరాత్రుల నిద్రలేమి దాగి ఉండేది.

ఉమ్మడి కుటుంబాలు ఆ పెద్దతరం జీవనశైలిలో ముఖ్య స్థానం. ఒక్క ఇంట్లో అనేక కుటుంబాలు, ఒకే వంటగది, ఒకే ఖర్చు, కలిసికట్టుగా జీవించే పద్ధతి. అభిప్రాయ భేదాలు వచ్చినా కుటుంబాన్ని విడిచిపెట్టడం కాదు, మాట్లాడుకుంటూ, పెద్దవాళ్ల మధ్యవర్తిత్వంతో సమస్యను పరిష్కరించే పద్ధతి. చిన్నవాడు తప్పు చేస్తే మొదట స్కూలు గురువు శాసించేవాడు, తర్వాత ఇంట్లో తల్లిదండ్రులు మరింత క్రమశిక్షణ నేర్పించేవారు. ప్రేమలో కఠినత, కఠినతలో పరమ ప్రేమ కలిసిన శిక్షణ ఆ తరానికి నిత్యకర్మ.

సుఖాల కోసం సాంకేతిక సౌకర్యాలు లేకున్నా ఆనందాన్ని సాదాసీదా జీవితపు చిన్న చిన్న క్షణాల్లోనుంచే వెతికిన స్వభావం వాళ్లది. ఇంటి అరుగుపై కూర్చొని పొరుగువారితో కబుర్లు చెప్పుకుంటూ గడిపిన రాత్రులు, వీధి నాటకాలు, బుర్రకథలు, తోలుబొమ్మలాటల్ని ఆస్వాదించిన సంస్కృతి, చద్దన్నం తిని స్కూలుకెళ్లినా ఆత్మ గౌరవం కాపాడుకున్న ధోరణి – ఇవన్నీ ఆ తరం విలువల ప్రతిఫలాలు.

ఆరోగ్య పరంగా చూసినా ఆ పెద్దతరం మీద ప్రకృతి దయ స్పష్టంగా కనిపిస్తుంది. చెరువు, బావి, బుగ్గల నీళ్లు తాగి శక్తివంతంగా జీవించిన జీవన శైలి, ఎక్కువ శారీరక శ్రమ, తక్కువ కృత్రిమ ఆహారం, నిరాడంబర జీవితం కలిసిపోవడంతో రక్తపోటు, చక్కెర, గుండె జబ్బులు వంటి పదాలు వారి జీవితాలలో పెద్దగా కనిపించలేదు. కార్పొరేట్ ఆస్పత్రులు లేని కాలంలోనూ సాదాసీదా మందులతో, గృహ చిట్కాలతో ఆరోగ్యాన్ని నిలబెట్టుకున్న తరం అది. అయితే ఈ తరం గొప్పతనాన్ని నెమరువేసుకుంటూ కేవలం గతాన్ని పూజించడం సరిపోదు. ఈ విలువలు నశించడానికి కారణాలు ఏమిటి అనే ప్రశ్నను కూడా మనం సీరియస్‌గా తీసుకోవాలి. పట్టణీకరణ, చిన్న కుటుంబాల విస్తరణ, వినియోగోత్పత్తి సంస్కృతి దూసుకొచ్చిన వేగం, డబ్బును దేవుడిగా చూసే దృష్టి – ఇవన్నీ కలిసి కుటుంబ బంధాలను క్రమంగా పలచబర్చాయి. సంబంధాల్ని పరస్పర అవసరాల ఒప్పందాలుగా చూసే కొత్త మనస్తత్వం, చిన్న తేడాలకే సంబంధాలు తెంచే సున్నితత్వం పెరిగింది.

సాంకేతికత మనకు అనేక అనుకూలతలు ఇచ్చినా, అదే సాంకేతికత మన మధ్య మానవీయ సంబంధాలను నెమ్మదిగా దూరం చేస్తున్న నిజాన్ని ఈ పెద్దతరం కనుమరుగవుతుండటంతో మనం మరింత తీవ్రంగా అనుభవిస్తున్నాం. చేతి ఫోన్ నిండా సంప్రదింపు సంఖ్యలు ఉన్నా మనసులో మాత్రం ఒంటరితనం పెరుగుతుండడం, దూరదర్శిని తెరపై రంగులు పెరిగినా కుటుంబ సంభాషణలకు సమయం తగ్గిపోవడం, ఫలానా యంత్రం శక్తిని తగ్గించిందని వైద్యుల హెచ్చరికలు వినిపిస్తూనే శరీరం వ్యాయామం లేక నిశ్చలంగా మారిపోవడం – ఇవన్నీ విలువల క్షీణతతో కలిసిన జీవన సంక్లిష్టతలు.

ఇప్పుడు నిజమైన ప్రశ్న ఈ తరం ఏమి కోల్పోతోందన్నది కాదు, ఆ పెద్దతరం నుండి ఏమి నేర్చుకోగలదన్నది. ఆత్మాభిమానం దెబ్బతినకుండా సాదాసీదా జీవితం గడపడం ఎలా, సొమ్ము తక్కువున్నా గౌరవం ఎంతో ఉన్న జీవితాన్ని ఎలా నిర్మించుకోవాలి, బంధాల్ని చిన్న చిన్న లాభ నష్టాలతో తూకం వేయకుండా ఎలా కాపాడుకోవాలి అనే పాఠాలు ఆ పెద్దతరం జీవితం మొత్తం ఒక పాఠ్యపుస్తకంలా మన ముందే ఉన్నాయి.

ఇప్పటి తరానికి సాంకేతిక విజ్ఞానం, సమాచార సమృద్ధి, వినియోగ సౌకర్యాలు అన్నీ ఉన్నాయి. ఇవన్నింటితో పాటు ఆ పెద్దతరం సొంతం చేసుకున్న నిజాయితీ, కష్టపడే పద్ధతి, త్యాగస్వభావం, సహజీవన దృక్పథం లేకుంటే ఈ సమస్తం కేవలం శూన్యపు ఆర్భాటంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. పిల్లల చేతిలో యంత్రాలు పెట్టేముందు హృదయంలో విలువల విత్తనాలు నాటే బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పెద్దలను వృద్ధాశ్రమాల్లోకి తోసేయకుండా, ఇంట్లోనే ఆప్యాయతా వాతావరణంలో చూసుకునే సంస్కృతి పునర్నిర్మాణం అవసరం.

కనుమరుగవుతున్న ఆ పెద్దతరం కోల్పోవడం అంటే కేవలం మన తాతలు, అమ్మమ్మలు వెళ్ళిపోవడం మాత్రమే కాదు, మన సంస్కృతికి నేలగడలు కూలిపోవడం వంటి ప్రమాదం. గోడలపై వేలాడే వారి ఫోటోలు వారి ముఖాలను గుర్తు చేస్తాయి, కానీ మనం వారి విలువలను అనుసరించనంత వరకూ ఆ ఫోటోలు ఒక వెలుగు బొమ్మ కన్నా పెద్ద అర్థం కలిగించవు. పెద్దవాళ్ల కళ్లలో కనిపించిన తృప్తి చిరునవ్వు వెనుక వారు చేసిన త్యాగాల చరిత్ర దాగి ఉంటుంది.

లాంతర్ల వెలుతురులో జీవితం వెలిగించిన ఆ తరం ప్రకృతితో అనుసంధానమైన సహజ జీవనం ఎలానో ఆచరణ ద్వారా మనకు చూపించింది. నేడు విద్యుత్ దీపాల కాంతి పెరుగుతున్న కొద్దీ హృదయాలలో చీకట్లు పెరగకుండా చూడాలంటే ఆ పెద్దతరం చూపిన మార్గాన్ని మనం గుర్తు చేసుకోవాలి. ప్రకృతితో సహజీవనం, సమాజంతో సహకారం, కుటుంబంతో సాన్నిహిత్యం, స్వయంక్రమశిక్షణ అనే నాలుగు మూలస్తంభాలపై వేలాడుకున్న ఆ జీవన విధానం ఈ తరం మళ్లీ ఆలోచించుకోవాల్సిన పాఠం. కనుమరుగవుతున్న పెద్దతరం నిజానికి నీతి నిజాయితీలకు నిలువెత్తు పెట్టుబడి. ఆ పెట్టుబడిపై ఈ తరం వడ్డీ తినడమే చేయక, కొత్త విలువలను జోడించి భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యత తీసుకుంటేనే సమాజం బలంగా నిలబడుతుంది. లేకపోతే పాత తరాన్ని కోల్పోయిన బాధతో పాటు మనిషితనాన్ని కోల్పోయిన ఖాళీ కూడా ఈ తరం భరించాల్సి వస్తుంది. నిజమైన కృతజ్ఞత అంటే పెద్దలను పొగుడుతూ కొన్ని పంక్తులు రాయడం కాదు, వారి జీవిత విశ్వాసాన్ని మన జీవనంలో ఆచరణగా మార్చడం. ఆ విధంగా చూశాకే కనుమరుగవుతున్న పెద్దతరం నిజంగా మనలో జీవిస్తూ ఉంటుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



మలిచే ఉలి కళ్లకు కనిపించక ముందు మనోహర శిల్పాలన్నీ బండరాళ్లకదా!?

## ఓటర్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో
# యువతను ఎన్నుకోవాలి



యువత మేలుకోవి స్థానిక సంస్థలను ఏలుకో రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగనున్నాయి. దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని మహాత్మ గాంధీ నినదించాడు.గ్రామీణ స్వరాజ స్థాపనకు స్థానిక సంస్థలే క్రియాశీల పాత్ర పోషిస్తాయి. బలవంతరాయ్ మెహతా కమిటీ సిఫారసుల మేరకు దేశములో గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రములో ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థలు ఎన్నికలు నోటిఫికేషన్ జారీ చేసిందిఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది.

విజ్ఞత గల ఓటర్లు గ్రామ పంచాయతీ మండల పరిషత్ జిల్లా ప్రజా పరిషతులకు జరిగే ఎనికల్లో పోటీ చేస్తున్న యువ నాయకులకు తమ అమూల్యమైన ఓటు వేసి గ్రామీణ ప్రాంతాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాల్లో సురాజ్య స్థాపన యువత తోనే సాధ్యమౌతుంది. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి యువత శక్తి సామర్థ్యాలు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించడం ఓటర్ల బాధ్యత. తెలంగాణ ఏర్పడి దశాబ్ది కాలం దాటింది. స్వరాష్ట్ర సాధనలో క్రియాశీల పాత్ర పోషించిన యువతను రాష్ట్ర పాలనలో భాగస్వాములను చెయ్యాల్సిన బాధ్యత ఓటర్లదే. ప్రపంచ దేశాల్లో యువత అధిక శాతం ఉన్న దేశంగా భారత్ గుర్తించబడింది. కానీ రాజకీయాలలో చట్టసభల్లో యువత ప్రాతినిధ్యం తక్కువ ఉంది. రాజకీయ అధికారమే సమస్యల పరిష్కారానికి మూలం ఇందులో యువత వెనుకబడి ఉన్నారు. రాజకీయాలు అంటే యువత అంటారని రంగంగా పరిగణిస్తున్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

ప్రజాస్వామ్యంలో రాజకీయాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి అని యువత తెలుసుకోవాలి. ఉన్నత చదువులు ఉద్యోగం చూసుకోవడం సోషల్ మీడియాలో కాలం గడపడం కొరకే పరిమితం అవుతున్నారు. నేటి యువత రేపటి సీనియర్ సిటిజన్స్. భవిష్యత్తు చట్టసభ సభ్యులు స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న వారు దేశానికి నమ్మకమైన నాయకత్వాన్ని అందించారు. రాష్ట్రంలో కళాశాలలో ఎన్నికలు లేకపోవడం వల్ల స్టూడెంట్ యూనియన్ నాయకులు తయారుకాలేకపోతున్నారు. విద్యార్థి రాజకీయాల నుంచి చాలామంది చట్ట సభ సభ్యులుగా ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఉదాహరణలు ఉన్నాయి. భారత మాజీ ఉపాధ్యక్షులు ఏం వెంకయ్యనాయుడు చంద్రబాబు నాయుడు ప్రస్తుత తెలంగాణ సీఎం ఏ రేవంతరెడ్డి ( జెడ్పీటీసీ సభ్యునిగా రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టాడు) గ్రామీణ స్థాయి సమస్యల పరిష్కారానికి నాయకత్వం కొరత ఉంది. యువత ను గ్రామ పంచాయతీ సర్పంచిగా వార్డు మెంబర్స్ గా ఎన్నుకోవాలి.

**దేశంలో నవ రాజకీయాలకునాంది పలకాలి.**

భారత దేశ జనాభాలో15బి 29 యేళ్ల.యువత 27.5శాతం వున్నారు యువత జాతి ప్రగతికి సంధాన కర్తలు' అభివృధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది .మన దేశంలో యువత శాతం పెరుగుతుంది. మన దేశం 2020 నాటికి ప్రపంచములో అత్యంత 'యువ దేశంగా" నిలిచింది. దేశ జనాభాలో 40 శాతం ఉన్న యువత అత్యంత మానవ వనరు అని చెప్పవచ్చు జాతి భవిష్యత్తు వారే కనుక యువత నిర్వహించాల్సిన పాత్ర మహత్త రమైంది.వారి సృజనాత్మకత ఉత్సాహం' శక్తి కలిసి దేశంలో అద్భుతఫలితాలివ్వగలవు. జాతీయ రాజకీయ పార్టీలు 'ప్రాంతీయ రాజకీయ పార్టీలు 'ఉప ప్రాంతీయ పార్టీలు యువతను విద్యావంతులను ఓటు బ్యాంకుగా ఓట్లను సమీకరించె కార్యకర్తలుగా ఉపయోగించుకోవడం రాజకీయ పార్టీల సాంప్రదాయమైంది. విద్యా వంతులైన యువతకు చట్టసభలలో ఎన్నిక కావడానికి విద్యార్థి సంఘం తరపున. యువజన సంఘం తరపున. కుల సంఘాల తరపున. వారి వారి జనాభా మరియు ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన రిజర్వేషన్ పద్ధతి ప్రకారంగా. వారు పార్టీలలో అనుబంధ సంఘాలలో పనిచేస్తున్న సీనియారిటీ ఆదరంగా గ్రామ పంచాయితీ వార్డ్ సభ్యుని నుండి 'మండల జిల్లా 'పరిషత్ మున్సిపాలిటీ మిన్సిపల్ కార్పొరేషన్లు 'ఎమ్మెల్యే 'ఎంపీ ఎమ్మెల్యే' పదవులకు జరిగే చట్ట సభ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా విద్యా వంతులైన యువతకు అవకాశం కలిపించాలి.లియువతకు 50 శాతం టికెట్స్ ఇవ్వాలిలి లియువతకు విద్యావంతులకు తప్పనిసరిగా 50% సీట్లు కేటాయించవలసిన అవసరం ఎంతైనా ఉంది. నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లుగానే నేటి యువత విద్యావంతులే రేపటి భవిష్యత్తు దేశ ప్రగతి రథ సారధులు. భవిష్యత్తు చట్ట నిర్మాతలు కనుక దేశ భవిష్యత్తు వీరిపైనే ఉంది. జనాభాలో15 బి 29 యేళ్ల వయసున్న యువత 27.5 శాతం వుంది యువ శక్తి వనరులు ఎక్కువ వున్న దేశంగా భారత్ ప్రపంచములో గుర్తించ బడ్డది . విద్యావంతులలో గ్రాడ్యుయేషన్. పోస్ట్ గ్రాడ్యుయేషన్. డాక్టరేట్ పట్టభద్రులు కూడా వివిధ సంఘాలలో వివిధ రాజకీయ పార్టీలలో వివిధ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. వార్డు సభ్యుడు మొదలుకొని పార్లమెంటు సభ్యుడు వరకు చట్టసభలకు జరిగే సార్వత్రిక మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీలు టికెట్స్ ఇవ్వాలి గతంలో యువత రాజకీయ పార్టీలో పార్టీకి చేసిన సేవలు సీనియారిటీ నిబద్ధత ప్రజా సంభందాలు మొన్నగు అంశాలను లెక్కలోకి తీసుకోవాలి. రిజర్వేషన్ వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**యువత రాజకీయాలు ఉపాధి కల్పన భారత దేశం**

ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలల్లో నిరుద్యోగం ప్రధానమైనది. "ఓనామాల నుండి డాక్టరేట్ డిగ్రీ "వరకు ఉన్నత విద్యలను అభ్యసించిన కూడా ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదు. కనుక సామాజిక అంశాలపై సంక్షేమ పథకాలపై దేశ పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన యువతకు విద్యావంతులకు చట్ట సభలకు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు టికెట్లను కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాలలో యువకులకు నాయకత్వము కలుగుతుంది గ్రామీణ సమస్యల పరిష్కారానికి యువత శక్తివంతంగా పనిచేసే అవకాశం ఏర్పడుతుంది.నిరుద్యోగ యువతకు రాజకీయ రంగములో పరోక్షం గా ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి కొంతవరకు నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. యువత సంఘ విచ్ఛిన్నకర కార్యకలాపాలకు దూరంగా వుండే అవకాశం కలుగుతుంది. సామాన్యుని ముంగిట్లో ప్రగతి ఫలాలు యువత ప్రజాస్వామ్యం ప్రగతి ఫలాలు సామాన్యుని ముగిట్లోకి చేర్చడానికి యువత కృషి చెయ్యాలి. యువతకు వివిధ రాజకీయ పార్టీలు ప్రజల సేవ చేయడానికి అవకాశం కల్పించాలి. వారికి అవకాశాలు దక్కకపోవడంతో ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో రాజకీయ పార్టీలు వివిధ అనుబంధ సంఘాలలో సేవలు మాత్రమే ఉపయోగించుకొని వారికి తగిన అవకాశాలు ఇవ్వకపోవడంతో నిరుద్యోగులుగా. పని లేకపోవడం వల్ల సోమరులుగా తయారై మత్తుకు మాదక ద్రవ్యాల వినియోగం' దొంగతనాలకు డ్రగ్స్ కు అలవాటు పడి నేరాలకు పాలుపడుతున్నారు. వివిధ వ్యసనాలకు అలవాటు పడి నిరాశ నిస్పృహలకులోనై డిప్రెషన్ తో ఆత్మహత్యలకు పాల్పడి వారి కుటుంబ సభ్యులకు గర్భ శోకం కలిగిస్తున్నారని అనేక సామాజిక ఆర్థిక సర్వేల్లో వ్యక్తమైంది. యువత కుటుంబ సభ్యులపై వృద్ధులైన తల్లిదండ్రులపై బ్రతుకు భారంగా రోజులు సాగదీస్తున్నారు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం:స్వాతంత్ర్య అనతరం తెలంగాణ ఉద్యమం వరకు దేశములో జరిగిన సాంఘిక రాజకీయ పౌర ఉద్యమాల వ్యూహాల్లో కార్యకలాపాల్లో యువత కేంద్ర బిందువుగా వుండడం గమనార్హం. రాజకీయ పార్టీలుయువతను పార్టీజెండాలు పట్టి జై కొట్టడానికి గొంతులు చించుకొని నినాదాలు బిగ్గరగా ఇవ్వడానికి మాత్రమే వీరిని ఉపయోగించుకుంటే సరిపోదు.

**రాజకీయ పార్టీలకు కనువిప్పు**

మైకెల్ గ్రీస్ రాసిన " సామాజిక రాజకీయ మార్పులో క్రియాశీలక ప్రతినిధులుగా యువత" అనే పుస్తకములో యువతలో సానుకూల దృక్పథం కలిగించి అభివృద్ధికి అనువుగా మలుచుకోవడం అనేది ఎప్పటికప్పుడు విస్తృత స్థాయిలోని బలీయమైన ఉద్యమము చేపట్టాల్సి ఉంటుందనీ పేర్కోవడం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి.ప్రస్తుతం రాష్ట్రంలోనూ. దేశంలోనూ వివిధ రాజకీయ పార్టీలలో వివిధ విభాగాల్లో ప్రతినిధులుగా వివిధ హోదాలలో పనిచేస్తున్నయువత సేవలను గుర్తించాలి.



నేదునూరి కనకయ్య
అధ్యక్షులు,
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్, 9440245771

# 'సర్' అనేది.. ప్రజాస్వామ్య హత్యకు ఓటర్ చోరీ సాధనం?

పరకాల ప్రభాకర్ గారి మాటల్లోని కటువైన వాస్తవాలు భారతీయ ప్రజాస్వామ్యానికి ఇప్పుడు ఎదురైన ప్రమాదకరమైన మలుపును సూచిస్తున్నాయి. సజాతీయ సమాజం నిర్మాణం అనే పేరుతో, ఓటర్ల జాబితాలను కృత్రిమంగా మార్చే సిటిజన్‌షిప్ సవరణ చట్టం (సిఎఏ) కింద వచ్చిన సజాతీయత, ఇమిగ్రేషన్ సర్టిఫికేట్ (సర్) ప్రక్రియ, నిజానికి ఓటరు జాబితా నుండి నిర్దిష్ట వర్గాల ప్రజల పేర్లను 'చట్టబద్ధంగా' తొలగించే పరికరంగా మారింది. ఇది రక్తపాతం లేని,"ప్రజాస్వామ్య సారాన్ని హరించే ఒక రాజకీయ మారణ హోమం". ఈ ప్రక్రియను ప్రజలు బహిష్కరించాల్సిన అవశ్యకత ఉంది. కానీ, ఈ ప్రమాదకరమైన ఆటకు ఓటరు జాబితాలను నిర్వహించే సంస్థ, భారత ఎన్నికల సంఘం, తన స్వతంత్రతను కోల్పోయి, ప్రభుత్వ పక్షపాతానికి సాధనంగా మారిందనే ఆరోపణలు వినపడుతున్నాయి. ఈ 'స్వతంత్ర సంస్థల నియామకాల్లో కార్యనిర్వాహక వర్గం యొక్క ఏకైకత్వాన్ని' నిరోధించేందుకు ఇది ఒక రక్షణగా చూపబడింది. కానీ, కేంద్ర ప్రభుత్వం, ఈ సుప్రీంకోర్టు సలహాను తొక్కిపెట్టి, "చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మరియు ఇతర ఎలక్షన్ కమిషనర్లల (నియామకం, సేవా పరిస్థితులు, పదవీ విరమణ వయస్సు) తో కలిపి చట్టం, 2023"ను పార్లమెంటులో బీజేపీ కి మెజారిటీ ఉంది కనుక, విపక్షాల విమర్శలను, సూచనలు పట్టించుకోకుండా,సరైన చర్చ లేకుండానే, ఏక పక్షంగా ప్యాస్ చేసింది. ఈ చట్టం ప్రకారం, నియామక కమిటీలో సిజెఐ సభ్యునిగా ఉండాల్సిందల్లా, ప్రధానమంత్రి నియమించే ఒక కేబినెట్ మంత్రి సభ్యునిగా మార్చారు. ఇలా, నియామక ప్రక్రియపై కార్యనిర్వాహక వర్గానికి పూర్తి నియంత్రణ లభించింది.

ఈ చట్టపరమైన మార్పు వెంటనే, సిజెఐ సభ్యుడిగా లేని కొత్త కమిటీ శ్రీ రాజీవ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించింది. ఇతను గతంలో యూనియన్ లా మంత్రిగా పనిచేసిన ఒక ఐఏఎస్ అధికారి. ఈ నియామకం నుండే అతనిపై వివాదాలు ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష నేతలు, మీడియా సంస్థలు మరియు సామాజిక శాస్త్రవేత్తలు, ఈ నియామకం ఎన్నికల సంఘం యొక్క స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని, మరియు అధికార పక్షం అయిన బీజేపీకి అనుకూలంగా సంఘం పనిచేయడానికి ఇది మార్గం సుగమం చేస్తుందని ఆరోపించారు. ప్రతిపక్ష అధ్యక్షుడు శ్రీ రాహుల్ గాంధీ స్పష్టంగా, ఈ నియామకం 'సర్' వంటి ప్రక్రియల ద్వారా ఓటర్ల హక్కులను హరించే ప్రయత్నంలో భాగమని విమర్శించారు. సర్ ప్రక్రియ ద్వారా, ప్రధానంగా మైనారిటీ, పేద మరియు నిరక్షరాస్యుల ఓటర్ల జాబితాల్లో పేర్లు భారీ సంఖ్యలో తొలగించబడ్డాయనే విమర్శలు ఉన్నాయి. ఈ ప్రక్రియలో ఎన్నికల సంఘం ప్రతిఘటించకుండా, అధికారిక పరిశీలన లేకుండా రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చిన జాబితాలను అంగీకరించడం జరిగిందని ఆరోపణ. ఇది ఓటర్ జాబితాలను రాజకీయంగా ఉద్దేశపూర్వకంగా మార్చే ప్రయత్నంగా చూడబడుతోంది.

'ఓటు చోరీ' అంటే, నిజ ఓటర్ల జాబితా నుండి పేర్లు తొలగించడం లేదా వారిని భయపెట్టడం ద్వారా, అసలు ఓటర్లు పోలింగ్ బూత్ కు రాకుండా చేసి, ఇతరులు వారి పేరుతో ఓటు వేయడం. ఉదాహరణకు, అసంఖ్యాక మైనారిటీలతో కూడిన నిర్దిష్ట ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల్లో వారి పేర్లు గణనీయంగా తగ్గుదల స్పష్టంగా కనిపిస్తుంది. సర్ జాబితాలో పేరు లేదనే భయంతో బహుళ ప్రమాణపత్రాలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై పడింది. ఇది ఓటింగ్ హక్కును పరోక్షంగా నిరోధించే పద్ధతి. 2024 లోక్సభ ఎన్నికల తేదీలను ప్రకటించినప్పుడు, దీర్ఘకాలిక నియమాలను ఉల్లంఘించి, అధ్యక్ష పదవికి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వాయిదా పడిందని ఆరోపణ వచ్చింది. ఎన్నికల సంఘం, ఈవీఎంలు దురుపయోగానికి గురికావు మరియు వాటిని 100 శాతం విశ్వసనీయంగా పరిగణించాలని నిరంతరం నొక్కిచెప్పడం, ప్రతిపక్ష పార్టీలు మరియు స్వతంత్ర విశ్లేషకులు చేస్తున్న ఆందోళనలను పూర్తిగా పట్టించుకోవడం లేదనే భావన రూపుదిద్దుకుంది.

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పై న్యాయ విచారణ లేని చట్టం. ప్రస్తుత చట్టం ప్రకారం, సిఈసిని పదవి నుండి తొలగించడానికి సంసద్లో ద్వితీయ అంచనా ప్రకారం చట్టం ఆమోదం అవసరం.


చివరిగా, ప్రకారం ప్రభాకర్ సూచించినట్లుగా, "సర్" మరియు ఎన్నికల సంఘం యొక్క స్వతంత్రతపై సందేహాలు, సమాజంలోని విభేదాలు, ప్రజల మధ్య ఏర్పడిన ఉదాసీనత వల్లనే వచ్చాయి. మణిపూర్ మంటలు, న్యాయవ్యవస్థపై దాడులు, అమాయకుల హత్యల వంటి సంఘటనలపై సామూహిక నిరసన స్పష్టంగా వ్యక్తపరచబడి ఉంటే, అధికారులు ఈ విధమైన రాజ్యాంగ సంస్థలను అణిచివేయడానికి సాహసించేవారు కాదు. సర్ ఒక పార్టీకి సహాయపడే సాధనం మాత్రమే కాదుబీ ఇది రాజ్యాంగాన్ని మార్చి, భారత ప్రజాస్వామ్యాన్ని ఒక వర్గీయ, సజాతీయ వ్యవస్థగా మలచడానికి ఉద్దేశించిన దీర్ఘకాలిక ప్రణాళికలో ఒక ముఖ్యమైన మెట్టు. ప్రతి ఓటరు తన ఓటు హక్కు ద్వారా రాజకీయ అభిప్రాయాన్ని తెలియజేసే ప్రాథమిక సూత్రాన్ని ఇది ప్రశ్నార్థకం చేస్తుంది. ప్రజల మౌనం, విభజనలే ఈ ప్రమాదకరమైన ఆటకు ఆహ్వానం పలికాయి. ఇప్పుడు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే, ఈ 'రక్తపాతం లేని మారణహోమం'ని చూస్తూ ఊరుకోకుండా, దానిని బహిష్కరించే సామూహిక చైతన్యం మరియు చర్య అవసరం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# నల్లమల బిడ్డ @ముఖ్యమంత్రి

I want nothing to do with any religion concerned with keeping the masses satisfied to live in hunger, filth and ignorance అంటారు జవహర్ లాల్ నెహ్రూ. కుల, మత, వర్గ,వర్ణ తేడా లేకుండా అందరికీ విద్య, వైద్యం, ఉపాధిలో సమాన అవకాశాలు అందేలా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో 18 నెలలుగా దూసుకుపోతుందని, ఆ విషయాలను.. విశేషాలను 18 వ్యాసాలుగా మార్చి... సీనియర్ జర్నలిస్ట్ ముచ్చర్ల దినకర్ "మన ప్రజా పాలన– ప్రగతి వైపుకు తెలంగాణ పయనం..."పేరిట ఒక పుస్తకం తెచ్చారు. ఆ పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.







తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం కాంగ్రెస్ లో జాతీయ స్థాయిలో కీలకమైన నేతల్లో ఒకరిగా, కాంగ్రెస్ కార్యకర్తల గుండెల్లో బలమైన, ప్రియమైన నాయకుడుగా రేవంత్ రెడ్డి...రేవంతన్న గా ప్రముఖంగా కనిపిస్తున్నారు. ముఖ్యంగా 13 దశాబ్దాలకు పైగా చరిత్ర వున్న కాంగ్రెస్ పార్టీకి.. భవిష్యత్తు ఆశాకిరణంలా రేవంత్ ని పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న..రాజకీయ వాదనలు, విమర్శలు, సిద్ధాంత ధోరణులు ఏమైనాప్పటికీ... సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి.. అంచలంచెలుగా ఎదిగి నేటి యువతరాలకు స్ఫూర్తిగా నిలిచిన రేవంత్ రెడ్డి జీవన యానం ప్రేరణ దాయకం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్ గెలుపు కోసం రేవంత్ పోరాటం అసామాన్యం. వారం కిందట వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలలో ప్రజల్లో రేవంత్ కు వున్న విశ్వసనీయత స్పష్టంగా కనిపించింది. ప్రజా పాలన రెండు సంవత్సరాల ఉత్సవాలు జరగబోతున్న సందర్భంగా ముచ్చర్ల దినకర్ పుస్తకంలోని ప్రధాన అంశాలను ఒకసారి పరిశీలిద్దాం.

దినకర్ కూడా నల్లమల కు చెందిన బిడ్డ కావడం వల్ల స్వతహాగానే "మా వాడు ముఖ్యమంత్రి"అయ్యాడనే సగర్వం తనకు కూడా కొంత ఉందని చెప్పొచ్చు. అందుకే ఈ పుస్తకాన్ని "యోధుడికి ప్రేమతో...!" అంటూ రేవంత్ రెడ్డికి అంకితం ఇచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శంతో తెలంగాణలో జరిగిన కుల గణన సర్వే దేశానికే దిక్సూచి అంటూ రచయిత అభిప్రాయపడ్డారు. ఈ సర్వే వల్ల దేశంలో దాదాపు సగానికి పైగా ఉన్న బీసీల రిజర్వేషన్ల అమలుకు రాచబాట ఏర్పడిందని వివరించారు. ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

గల్లీ నుంచి ఢిల్లీ వరకు దాదాపు మూడు దశాబ్దాలకు జరిగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమ స్వప్నం నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి అడుగులు న్యాయం వైపే పడ్డాయని రచయిత అభిప్రాయపడ్డారు. నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరిందని.... ఆయన స్ఫూర్తితోనే...గాంధీజీ ఆశయాలు నెరవేర్చే క్రమంలో "యంగ్ ఇండియా ఈజ్ మై బ్రాండ్" అంటూ రేవంత్ విద్య, ఉపాధి రంగాల్లో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులు చెప్పుకోదగ్గవన్నారు. నేటి ప్రజా పాలన ప్రభుత్వంలో వరి పంటకు ప్రభుత్వ నిర్దేశించిన ధరతో పాటు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ఇస్తుందని మరో వ్యాసంలో వివరించారు. గద్దర్ పేరుతో సినిమా అవార్డులు ఇవ్వడం, మహాకవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా అధికారికంగా ప్రకటించడం, 9 మంది కళాకారులకు కోటి రూపాయల నజరానా ప్రకటించడం, వరంగల్ విమానాశ్రయానికి పచ్చ జెండా, భాగ్యనగర మణిహారంగా మూసీ...వంటివి కూడా ఈ పుస్తకంలో ప్రాధాన్యతా అంశాలుగా చెప్పవచ్చు.

ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని, నీళ్ల విషయంలో రాజకీయాలు మాని... కృష్ణానదిలో తెలంగాణ నీటి వాట తేల్చాల్సివుందనీ, దానిపై రేవంత్ వ్యూహాత్మకమైన ప్రయత్నంతో ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు చేస్తూ...ప్రసిద్ధ కవి, పరిశోధకులు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడుతూ తెలంగాణ అసెంబ్లీలో బిల్లును ప్రభుత్వం ఆమోదం తెలపడం గర్వకారణం అన్నారు. పుస్తక జ్ఞాన బాండాగారాన్ని ప్రారంభించి ఒక పిలుపుతో లోకానికి, రాష్ట్రానికి సందేశం పంపిస్తూ 'చదువుతాం– చదివిస్తాం' అనే ప్రకటన పుస్తక ప్రేమికులను ఎంతో సంతోష పెట్టిందంటూ 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ గురించి వివరించారు. హైదరాబాదులో ప్రపంచ అందాల పోటీలు నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు.

ఇలా పుస్తకం నిండా ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూనే, అవసరం అనుకున్న దగ్గర గణాంకాలతో సహా గత ప్రభుత్వ పాలకుల పాలన తీరును విమర్శించారు రచయిత. పుస్తకం నిండా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని, దార్శనికతను సమర్థిస్తూనే ఉన్నారు. సీనియర్ జర్నలిస్టుగా ప్రజాక్షేత్రంలో తనకున్న అనుభవాలను బలమైన అక్షరాలుగా మార్చి ఈ వ్యాసాలు రాశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనపై రచయిత అభిప్రాయాలు, అనుభవాలు పూర్తిగా వ్యక్తిగతమైనప్పటికీ... గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రజా మద్దతు పెరిగిందనేది ఎన్నికల ఫలితాలలో స్పష్టంగా రుజువవుతూనే ఉంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల్లో నిరుపేదలకు ఇంకా న్యాయం జరగాల్సి ఉంది. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాల్సి ఉంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, హైడ్రా సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, రైతుల పంట నష్టాలు..విద్య, వైద్య రంగంలో మార్పులు ఇలాంటివెన్నో... తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. సంక్షేమం ,అభివృద్ధి రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ నిజాయితీతో కూడిన పాలన.. ప్రజలకు, పార్టీలకతీతంగా అందించాల్సిన బాధ్యతను రేవంత్ తీసుకోవాలి.సమీక్షకునిగా, నల్లమల్ల బిడ్డగా... నేను కూడా రేవంత్ రెడ్డి నేడు పోషిస్తున్న పాత్రను చూసి గర్వపడుతూ.. భవిష్యత్తులో రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధితోపాటు, భారతదేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన రెండు సంవత్సరాల ఉత్సవాలకు శుభాకాంక్షలు చెబుతూ.... ఇంకా బాధ్యతతో ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల బతుకు చిత్రాలను మార్చాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.



ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

# ఖరీదైన సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులు

- దాదాపు 1.50 కోట్లు ధర పలికిన పదవులు
- ఈ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- రాష్ట్ర చరిత్రలో ఇదో మైలురాయి
- గ్రామస్తుల సమిష్టి నిర్ణయం



**వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** రాష్ట్ర చరిత్రలో ఇదో మైలురాయి. కానీ విని ఎరగని రీతిలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల పదవులకు ఖరీదైన ధర పలికింది. ఎప్పుడు సంచలన సంఘటనలకు నిలయమైన ఆ గ్రామంలో ఈ ఏడాది ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని గ్రామస్తులు తీర్మానించారు. ఎలాంటి అంగుళా ఆర్భాటాలు లేకుండా సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నికను ఏకగ్రీవం చేసి గ్రామ అభివృద్ధికి కంకణం కట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగానే అన్ని సామాజిక వర్గాలు ఒకటై ఈ పదవులు ఏకగ్రీవం చేయడానికి శ్రీకారం చుట్టారు. పదవుల వేలం వేయాలని నిర్ణయించారు. ఈ పాట లో అన్నిటికీ దాదాపు కోటిన్నర వరకు ధర పలికినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే రాష్ట్ర చరిత్రలోనే సర్పంచ్ పదవికి ఇలాంటి ఖరీదైన ధర ఎక్కడ పలకకపోవచ్చు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని మొగిలి గుండ్ల గ్రామంలో సర్పంచ్ ఉప సర్పంచ్ అన్ని వార్డ్ మెంబర్లకు కలిసి దాదాపు కోటిన్నర వరకు ధర పలికింది. ఎప్పుడు ఏదో ఒక గొడవతో సతమతమవుతున్న గ్రామ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నిక నిర్వహించుకోవడానికి నిర్ణయించినట్లు తెలుస్తుంది. గ్రామంలోని అన్ని సామాజిక వర్గాలు ఒకచోట చేరి సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్ల పదవులకు వేలంపాట నిర్వహించినట్లు తెలుస్తోంది. అత్యధికంగా వేలం పాట పాడిన వ్యక్తిని సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుడుగా ఎన్నిక చేయడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు. స్వతంత్రం వచ్చిన తర్వాత ఈ గ్రామపంచాయతీలో అన్ని సామాజిక వర్గాలు కలిసి ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పడం ఇదే మొదటిసారి. అందులో భాగంగానే రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా సర్పంచ్ తో పాటు వారి ప్యానెల్ మొత్తం ఒక్కొక్క సెట్ మాత్రమే నామినేషన్లు వేశారు. రెండో విడత నామినేషన్లు నవంబర్ 30 నుంచి డిసెంబర్2 వ తేదీ వరకు స్వీకరించారు. నామినేషన్ల చివరి రోజు వరకు కూడా ఈ గ్రామం అన్ని గ్రామ పంచాయతీ పదవులకు నుంచి సింగల్ నామినేషన్లు మాత్రమే వేశారు. దీంతో సర్పంచ్ తో సహా వార్డు మెంబర్ల పదవులు కూడా ఏకగ్రీవము అయ్యే అవకాశం ఉంది. నేటి నుంచి నామినేషన్ల పరిశీలన వాటిపై ఆపిల్ అనంతరం అప్పీల్ పై పరిశీలన జరిగిన అనంతరం తుది జాబితా అధికారికంగా ప్రకటిస్తారు. ఈనెల 14న ఓటింగ్ ప్రక్రియ అనంతరం ఏకగ్రీవమైన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల జాబితాను అధికారులు అధికారికంగా ప్రకటిస్తారు. గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం మేరకు వచ్చిన డబ్బుతో గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాల నిర్ణయించారు. గ్రామపంచాయతీలోని వివిధ వార్డుల అభివృద్ధి మంచినీటి కొరత గ్రామంలో ఆధ్యాత్మిక దేవాలయాల నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- భక్తి శ్రద్ధతో భగవంతుని కొలవాలి
- ప్రభుత్వ చీఫ్ వీప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ ధార్మికత, దైవ భక్తిని కలిగి ఉండాలని తెలంగాణ శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ వీప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తాండూర్ మండలంలోని అంతారం గ్రామంలో ఆయన పర్యటించి నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఆలయాన్ని భక్తి శ్రద్ధలతో పునః నిర్మాణం చేయడం సంతోశమని అన్నారు. దేవాలయం అభివృద్ధికి తనవంతుగా సహకారం చేస్తానని చెప్పారు. టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డే శీను, మాజీ ఎంపి టీసీ శాంతు, గడ్డిల రవి, గ్రామస్తులు పుల్ల ప్రభాకర్ రెడ్డి, కోస్గి ఆశప్ప, బెండ నర్సింలు, సల్ల సంపత్ కుమార్, యువకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఆయనతో ఉన్నారు.

## జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌పై ఈటల రాజేందర్ ఫైర్

- సమస్య పరిష్కారం చేయకపోతే బీజేపీ ఉద్యమానికి హెచ్చరిక



**జవహర్‌నగర్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** డంప్‌యార్డ్ పరిస్థితిని బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించిన మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డంప్‌యార్డ్ ఏర్పాటు చేసినప్పుడు రోజుకు 300 టన్నుల చెత్తనే వేస్తుంటే, ఇప్పుడు అది 10 వేల మెట్రిక్ టన్నులకు పెరిగి జనావాసాల మధ్య జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నదని మండిపడ్డారు. దమ్మాయిగూడ, జవహర్‌నగర్, ఘట్‌కేసర్ పరిధిలో ఉన్న లక్షలాది పేద కుటుంబాలు చెత్త దుర్వాసన, కలుషిత నీరు, దుమ్ము, వ్యాధులతో నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నారని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త లారీలు మూతలు లేకుండా తిరగడంతో ప్రజలమీద నేరుగా చెత్త పడుతున్నదని ఆయన విమర్శించారు. బీజేపీ పోరాటాల తరువాతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు వచ్చినప్పటికీ, అప్పటి ప్రభుత్వం 2017లో నగరంలో నాలుగు దిశల్లో కొత్త చెత్త డంప్‌యార్డులు ఏర్పాటు చేస్తామని అఫిడవిట్ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని ఈటల ఆరోపించారు. 2021, 2022, 2025లో మూడు సార్లు గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులు ఇచ్చినా ప్రభుత్వంపై ఎలాంటి స్పందన కనిపించడం లేదన్నారు. వాసనతో శ్వాసకోశ వ్యాధులు, కలుషిత నీటి వల్ల అనేక జబ్బులు విస్తరిస్తున్నాయని, కొంతమంది కుటుంబాలు పిల్లలు కూడా పుట్టడం లేదని స్థానికులు తాము విన్న వేదనను ఈటల వెల్లడించారు. "ఇక్కడి పేదల రక్తం తాగుతున్న ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడుతోంది" అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. గుండ్ల చెరువు నుండి ఎదులాబాద్ చెరువు వరకు అన్ని నీటి వనరులు తీవ్రంగా కలుషితం అయ్యాయని, మూసీ నదిలో కెమికల్ కాలుష్యం కన్నా ఇది ప్రమాదకరమని ఈటల హెచ్చరించారు. భూగర్భ జలాలు సైతం విషపూరితం అవుతున్నాయని తెలిపారు. తాను ఎంపీ అయిన తర్వాత అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం ఖండనీయమన్నారు. నగరం నాలుగు మూలలా చెత్త డంప్‌యార్డులను విభజించాలాని చేసిన విజ్ఞప్తి కూడా పట్టించుకోవడం లేదన్నారు. డంప్‌యార్డ్ సమస్య కారణంగా ప్రమాదాలు, ప్రాణనష్టం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ప్రభుత్వం పెడచెవిన పెడితే తాడోపేడో తేల్చుకునే పరిస్థితి వస్తుందని ఈటల హెచ్చరించారు. పార్లమెంట్ సమావేశాల తర్వాత స్థానిక ప్రజలతో కలిసి ఉద్యమం మొదలు పెడతామని స్పష్టం చేశారు.

## పాఠశాలల్లో చిన్నారుల భద్రత అత్యంత ప్రాధాన్యం

- చైల్డ్ రైట్స్ కమిషన్ ఛైర్మన్ సీత దయాకర్




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "పాఠశాలల్లో చిన్నారుల భద్రత మరియు రక్షణ" అవగాహన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ సీత దయాకర్ పాల్గొని పాఠశాల యాజమాన్యాలకు కీలక సూచనలు చేశారు. ఇటీవల చిన్నారులపై చోటు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన ఆమె, చదువు బోధించడం వ్యాపారం కాదని, బాలల భద్రతను కాపాడటం పాఠశాలల మొదటి బాధ్యత అని స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను దేశవ్యాప్తంగా నడుస్తున్న పిల్లల భద్రత పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసినట్లు వెల్లడించిన ఆమె, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు చట్టాలు, అవగాహనా కార్యక్రమాలు, కౌన్సిలింగ్, పోక్సో చట్టం, సీసీ కెమెరాలు, వాహన భద్రతా ప్రమాణాలపై పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. సంఘటన జరిగిన తర్వాత చర్యలకంటే ముందే నివారణ చర్యలు తీసుకోవడమే ముఖ్యమని పేర్కొన్నారు. చిన్నారులకు శారీరక వ్యాయామం, గ్రౌండ్ యాక్టివిటీలను తప్పనిసరిగా కల్పించాలని, ఇది వారికి శారీరక-మానసిక దృఢత్వాన్ని ఇస్తుందని సూచించారు. పాఠశాలలో ప్రతి నెల కమిటీలను ఏర్పాటు చేసి భద్రతాపై చర్చలు నిర్వహించాలని, చిన్నారుల పట్ల జరిగే నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని ఆమె స్పష్టం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ, పిల్లల పట్ల ఉపాధ్యాయులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. టీచర్లు ఒక తరగతికి మాత్రమే కాదు, ఒక తరం భవిష్యత్తుకు బాధ్యులు అని గుర్తుచేశారు. పాఠశాలలు తెలిపిన సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు చంద్రణ, సరిత, డీఈఓ విజయకుమారి, జిల్లా సంక్షేమ అధికారి శారద, ఇంటర్మీడియట్ అధికారి కిషన్, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

## పొరపాట్లు దొర్లకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించండి

- నామినేషన్ల స్వీకరణ కేంద్రాల తనిఖీ
- ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ భాష



**వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా ,వికారాబాద్ నవాబ్ పెట్, మండలాల్లో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్నికల సాదారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాష తనిఖీ చేశారు. మంగళవారము వికారాబాద్ మండలం సిద్దలూర్ ,నవాబ్ పేట్ మండలం నవాబ్ పెట్, ఏక్మామిడి గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నిర్వహిస్తున్న ఎన్నికల నామినేషన్ ల ప్రక్రియ ను పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వికరణ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అవసరమైన వారికి హెల్ప్ డెస్క్ ద్వార సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్నీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. అనంతరము కల్లెక్టేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు, ఇప్పటి వరకు ఎన్ని కాల్స్ వచ్చాయి, వివరాలు అడుగుతూ రిజిష్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలనీ సూచించారు. సాదారణ పరిశీలకులతో పాటు జిల్లా పంచాయతి అధికారి జయసుధ, డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ డి ఓ వాసు చంద్ర, డిప్యూటీ కలెక్టర్ పూజ, ఎం పి డి ఓలు నవీన్ కుమార్, అనురాధ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** ఎన్నికల సంధార్భంగా పోలీస్ అధికారులు అన్నీ శాఖలతో కలసి సమన్వయంతో చేయాలని జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రు అన్నారు. వికారాబాద్ జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మోమిన్‌పేట్ నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ల ఆవరణలను, స్టేషన్‌లోని రికార్డులను, రిసెప్షన్ వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ల నిర్వహణ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోమిన్‌పేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని మరియు ఎంపిడిఓ కార్యాలయంలోని డిఆర్‌సి కేంద్రాన్ని సందర్శించి అక్కడి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. తదనంతరం నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, ఆ పరిధిలోని ఏక్ మామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని కూడా సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధికారులను సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, టీమ్ వర్క్ తో పని చేయాలని, ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.

## శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు జాతీయస్థాయి గౌరవం లభించడం అభినందనీయం



**శామీర్‌పేట్, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా పోలీస్ సేవల్లో ఉన్నత ప్రమాణాలు, పారదర్శకత, ప్రజా సేవా దృక్పథం, సౌకర్యాలు, నేరనిరోధక చర్యలు వంటి ప్రమాణాల ఆధారంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ప్రకటించే ఉత్తమ పోలీస్ స్టేషన్‌ల జాతీయ ర్యాంకింగ్లో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ దేశంలో 7వ స్థానం, తెలంగాణ రాష్ట్రంలో 1వ స్థానం సాధించడం గర్వకారణంగా నిలిచినందుకు ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి గారు పలువురు నాయకులతో కలిసి శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ సిఐ శ్రీనాథ్‌ని, అలాగే సేవలందిస్తున్న యస్‌ఐలు మరియు స్టాఫ్‌ను ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు మన్నె బిక్షపతి ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నోముల మధుసూదన్ రెడ్డి, రామిడి శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ శామీర్‌పేట పోలీస్ స్టేషన్ సాధించిన ఈ జాతీయ స్థాయి గౌరవం మొత్తం జిల్లాకు గర్వకారణం. సిఐ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ప్రతి పోలీస్ సిబ్బంది చూపుతున్న క్రమశిక్షణ, కట్టుబాటు, ప్రజల సమస్యలపై త్వరిత స్పందన వల్లే ఈ విజయం సాధ్యమైంది అని అన్నారు. అలాగే ఇది శామీర్‌పేట ప్రాంతానికి అందిస్తున్న నాణ్యమైన పోలీస్ సేవల పరాకాష్ట అని, ఆధునిక నేర పరిశోధన పద్ధతులు, ప్రజలతో నిరంతర అనుసంధానం పోలీస్ వ్యవస్థకు విశ్వాసాన్ని పెంచాయని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు మరియు సామాజిక సంస్థలు పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ మద్దతు అందించాలని అన్నారు. భవిష్యత్తులో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ మరిన్ని అవార్డులు, రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

## పైలెట్ రోహిత్ రెడ్డి మతిభ్రమించిన మాటలు మనుకోవాలి


- కాంగ్రెస్ హయాంలో నే అనేక అబివృద్ధి
- బిఆర్ఎస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ఓటమి భయం
- బిఆర్ఎస్ పార్టీకి ఎన్నికల్లో వార్డు సభ్యులు కరువు
- మనోహర్ రెడ్డిపై లేనిపోని ఆరోపణలు తగవు
- డిసిసిబి వైస్ చైర్మన్ రవి గౌడ్




**తాండూరు, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మతిభ్రమించి మాటలు మనుకోవాలని డిసిసిబి వైస్ చైర్మన్ రవిగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసిబి వైస్ చైర్మన్ రవిగౌడ్.మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి మాట్లాడుతూ పైలెట్ రోహిత్ వాఖ్యలు అసత్య వాఖ్యలు మానుకోవాలని అన్నారు. మా ఎమ్మెల్యే అబద్దపూ మాటలకు ఆమడ దూరం ఉంటారన్నారు..బిఆర్ ఎస్ పార్టీ లో నాయకత్యలోఫం ఉందన్నారు. పైలెట్ మతిభ్రమించి మాటలు మానుకోవాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు దౌర్జన్యం మానుకోవాలని సూచించారు. రౌడీ ముఖలతో విచ్చలవిడిగా ఆరచాకలు చేసారని విమర్శించారు. పైలెట్ లేనిపోని ఆరోపనలు మానుకోవాలని, బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇళ్లు ఇచ్చిన పాపనపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనేక అబివృద్ధి జరిగిందిన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగే అబివృద్ధి చూసి ఓర్వలేకనే లేనిపోని ఆరిపనలు చేస్తున్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నియోజకవర్గ అబివృద్ధికి పాటు పడుతున్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గల్లంతు అవ్వడం ఖాయమన్నారు. సౌమ్యుడు మా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆద్వర్యంలో మరింత అబివృద్ధి సాగిస్తామన్నారు. ఎన్నికల్లో బిఆర్ఎస్ కు నాయకులు కరువు అవుతారని విమర్శించారు. బిఆర్ఎస్ పాలనలో బిల్లు రాక హత్మ ఆత్యలు చేసుకున్నారు. మా ఎమ్మెల్యే పక్కా లోకల్ అన్నారు. గత 40 సంవత్సరాల నుండి తాండూరు లో ఉన్నారని వివరించారు. మనస్సున్న మహెూన్నత వ్యక్తి మా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. అయనను విమర్శించడం సరికాదన్నారు. మేము ప్రజాసేవకులము బిఆర్ఎస్ నాయకులు రౌడి రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాద్యమన్నారు. ఇప్పుడిప్పుడే తాండూరు ప్రశాంతంగా ఉందని పైలెట్ రోహిత్ రెడ్డి ఆరోపనలు చేయడం సిగ్గు చేటన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఎన్నడులేనివిదంగా 25గ్రామాల్లో ఎకగ్రీవం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి,సీనియర్ నాయకులు నర్సింలు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

## జిల్లాలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**బోడుప్పల్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన తోటకూర వజ్రెష్ యాదవ్ కు మంగళవారం నియామకం పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ లు మాట్లాడుతూ రాబోయే గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా ఇప్పటి నుండే పార్టీని బుత్ స్థాయి నుండి బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయేలా కార్యకర్తలను సమాయత్తం చేయాలని తెలిపారు. అనంతరం వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పార్టీని జిల్లాలో బలమైన శక్తిగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గే, పార్లమెంటరి నాయకుడు రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబులకు ధన్యవాదాలు తెలిపారు.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 03 డిసెంబర్ 2025

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటం

- నేడు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో మహాధర్నా
- జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- టియూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్



**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో మహాధర్నకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తారని అనుకున్నప్పటికీ గత రెండేళ్లుగా జాప్యం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నేడు రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం కమిషనర్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన అక్రెడిటేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందనీ, హెల్త్ కార్డులకు దిక్కులేదు. ఇక ఇళ్ల స్థలాలు అందని ద్రాక్షలా మరాయని చెప్పారు. వృత్తీ కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలనీ, సంక్షోభంలో ఉన్న చిన్న మధ్యతరగతి పత్రికలను ఆదుకోవావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మన యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డినీ ఎన్నో సార్లు కలిసి చర్చించడంతో పాటు వినతి పత్రాలను అందించింది. కానీ గత 20 నెలలుగా అక్రెడిటేషన్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికి పాత అక్రెడిటేషన్ కార్డులను పలు దఫాలుగా రెన్యూవల్ చేస్తున్నారు తప్ప కొత్త కార్డులు ఇవ్వడం లేదు. ఇదేమని అడిగితే, ఇదిగో, అదిగో అంటూ వాయిదాలు వేస్తున్నారు. తప్ప కార్యరూపం దాల్చటం లేదనీ విమర్శించారు. ప్రభుత్వ సాచివేత ధోరణికి నిరసనగా డిసెంబర్ 3న, ఉదయం 10 గంటలకు మాసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించి మన ధర్మాగ్రహాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించడం జరిగిందని అన్నారు. మహాధర్నాలో జర్నలిస్టులో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవరావు బి.రాజు, జాతీయ కౌన్సిల్ నెంబర్ ప్రశాంత్ రాష్ట్ర హౌసింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి మన్యం, జిల్లా ఉపాధ్యక్షులు నా కొండ యాదవ్, కమల్ రెహమాన్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు, జిల్లా నాయకులు పికిలి రాము, రవికాంత్, టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ ఆంజనేయులు నాయకులు విష్ణు, సురేష్,ఫారుక్ పటేల్, దాచ హరీష్ కుమార్, మహేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా నిలుపుదాం

- డీఎంహెచ్వో డా. శ్రీరామ్



**మెదక్ బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** ఎయిడ్స్ అంతమే మన పంతంగా ముందకుసాగాలని డీఎంహెచ్వో డీఎంహెచ్వో డా. శ్రీరామ్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాలన్నీ ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఆ ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఎయిడ్స్ను పూర్తిగా నిర్మూలించడం మన చేతుల్లోనే ఉందని, సురక్షితమైన లైంగిక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉంటామన్నారు. ఉచితంగా పరీక్షలు, మందులు అందజేస్తున్నాయన్నారు. ఇది అంటూ వ్యాధి కాదనీ, బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా. శివదయాల్, ప్రోగ్రాం. ఆఫీసర్ డా.హరి ప్రసాద్, ఏపీఎంవో శంకర్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి



**పటాన్‌చెరు, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** అభివృద్ధి కార్యక్రమాల అంశంలో పరిశ్రమలు తమ సామాజిక సేవ పథకం ద్వారా మరిన్ని నిధులు కేటాయించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగిలో శాండ్విక్ పరిశ్రమ సౌజన్యంతో కోటి రూపాయలతో చేపట్టిన ఆర్వో వాటర్ ఏటీఎం, బయో కంపోసిట్ కేంద్రం, అంగన్వాడి ప్రాథమిక పాఠశాలలపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్, సోలార్ స్ట్రీట్ లైట్స్, ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోలను ఆయన ప్రారంభించారు. అనంతరం ముత్తంగి డిఎన్ కాలనీ నుండి పాశమైలారం 100 ఫీట్ల రహదారి వరకు రెండు కోట్ల పదిలక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి మరియు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముత్తంగి అభివృద్ధి కోసం శాండ్విక్ పరిశ్రమ అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. రాబోయే రోజుల్లో గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు నియోజకవర్గంలోని వివిధ పరిశ్రమల సిఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, శాండ్విక్ పరిశ్రమ సిఎస్ఆర్ రెడ్డి రవి అరోరా, సీనియర్ నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా విత్తన బిల్లు 2025పై అభిప్రాయ సేకరణ

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముసాయిదా విత్తన బిల్లు 2025 బిల్లుపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధ్యక్షతన వ్యవసాయ శాఖ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు విత్తన ఉత్పత్తిదారులు డీలర్లు రైతుల కు అవగాహన మరియు అభిప్రాయ సేకరణ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రైతులకు దాన్యమైన విత్తనాలను అందిస్తూ రైతుల యొక్క పెట్టిన పెట్టుబడి తగ్గ ఆదాయం పెంపొందించే విధంగా చట్టాల రూపకల్పనలో ఇటు రైతులకు అటు వ్యాపారులకు లాభం చేకూరే విధంగా సమతూకంగా ఎలాంటి కల్తీ విత్తనాలు విక్రయాలు లేకుండా, విత్తన ఉత్పత్తిదారులు నాణ్యమైన విత్తనాలను తయారు చేస్తూ రైతులకు అందించాలని లైసెన్స్ కలిగిన డీలర్ల ద్వారా మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన ప్రతి విత్తనానికి బిల్లు తీసుకోవాలని రైతులకు సూచించారు అదేవిధంగా పాత విత్తన చట్టం మరియు విత్తన నియంత్రణ చట్టం లో ఉన్న లోపాలను సవరిస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే విధంగా మరియు ఇతర భాగస్వాములకు లబ్ధి చేకూరే విధంగా ఈ నూతన ముసాయిదా విత్తన చట్టం 2025 పై అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన సలహాలను స్వీకరించి కేంద్ర వ్యవసాయ శాఖ వెబ్సైట్ నందు ఈనెల 11వ తేదీలోపు వారి సూచనలను సలహాలను పొందుపరచాలని సూచించారు. ముఖ్యంగా విత్తన చట్టం 1966, విత్తన నియంత్రణ చట్టం 1985 లకు మరియు కొత్తగా ప్రవేశపెట్టబడిన ముసాయిదా విత్తన చట్టం 2025 కు గల తేడాలను వివరించడం జరిగింది ముఖ్యంగా గత కాలానికి అనుగుణంగా ఏర్పర్చినటువంటి విత్తన చట్టం మరియు విత్తన నియంత్రణ చట్టం లో పంటల రకాల నమోదు, విత్తల ధ్రువీకరణ, లైసెన్సు దందు లైసెన్స్ రద్దు రకాల చేర్పు, నోటిఫై చేసిన లకాలపై మాత్రమే నియంత్రణ తోటిఫై చేయాలి రకాలపై ఎలాంటి నియతుల లేకపోవడం శిక్షలు ప్రభావతంగా లేకపోవడం విత్తన నియంతరకు ఎలాంటి నిబంధన లేకపోవడం మోసపూరిత మరియు దాసిరకం నాణ్యత విత్తనాల పట్ల రైతుకు నష్టం జరిగిన సందర్భంలో పరిహారం చెల్లించే నిబంధన లేకపోవడం వల్ల రైతుకు ఆర్థిక నష్టం తో పాటుగా కల్తీ విత్తనదారుల పై తీవ్ర స్థాయిలో శిక్షలు లేకపోవడం వల్ల కల్తీ విత్తనాల విక్రయాలు ఎక్కువ అవుతుందో నేపథ్యంలో ముసాయిదా విత్తన చట్టం 2025లో విత్తనాలు మరియు వాటి బాధ్యత నియంత్రించడం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేలా ఏర్పాటు చేయడం నకిలీ మరియు దాసిరకాల విత్తనాల విక్రయాల అరికట్టడం రైతుల హక్కులను పరిరక్షిస్తూ విత్తన దిగువతులను స్వేచ్ఛీకరించడం అదేవిధంగా విత్తన ఉత్పత్తిదారులకు స్వేచ్ఛాయుతంగా వ్యాపారం చేసుకునే విధంగా అవసరమైన కఠిన నియమ నియమాలను నిబంధన భారాన్ని తగ్గించడం తప్పులకు మరియు ఉల్లంఘనలకు సమర్థవంతమైన శిక్షణ అమలు చేయడం వంటి అంశాలపై అన్ని



భాగస్వామ్యుల యొక్క సూచనలను సలహాలను స్వీకరించే ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ఈ దూతల ముసాయిదా విత్తన చట్టం 2025లో 10 అధ్యాయాలు 48 సెక్షన్లు పొందుపరచడం జరిగింది వీటి ద్వారా కేంద్ర విత్తన కమిటీల ఏర్పాటు ఇతర కమిటీల విధులు విత్తన రకాల నమోదుకు సంబంధించిన నిబంధనలు విత్తన ఉత్పత్తిదారులు విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు విత్తన వ్యాపారులు పంపిణీదారులు మరియు నర్సరీల నమోదు విత్తనవిక్రయ నియంత్రణ మరియు విత్తన ధ్రువీకరణ సమీక్ష మరియు అప్పిలు విత్తన విశ్లేషణ విత్తన పరీక్ష విత్తనాల దిగుమతి దేరాలు మరియు శిక్ష వడ్డీవి పొందుపరచడం సుదీర్ఘంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, ఈఈ ఇరిగేషన్ శ్రీనివాస రావు ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



**పటాన్చెరు డిసెంబర్ 2 (జనంసాక్షి) :** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లి తమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం పటాన్ చెరు మండలంలో ఐఐటి చుక్కారామయ్య ఇష్టా విద్యాసంస్థలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న "ఇష్టా ఫెస్ట్ – 2025" సాంస్కృతిక, క్రీడా వేడుకలు విద్యార్థుల కేరింతల మధ్య ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ప్రారంభించగా, విద్యావేత్త డి వెంకటేశ్వర్ రావు ఫుడ్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులను శాలువా కప్పి, స్మారక చిహ్నాన్ని చైర్మన్ కార్తీక్ కోట, డైరెక్టర్ కె. వినోద్ కుమార్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్డీఏ విద్యార్థులు నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి కోదండరాం మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని, ఇలాంటి ఫెస్టివల్స్ మనలోని సామర్థ్యాలను బయటకు తీసుకువస్తాయని పేర్కొన్నారు. విద్యాసంస్థలు కేవలం విద్యార్థుల్లోని ర్యాంకులను, మార్కులను చూస్తున్న ఈ రోజుల్లో వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం కోసం ఐఐటి చుక్క రామయ్య ఇష్టా విద్యాసంస్థలు ఇలాంటి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం మంచి పరిణామమని కళాశాలలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్లను అభినందించారు. హైకోర్టు అడ్వకేట్ సుంకరి నరేష్ మాట్లాడుతూ నిత్యం చదువులతో కుస్తీలు పడుతున్న విద్యార్థులకి మూడు రోజులు పాటు స్పోర్ట్స్ మీట్, ఫుడ్ ఫెస్ట్ , కల్చరల్ ఫెస్ట్ పేరుతో విద్యార్థులు క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కళా కార్యక్రమాలు, ఫుడ్ ఫెస్ట్‌తో సందడి చేస్తూ ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించిన విద్యాసంస్థల యాజమాన్యాన్ని మరియు ఫిజికల్ డైరెక్టర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఐఐటి చుక్కారామయ్య ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట, డైరెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను అందించడమే ఇష్టావిద్యాసంస్థల ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పాల్గొనడం ప్రత్యేక శోభను తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు విద్యాసంస్థల అకాడమిక్ డీన్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పటేల్ గూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ రజిత,వైస్ ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్ రెడ్డి,బీరంగూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ తులసి,వైస్ ప్రిన్సిపల్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావుండొద్దు

- ఎన్నికల పరిశీలకులు సీతా లక్ష్మి



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సాధారణ ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి సూచించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబం ధించి దామరగిద్ద మండలం లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల పరిశీలకురాలు మంగళవారం దామరగిద్ద మండలం విఠలా పూర్ గ్రామ పంచాయతీలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రా న్ని సందర్శించారు. ఈ సంద ర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాల ని, మొదటి అంకమైన నామి నేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగు ణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదు పాయాలను ఆమె పరిశీ లించారు. రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ ఆది వారం ప్రారంభమైందని, మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని, అందుకని అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదిం చాలని సూచించారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. వీరి వెంట స్థానిక అధికారులు వెంకటేష్ డిప్యూటీ ఎస్ఓ మరియు నటరాజ్ తదితరులు ఉన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరిగే నామినేషన్ కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. నారాయణ పేట మండలం చిన్నజట్రం, ధన్వాడ, మరికల్ మండల కేంద్రాల్లోని నామినేషన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, అభ్యర్థులు నామినేషన్ ఫారాలు నింపే సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

## ఆటో డ్రైవర్‌లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



**మద్దూరు డిసెంబర్ 2 (జనం సాక్షి) :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి అని, ఆటో డ్రైవర్‌లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలని మద్దూరు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. మద్దూర్ ఎస్సై ఆధ్వర్యంలో మద్దూరు టౌన్ లో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, డ్రైవర్లలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించుకోవడం లక్ష్యంగా వాహనదారులకు, ఆటో డ్రైవర్‌లకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్‌లు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు ఆటో డ్రైవర్లు మద్దూర్ పోలీసులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** మంగళవారం కలెక్టర్ కార్యాలయం వి.సి కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాజకీయపార్టీల ప్రతినిధులతోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ కోడ్ పాటించాలని కోరారు. జిల్లాలోని మొత్తం 3674 పోలింగ్ కేంద్రాలకుగాను,మూడు దశల్లో 999 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు సజావుగా సాగేందుకు పూర్తిస్థాయి భద్రత కోసం, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ కెమెరాలు, సూక్ష్మ పర్యవేక్షకులు (మైక్రో అబ్జర్వర్లు) వీటితోపాటు కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో, రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను, నివృత్తి చేస్తూ, వారి సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు పరిశీలన సమయంలోనే నమోదు చేయాలిబీ ఆలస్యంగా ఇచ్చే అభ్యంతరాలు స్వీకరించబడవని తెలిపారు. ఇప్పటి వరకు మొదటి దశ నామినేషన్ల స్క్రూటినీ పూర్తి అయిందని తెలిపారు. రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్.ఓ) వద్ద తిరస్కరించబడిన వారు అప్పీల్‌కు వెళ్ల వచ్చని, అయితే ఆర్.డి.ఓ వద్ద అప్పీల్ తిరస్కరించబడితే అది తుది నిర్ణయం అవుతుందని స్పష్టం చేశారు. అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు వారి తుది జాబితా లోని పేర్ల అక్షర క్రమం ఆధారంగా కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో వివాదాలు లేకుండా ఉండేందుకు మంచి ప్రవర్తన కలిగిన ఏజెంట్లను నియమించాలని రాజకీయ పార్టీలకు సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తయ్యేలా తమ అభ్యర్థులకు కూడా మార్గనిర్దేశం చేయాలని పార్టీ నేతలను కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్.పి.సి.ఈ.ఓ ఇంచార్జి డి.పి.ఓ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ఏ.ఐ.ఎం.ఐ.ఎం, తదితర ముఖ్య రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోతులను తరిమేయండి..
# ఓట్లు అడిగేందుకు రండి..

- ఇన్స్ పైర్ యూత్ పేర వెలిసిన ఫ్లెక్సీలు
- రేగొండలో వెలుగు చూసిన వైనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలంటనే పండుగ వాతావరణం నెలకొంటుంది. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఎన్నికలు ముగిసేదాకా ఆ కిక్కే వేరు. కానీ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలకేంద్రంలో మాత్రం ఓ వింత సమస్య ఎదురవుతుంది. సర్పంచ్, వార్డు సభ్యులుగా నామినేషన్ వేసిన అభ్యర్థులు ఓట్లకోసం తిరిగే సమయంలో యూత్ సభ్యులు కొందరు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు ప్రధాన సమస్య కోతుల బెడద అని, కోతుల బెడద తీర్చేసి ఓట్లకు రావాలని కోరుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలకేంద్రంలో కోతుల బాధ తట్టుకోలేక, వాటిని పంపించాకే ఓట్లకు రావాలని ఇన్స్ పైర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మా ఓటును అమ్మేది లేదు. కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రావాలని కోరుతున్నారు. ఈ విషయం రేగొండ మండలకేంద్రంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది.

### చర్చనీయాంశంగా మారిన ఫ్లెక్సీలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలకేంద్రంలో వెలిసిన ఈ ఫ్లెక్సీలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రేగొండ మండల ఇన్స్ పైర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆ ఫ్లెక్సీల్లో అసలు ఏమి ఉందంటే.. మా ఓటును అమ్మేది లేదు, కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రండి. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దు, వజ్రాయుధం లాంటి ఓటుతో గ్రామాభివృద్ధికి బాటలు వేద్దాం. ఊరంతా కోతుల దాడుల్లో గాయాలైన బాధితులే. పత్తి, వరి, మిరప పంటలు కోతుల చేష్టలతో ఇంటికి చేరడం లేదు. రేగొండ మండల కేంద్రమైన మా గ్రామంలో పెద్దసార్లు, పెద్దపెద్ద లీడర్లు తిరుగుతున్నా మా గోడును పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఎన్నికలవేల మా ఇల్లు తొక్కే నాయకుల్లారా కోతులను తరిమి ఎన్నికకు ముందే అభివృద్ధికి శ్రీకారం చుట్టి మీ చిత్తశుద్ధిని చాటుకోండి. అంటూ రాసి, కోతుల బొమ్మతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

### ఎన్నికల వేళ.. కోతుల సమస్య ఏలా..

ఎన్నికల వేళ కోతుల సమస్యలు ప్రధాన చర్చకు వస్తున్నాయి. ఆయా గ్రామాల్లో వానర సేనలు సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే భయం, భయం. పిల్లలు, మహిళలు, వృద్ధులు ఒంటరిగా నడిచి వెళ్ళాలంటేనే జంకుతున్నారు. పొరపాటున ఇంటి డోర్ తెరిచి ఉంచారంటే వంట సామాగ్రి మాయం.. ఇల్లంతా సంతలా మారుతోంది. అన్నం, కూర గిన్నెలు చెట్లపైకి వెళ్తున్నాయి. కోతుల బెడద నుండి నిత్యం ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. వాటిని తరిమికొట్టిన వారే ఓట్లకు రావాలి అంటూ యూత్ సభ్యులు ప్రకటించారు. పదవి కావాలంటే ఈ కండీషన్ ఉండాలని యూత్ సభ్యులు కోరుకుంటున్నారు. కోతుల బాధతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. గతంలో కోతుల సమస్య తీరుస్తామంటూ చెప్పిన నేతలు, ఆ తర్వాత సరైన శ్రద్ధ పెట్టలేదు. దీంతో కోతుల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. ఇప్పుడు స్థానిక ఎన్నికలకు సమయం ఆసన్నం కావడంతో ఇదే సరైన అవకాశంగా భావిస్తున్నారు. కోతుల సమస్య తీర్చాల్సిందేనంటూ ఓట్లు అడగడానికి వచ్చే ఆశావహులకు తెగేసి చెప్తున్నారు. ఓటుకు నోటు వద్దే వద్దు. కొత్త రోడ్లు వేయకపోయినా పర్వాలేదు. గొంతెమ్మ కోరికలు ఏమీ లేవు. కేవలం కోతులను తరమండి చాలు.. అని అంటున్నారు. స్థానిక యూత్ సభ్యులు.

## పునః ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

- విస్తరణ ఆటంకాలకు ఎమ్మెల్యే చెక్
- ఊహలు తారుమారు చేసి అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి



**ఖానాపూర్, డిసెంబర్ 02 (జనం సాక్షి) :** రోడ్డు విస్తరణ పనులు నిలిచిన నాటి నుండి నేటి వరకు ఖానాపూర్ పట్టణంలో ప్రధానంగా రోడ్డు విస్తరణ పైనే చర్చ ఉండేది. దానికి భిన్నంగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట నిలబెట్టుకుని పునః ప్రారంభించడంతో వ్యతిరేకుల ఆలోచనలు తారుమారు అయినంత పని అయింది. రోడ్డు విస్తరణకు పలుమార్లు గత పాలకులు ప్రయత్నం చేసినా ప్రజలు సహకరించకపోవడం, సయోధ్య కుదరకపోవడం వారితో అభివృద్ధిపై సదరు నాయకులు చర్చించకపోవడం తదితర కారణాలతో రోడ్డు విస్తరణ నిలిచిన విషయం పట్టణ ప్రజలకు విధితమే. దానికి భిన్నంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చెప్పిన మాట నిలబెట్టుకునే ప్రయత్నంలో ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసి తనదైన శైలిలో అభివృద్ధికి అడ్డుపడుతున్న కొందరు వ్యక్తులను నొక్కిపెట్టి సయోధ్య బాటను బట్టి సామవేద దండోపాయ రీతిలో రోడ్డు వెడల్పు పనులను పునః ప్రారంభించి ప్రజల్లో తనదైన సత్తా చాటుకున్నాడు. ఇదంతా గమనిస్తున్న ప్రతిపక్ష పార్టీలు చేసేదేమీ లేక అభివృద్ధికి మేము సైతం అనే సమయం ఆసన్నమైందని రచ్చబండ చర్చలు జరుగుతున్నాయి. రోడ్డు వెడల్పు చేయండి, సాధ్యం కాని పనులు ఎలా చేస్తారు అని వ్యతిరేక పార్టీల వారు పలువురు ఆరోపణలు చేసినా, అడ్డుకట్ట వేసినా ఎమ్మెల్యే తనదైన రీతిలో సయోధ్య కుదుర్చుకొని శాంతి బాటలో వ్యతిరేకమనే మాట రాకుండా రోడ్డు విస్తరణ పనులను పునః ప్రారంభించడం అభినందనీయమని పలువురు పటేల్ పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనదైన శైలిలో ప్రజల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకొని ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే పనులకు జనం హాట్సాఫ్ చెబుతున్నారు. ఇదిలా ఉండగా స్థానికంగా ఎమ్మెల్యే ఉండడం లేదు, స్థానికులకు న్యాయం జరగదు, అభివృద్ధికి ఆమడ దూరంలో నియోజకవర్గ కేంద్రం అంటూ చర్చలు జరిపిన కొందరు ఇప్పుడు ఏమి చర్చించాలో తోయలేని పరిస్థితిలో ఉన్నారంటూ కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలలో కలిసొస్తుందని స్థానికంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇకపై ఎప్పుడు ఎలాంటి అభివృద్ధి పనులు చేపడతారని ప్రజలు వేచి చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకున్న పటేల్ ప్రధానమైన సమస్యలను పరిగణలోకి తీసుకొని వాటిని తనదైన శైలిలో ఉన్నత అధికారులతో, మేధావి వర్గాలతో చర్చించి సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వ నిధుల వెచ్చింపు పై పరిశీలించి అడుగులు వేస్తున్న ఎమ్మెల్యే తీరును ప్రజలు స్వాగతిస్తున్నారు. అభివృద్ధి బాటలో పార్టీలకతీతంగా పారదర్శకంగా తనదైన శైలిలో ముందుకు పోతున్న ఎమ్మెల్యే పనితీరుతో ఖానాపూర్ ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే అభివృద్ధి చేయడు అని ఆరోపణలు చేసిన వారి నోటికి తాళం వేసినంత పనైంది.



## ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్‌కు సాగంటి చిత్రం ఎంపిక

**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 02 (జనం సాక్షి) :** ఈ నెల 3,4,5 తేదీలలో హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ కేంద్రంగా కళాయజ్ఞ సృష్టికర్త ఏలూరి శేష బ్రహ్మం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్-2025 (ఆర్ట్ ఎగ్జిబిషన్) లో హనుమకొండకు చెందిన ప్రముఖ చిత్రకారిణి, విద్యా కళాశాల అధ్యాపకురాలు, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి కుంచె నుండి ప్రాణం పోసుకున్న చిత్రం ఎంపిక అయింది... "భారత దేశ సంప్రదాయ గృహాలు" అనే ప్రత్యేక అంశం పై రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖ ఆర్టిస్టులు పాల్గొనే ఈ ప్రదర్శన కు తన చిత్రం ఎంపిక కావడం గర్వకారణం అని మంజుల సంతోషాన్ని మీడియా తో పంచుకున్నారు... ప్రస్తుతం కాంక్రీటు గోడల్లో ఉంటున్న సమాజానికి ప్రాచీన సంప్రదాయ రీతుల్లో కట్టిన నివాసాలు ఎలా ఉండేవో తెలియజేసే ఈ ప్రదర్శనకు ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా రానున్నారని అందుబాటులో ఉండి, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరు ఆహ్వానితులే అని మంజుల తెలిపారు...

## టీబీ నియంత్రణకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష




హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 2 (జనం సాక్షి) :టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పట్టణ పరిధిలోని బోడగుట్ట, సోమిడి వడ్డేపల్లి, లష్కర్ సింగారం, పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హసన్ పర్తి, కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,98,000 ప్రభావిత గ్రూపులకు చెందిన వారిని పరీక్షించి అవసరమైన పరీక్షలు నిర్వహించవలసి ఉండగా1,30,049 మందికి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. స్క్రీనింగ్ తక్కువగా నిర్వహించిన వడ్డేపల్లి, లష్కర్ సింగారం , కడిపికొండ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఇందుకు గల కారణాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దేశంలో టీబీ నిర్మూలన లక్ష్యంగా ఈ కార్యక్రమం టీబీ ముక్త్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య టీబీ ముక్త్ భారత్, గర్భిణీ స్త్రీల నమోదు , ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు, ఆశాలవారీగా సమీక్షించి కారణాలను తెలుసుకొని వాటిని అధిగమించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.100 శాతం ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగడానికి ప్రోత్సహించిన ఆరుగురు ఆశాలను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, పీవోడిటి డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డెమో వి అశోక్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో పెండింగ్ లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆర్అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, ఆర్అండ్ బి ఇంజనీరింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ప్రతి గ్రామ, మండలం, ప్రధాన రహదారుల నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, ఆలస్యం జరిగితే కారణాలు వివరించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతలో రాజీ పడొద్దని క్వాలిటీ కంట్రోల్ ద్వారా పరీక్షించాలని తెలిపారు. మేడారం జాతర దృష్టిలో ఉంచుకొని జాతరకు అనుసంధానం చేసే రోడ్ల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. ఎవరైనా కాంట్రాక్టర్ పనుల విషయంలో అలసత్వం వహిస్తే వారిని తొలగించి వేరొక కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేపించాలని తెలిపారు. ఆర్అండ్ బి తో పాటు ఇతర ఇంజనీరింగ్ శాఖలతో మళ్లీ ఒక సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ ద్వారా ప్రణాళిక, ప్రణాళికేతర, డిఎంఎఫ్టి, ఎస్టీఎస్డిఎఫ్, ఎస్సి ఎస్డిఎఫ్, ఆర్డీఎఫ్, బిల్డింగ్స్, సిఆర్ఐఎఫ్, ఎల్ డబ్ల్యుఈ ద్వారా 578.71 కోట్లతో 38 పనులు చేపట్టామని, వాటిలో 7 పనులు పూర్తి కాగా,16 పనులు పురోగతిలో ఉన్నాయని,15 పనులు ప్రారంభం కాలేదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్అండ్ బి ఈఈ రమేష్, సీపీఓ బాబురావు, ఆర్అండ్ బి డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## నేడు ఆర్కేపి ఓసీ ఫేజ్-2 ప్రజాభిప్రాయ సేకరణ

- సహకరించాలని కోరిన జిఎం రాధాకృష్ణ, ఎసిపి రవికుమార్



**రామకృష్ణాపూర్, డిసెంబర్ 02(జనంసాక్షి):** మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఆర్కే-4 గడ్డ ప్రాంతంలో ఏర్పాటు చేయబోయే ఆర్కేపి ఫేజ్ -2 ఉపరితల గనికి పట్టణ ప్రజలు సహకరించాలని ఏరియా జిఎం రాధాకృష్ణ, బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ కోరారు. ఆర్కే-4 సమీపంలోని మహాలక్ష్మి కంపెనీలో నేడు నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. అనంతరం ఓసీ సమీప శాంతినగర్ కాలనీ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ ఓసీ వలన పట్టణ ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లదని, ఏరియా అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఓసీతో పట్టణానికి పూర్వ వైభవం రావడంతో పాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యానికి సంబంధించి తగిన జాగ్రత్తలు వహిస్తామన్నారు. నేడు నిర్వహించే పబ్లిక్ హియరింగ్ కు సమీప ప్రాంత ప్రజలతో పాటు, పట్టణ వాసులు, అన్ని సంఘాల నాయకులు పాల్గొని ఉపరితల గని ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్వోటూ జిఎం. జీ.ఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, డీజీఎం ఈఅండ్ఎం ధూప్ సింగ్, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్ రెడ్డి, సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, పర్యావరణ శాఖ అధికారులతో పాటు శాంతి నగర్ కాలనీ వాసులు యాకుబ్ అలీ, రెవెల్లి ఓదెలు, పాల్గొన్నారు.


## గట్టమ్మ దేవాలయం వద్ద భక్తులు ఇబ్బంది పడకూడదు

- ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు
- రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి
- జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్



**ములుగు బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి):** మేడారం మహా జాతర కోసం వచ్చే భక్తులు ముందుగా జాకారం సమీపంలోని గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించుకుంటారని, ఆ సమయంలో భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను,ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ గారు అన్నారు.నూతన రహదారుల ఏర్పాట్ల విషయమై, రోడ్డు విస్తరణ పనుల విషయమై అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని,వివిధ శాఖల అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి రవీందర్,ములుగు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శంకర్ నాయక్,ములుగు సిఐ సురేష్,ములుగు ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఇంచార్జి మంత్రి జూపల్లిని కలిసిన కుచాడీ శ్రీహరి రావు



**నిర్మల్ బ్యూరో, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం నిర్మల్ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు నివాసంలో తేనేటి విందుకు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రికి పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలపై శ్రీహరిరావుతో మంత్రి చర్చించారు.

## బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



**బెల్లంపల్లి, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** బాలికలు చట్టాలపై అవగాహనా కలిగి ఉండాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. మంగళవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన షీ టీం, మహిళా చట్టాలపై అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం అని, పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం కోసం పోక్సో చట్టాన్ని రూపొందించిందని వివరించారు. వికృత చేష్టలతో పిల్లలు జీవించే హక్కును హరించిన వారికి ఈ చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. శారీరకంగా, మానసికంగా వారిని వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటారని, 2012లో వచ్చిన ఈ ఫోక్సో చట్టం 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందని, వారిపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలతో పాటు మరణశిక్ష కూడా విధిస్తారని వివరించారు. విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 100కు లేదా షీ టీమ్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులకు పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు, టీ - సేఫ్ యాప్, షీ టీమ్ లపై సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి, లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం చలికాలం సందర్భంగా బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సి కార్పొరేషన్ డిడి చాతరాజుల దుర్గాప్రసాద్, ఏఎస్డబ్ల్యూఓలు ధర్మానంద్ గౌడ్, ప్రశాంత్, మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్సై హైమ, సిబ్బంది మహిళా కానిస్టేబుళ్లు జ్యోతి, శ్రవణ్ , వసతి గృహం సంక్షేమ అధికారులు విజయలక్ష్మి, సుజాత, నిక్కత్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పుడు బీసీ సర్టిఫికెట్లను రద్దు చేయాలి

- కలెక్టరేట్ ముందు టీఆర్పీ నేతల నిరసన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మహాదేవపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో కొంతమంది రెడ్లకు బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేశారని, వెంటనే వాటిని రద్దు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, నాయకులు ఎస్పీకే సాగర్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ముందు మంగళవారం టీఆర్పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి గాండ్లకు సంబంధించి మహాదేవపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13మంది రెడ్లకు బీసీ సర్టిఫికెట్లు జారీ చేశారని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని వారు హెచ్చరించారు. అనంతరం స్థానికంగా జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు శ్రీకాంత్, శ్రీధర్, సమ్మయ్య, సాయి, సలీం పాషా, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
03 డిసెంబర్ 2025

# స్థానిక సంస్థల నుంచే రాజకీయ చైతన్యానికి అంకురార్పణ

- దేశాభివృద్ధికి గీటురాళ్లు..పల్లెలే
- పల్లెల నుంచే భావిపాలకులు

**పెనుబల్లి, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్య పాలనకు ఆరంభం పల్లెలే.పాలనా వికేంద్రీకరణకు కూడా ఇవే మూలం.ప్రజల రాజకీయ చైతన్యానికి అంకురార్పణ జరిగేది కూడా ఇక్కడ నుంచే. దేశాభివృద్ధికి గీటురాళ్లు పల్లెలే.పల్లెలను దేశానికి పట్టుగొమ్మలంటారు.అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు అంత ప్రాధాన్యత.సమాజానికి ఆదర్శంగా ఉండే బాధ్యతాయుతమైన పౌరులు కూడా ఇక్కడి నుంచే తయారవుతారు. ఈ దృష్ట్యానే గ్రామ స్వయం పరిపాలనకు రాజ్యాంగం హక్కులు కల్పించింది. గ్రామ సభలో నిర్ణయమే అత్యున్నతమైనది. ప్రజలు తమను తాము ఇక్కడి నుంచే పరిపాలన చేసుకోవడం ప్రారంభిస్తారు. గ్రామాభివృద్ధికి కీలకమైన పారిశుద్ధ్యం,రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి పనులన్నీ గ్రామ పంచాయతీల ద్వారానే నిర్వహిస్తారు.పాలనను వీధుల వరకు తీసుకువెళ్లేందుకు వీలుగా



గ్రామాలను వార్డులుగా విభజన చేసి గ్రామ సర్పంచులతో పాటు వార్డు సభ్యులను కూడా ఈ స్థానిక సంస్థల ఎన్నికలలోనే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారు.ఆ విధంగా గ్రామ పాలనలో ప్రజల భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యత ఉంది.ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా వంటి చట్టాలు తీసుకొచ్చారు. సహజ వనరుల వినియోగంలో పంచాయతీలకే సర్వాధికారాలు ఇవ్వబడ్డాయి. గ్రామ పాలనలో అధికారం పంచుకోవాలనే వారు స్థానిక ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతారు.రాజకీయాల్లో ఎదగాలనుకునే వారికి ఈ ఎన్నికలు రిహార్సల్‌గా ఉపయోగపడతాయి. క్రీడల్లో రాణించాలంటే ముందు మైదానంలో బాల్ అందించాల్సి ఉంటుంది.అదే సూత్రం రాజకీయాల్లో కూడా వర్తిస్తుందనడానికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడాన్ని చెప్పుకోవచ్చు.ఎంత పెద్ద నాయకుడైనా స్థానిక ఎన్నికల్లో అనుభవం లేకుండా ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యపడదు.వారసత్వం, డబ్బున్న వారు మాత్రమే సరాసరి చట్ట సభలకు వెళ్లే ప్రయత్నం చేయగలుగుతారు. ఏ ఆసరా లేనివారు ప్రజల్లో పనిచేస్తూ వారి మన్నలను పొందుతూ కింద నుంచి ఎదగాల్సిందే.వార్డు సభ్యులు.సర్పంచులుగా పని చేసిన వారు ఎందరో చట్టసభల్లో సభ్యులై మంత్రులుగా ఎదిగిన వారు ఉన్నారు. ఏదేమైనా పల్లె సీమల భవిష్యత్తు ఉన్నతమైన ఆలోచనలు ఉన్న స్థానిక పాలకుల చేతుల్లోనే ఉంటుంది.ఆదర్శవంతమైన నాయకుల్ని ఎన్నుకున్నప్పుడే పల్లెలు సౌభాగ్యంగా ఉంటాయి.

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**చిలుకూరు, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కొరకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలలో 5 గంటల తర్వాత అభ్యర్థులు ఉంటే వారికి వరుస క్రమంలో టోకెన్లు జారీ చేయాలని ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే మరో నామినేషన్ స్వీకరణ కౌంటర్ ను ఏర్పాటు చేసి నామినేషన్ లను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. టి పోల్ యాప్ లో నామినేషన్ వివరాలను సంక్షిప్తంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యానారాయణ, జడ్పీ డిప్యూటీ సిఈఓ శిరీష, తహసీల్దార్ ధ్రువ కుమార్, ఎంపిడిఓ నరసింహారావు, ఆర్ఓలు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త వహించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**కోదాడ, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** నామినేషన్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.అనంతగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అనంతగిరి, కిష్టపురం, అమీనాబాద్, కోదాడ మండలం గుడిబండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుడిబండ, అడ్లూర్, తొగర్రాయి, అల్వాల పురం సర్పంచ్ లకు, వార్డు సభ్యుల ఎన్నిక నిమ్మిత్తం కొరకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని,అనంతగిరి ఎంపిడిఓ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. నామినేషన్ కేంద్రాలలో సాయంత్రం 5 గంటల తర్వాత నామినేషన్ వేయుటకు అభ్యర్థులు ఉంటే వారికి టోకెన్లు జారీ చేయాలని ఆదేశించారు.అనంతగిరి ఎంపిడిఓ కార్యాలయంలో నామినేషన్ ఆన్లైన్ చేసే విధానాన్ని పరిశీలించారు. నామినేషన్లు స్వీకరించిన తరువాత వెంటనే ఎలాంటి తప్పులు దొర్లకుండా టి పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్లు హిమబిందు, వాజీద్ అలీ, ఎంపిడిఓ లు ఇజాక్ హుస్సేన్,ఆర్ ఓ లు, అధికారులు, తదితరులు ఉన్నారు.

## మునుగోడు ఎమ్మెల్యే మద్యం దుకాణాల రూల్స్ అమలు

**చండూరు, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** మునుగోడు నియోజకవర్గంలో వ్యాపారులకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరికలు జారీచేసిన విషయం మునుగోడు నియోజకవర్గ ప్రజలకు తెలిసినదే...ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీ నిబంధనలు మునుగోడు నియోజకవర్గంలో చెల్లవు. ఇక్కడ నేను చెప్పిన సమయపాలన పాటిస్తూ, నేను రూపొందించిన రూల్స్ ఫాలో అవుతామంటేనే మద్యం దుకాణాలు తెరవాలి. లేదంటే దుకాణాలను అప్పగించి వెళ్లిపోండి' అంటూ... మద్యం టెండర్లకు ముందు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి హుకుం జారీ చేశారు.వాటిని ఊరికి బయట దూరంగా ఏర్పాటు చేయాలని, అవి కూడా సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకే తెరవాలని, సిట్టింగ్లకు కూడా ఇదే సమయాన్ని పాటించాలి.చండూరులోని మద్యం దుకాణాదారులు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సూచించిన నియమాలను పాటిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇందులో భాగంగా మద్యం దుకాణాల నిర్వాహకులు మద్యం





దుకాణాలను మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే తెరుస్తున్నారని, అలాగే పర్మిట్ రూముల్లోకి సాయంత్రం 6 గంటల తర్వాతే వినియోగదారులను అనుమతిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నూతన నియమావళిని అమలు చేస్తున్నందుకు పట్టణ మహిళలు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి

- టిటిడిపి రాష్ట్ర కార్యదర్శి రాపోలు నరసింహ

**రామన్నపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** రామన్నపేట - సిరిపురం మధ్యలో ఉన్న రైల్వే అండర్ పాస్ వంతెన దగ్గర వర్షాలు వెలిసి 20 రోజులు అవుతున్న నీరు నిల్వ ఉండి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇట్టి విషయంలో రైల్వే అధికారులు వెంటనే చొరవ తీసుకొని పరిష్కార మార్గం చూపాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నరసింహ అన్నారు. సముద్రాలపై రైల్వే ట్రాక్లు నిర్మాణం చేసి రైల్వే వ్యవస్థను పటిష్టంగా తయారు చేసినటువంటి అధికారులు ఇక్కడ ఉన్న చిన్న సమస్యను పరిష్కారం చేసి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడకపోవడం విచారకరమైన విషయం అన్నారు.నిత్యం మండల కేంద్రానికి చౌటుప్పల్ కు వెళ్లే ప్రయాణికుల వాహనాల సైలెన్సర్ లోకి నీరు పోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇట్టి విషయంలో రైల్వే



అధికారులు ప్రత్యేకమైన చొరవ చూపాలని కోరారు. ప్రతి సంవత్సరం కూడా ఇట్టి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయినా కానీ పరిష్కారం చూపకపోవడం విచారకరమని, వెంటనే పరిష్కార మార్గం చూపి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోషిక చక్రపాణి, గంజి సత్యనారాయణ, కంకల మల్లేశం, నిమ్మల మధు, బదుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల నామినేషన్ సెంటర్‌లోకి ముగ్గురే అనుమతి

- అదనపు కలెక్టర్ సీతారామారావు



**పెన్‌పహాడ్, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** స్థానిక ఎన్నికల నామినేషన్ సెంటర్లోకి ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే సర్పంచలు, వార్డు సభ్యుల వివరాలను టీ పోల్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. మంగళవారం పెన్ పహాడ్ మండల కేంద్రంతో పాటు అనంతారం గ్రామం లోని నామినేషన్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో నామినేషన్ వేసిన అభ్యర్థుల దరఖాస్తులను ఫాం-2ఎ, 2బి రిపోర్టులను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, కోడ్ పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసిల్దార్ ధరావత్ లాలు నాయక్, ఎంపీడీవో ఏ జానయ్య, ఎంపీ ఓ బిస్ రాజేశ్వర్, రిటర్నింగ్ అధికారులు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మూడో రోజు విజయవంతంగా ముగిసిన నామినేషన్లు



**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల మూడో రోజు కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసింది. ఉదయం నుంచే అభ్యర్థుల రద్దీ కనిపించిన నామినేషన్ కేంద్రాల్లో కార్యక్రమాలు సజావుగా కొనసాగాయి. పోలీసుల పటిష్ట బందోబస్తుతో ఎటువంటి ఇబ్బంది లేకుండా నామినేషన్లు స్వీకరించారు. మండలంలోని పిల్లయిపల్లి, జూలూర్, ఇంద్రియాల, పెద్దరావులపల్లి, జలల్పూర్, దంతూర్, జిబ్లాక్ పల్లి వంటి ఏడు క్లస్టర్లలోని 21 గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు సాఫీగా పూర్తయ్యాయి. అభ్యర్థులు సమర్పించిన పత్రాలను బుధవారం నుంచి అధికారులు స్క్రూటినీ చేయనున్నారు. మిగతా రోజుల్లోనూ నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికార యంత్రాంగం సూచించింది.

## అథ్లెటిక్స్‌లో రాణించిన పరుగుల రాణి ఉమా

- పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన రాజశేఖర్



**నూతనకల్, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ని మర్రిపల్లి ఉమా అథ్లెటిక్స్ కు సంబంధించిన పరుగుపందెంలో ఎన్నో అవార్డులు , బంగారు పతకాలు సాధించింది, ఆ గ్రామానికి చెందిన వీరయ్య రేణుకల కుమార్తె ఉమ పాఠశాల స్థాయి నుంచి ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో పాల్గొంటుంది, ఈ సందర్భంగా ఆమె ప్రతిభను గుర్తించి డిసెంబర్ 7న ఢిల్లీలో జాతీయస్థాయిలో అథ్లెటిక్స్‌లో పాల్గొనడానికి ఎంపికైంది, తమ గ్రామానికి చెందిన ఉమా ప్రపంచస్థాయిలో గుర్తింపు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆమె ప్రతిభను గుర్తించిన గ్రామానికి చెందిన వీరబోయిన రాజశేఖర్ తన తాత వీరబోయిన సీతారాములు. అన్న ఉపేందర్ జ్ఞాపకార్థం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాడు. ఈ కార్యక్రమంలో మధు, దయాకర్, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గం లోని ప్రతి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారంకాప్రా డివిజన్ పరిధిలోని శ్రీ సాయి శివ నగర్ లో 90 లక్ష రూపాయల నిధులతో చేపట్టిన రోడ్డు పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. కాలనీలో ఎన్నో యేండ్ల నుండి తమ కాలనీ కి రోడ్డు లేక నరక యాతన పడుతున్నాం అని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రోడ్డు మంజూరు చేయడం అభినందనీయం కాలనీవాసులు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన



సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ , కాలని అధ్యక్షురాలు రాధిక , ప్రధాన కార్యదర్శి రామ రాజు ,సుకుమార్ నాయడు రోహిత్ బాలకృష్ణ మహేష్ గౌడ్ , రాకేష్ కాలనీ వాసులు బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరు



**అల్వాల్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఆమెను శాల్వలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శాంతి శ్రీనివాస్ రెడ్డి సమాజ సేవలో కొనసాగుతున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి, అల్వాల్ బిఆర్ఎస్ నాయకులు, చరణ్ గిరి, శోభ్ బాబు, ప్రేమ్ కుమార్, మల్లేష్ గౌడ్, లోకేష్, ప్రశాంత్ రెడ్డి, మోసిన్, సాజిత్, నందిని సహా పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు శాంతి శ్రీనివాస్ రెడ్డి కృషిని గుర్తుచేసి అభినందనలు తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ





**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుండి ఈ నెల 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు.అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని అన్నారు.చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. బాణాసంచా,డీజెలు ఉపయోగించవద్దని అన్నారు.

# పోచంపల్లి మోడల్ స్కూల్ పరిస్థితి అస్తవ్యస్తం

- ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి పగడాల శివ

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** పట్టణ కేంద్రంలోని నారాయణగిరి రోడ్డులో ఉన్న మోడల్ స్కూల్ పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోందని, అనేక సమస్యలతో స్కూల్ కొట్టుమిట్టాడుతోందని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారి పగడాల శివ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతిశీల యువజన సంఘం పోచంపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరువాత శివ మాట్లాడుతూ స్కూల్ వెనుకనున్న డంపింగ్‌యార్డ్‌లో చెత్తను తగలబెట్టినప్పుడల్లా పొగ నేరుగా తరగతులలోకి చేరి విద్యార్థులకు శ్వాసకోశ సమస్యలకు



దారితీస్తోందని చెప్పారు. అలాగే స్కూల్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయం అయి ప్రయాణం కష్టమైందని, సరైన రోడ్డు సౌకర్యం లేదని పేర్కొన్నారు. అదేవిధంగా కోతుల బెడద తీవ్రంగా ఉండడంతో స్కూల్ ప్రాంగణమంతా మురికిగా మారి విద్యార్థుల భద్రతకు ప్రమాదం ఏర్పడుతోందని అన్నారు. భోజన నాణ్యత కూడా కొన్ని సందర్భాల్లో సరైన స్థాయిలో లేకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా చదవాల్సిన వాతావరణం మారి, ఈ సమస్యల వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డును స్కూల్ పరిసరాల నుంచి తరలించాలని, స్కూల్ రోడ్డును బాగు చేయాలని, మిగతా సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పివైఎల్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతగల నరసింహ, గోరుగంటి ముత్యాలు, కొత్త బాబు యాదవ్, చందన, అక్షర, సిరి చందన, నవ్య, వైష్ణవి, కృతిక, లక్కీ, కీర్తన, యశశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అరుదైన కాన్పు



**దేవరకొండ, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు సోమవారం ఓ అరుదైన, అద్భుతమైన కాన్పు చేశారు. సూపరిడెంట్ డాక్టర్ రవి ప్రకాష్, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రవళిక రాథోడ్, అనస్తేషియా డాక్టర్ రేణు గోపాల్ , స్టాఫ్ నర్స్ లావణ్య, ఓ టీ బృందంతో కలిసి ఈ అరుదైన కాన్పు చేసి పురుడు పోశారు. వైద్యులు తెలిపిన వివరముల ప్రకారం ఇది ఒక అరుదైన ప్రసవ స్థితి, "ఎన్ కౌల్ బర్త్" అంటే శిశువు చెక్కుచెదరకుండా ఉన్న ఉమ్మనీటి సంచి లోపల ఉన్నప్పుడే జన్మించడం. సాధారణంగా ప్రసవ సమయంలో ఉమ్మనీటి సంచి పగిలిపోతుంది (దీనిని "నీళ్లు పోసుకోవడం" అంటారు), కానీ ఎన్ కౌల్ ప్రసవంలో, ఈ సంచి అలాగే ఉంటుంది. ఇది చాలా అరుదుగా జరిగే సంఘటన, సుమారు 80,000 జననాలలో ఒకటి కంటే తక్కువగా సంభవిస్తుంది. చాలా సంస్కృతులలో, ఈ విధంగా జన్మించిన పిల్లలు అదృష్టవంతులుగా లేదా ప్రత్యేకమైన విధిని కలిగి ఉంటారని నమ్ముతారు.తల్లి బిడ్డల కాపాడిన వైద్య బృందానికి నీలమ్మ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## విపణి

# తయారీపై 'టారిఫ్‌ల' ప్రభావం

- నవంబర్‌లో 56.6కు పీఎంఐ పరిమితం
- అక్టోబర్‌లో ఇది 59.2 పాయింట్లు
- 9 నెలల కనిష్టానికి చేరిక

**న్యూఢిల్లీ:**తయారీ రంగం పనితీరు నవంబర్‌లో కొంత బలహీనపడింది. తొమ్మిది నెలల కనిష్ట స్థాయికి చేరింది. తయారీ రంగం పనితీరును సూచించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.6 పాయింట్లకు పరిమితమైంది. అక్టోబర్‌లో ఇది 59.2 పాయింట్లుగా ఉండడం గమనార్హం. సాధారణంగా 50కు పైన నమోదైతే, విస్తరణగానే పరిగణిస్తుంటారు.అమెరికా టారిఫ్‌లు తయారీ కార్యకలాపాల విస్తరణను నిదానించేలా చేసినట్టు నవంబర్ నెల పీఎంఐ గణాంకాల ఆధారంగా తెలుస్తోందని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థిక వేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. అంతర్జాతీయంగా విక్రయాలు సానుకూలంగా ఉన్నట్టు కంపెనీలు చెబుతున్నప్పటికీ.. ఆఫ్రికా, ఆసియా, యూరప్, మధ్య ప్రాచ్యంలోని క్లయింట్లకు అమ్మకాల్లో వృద్ధి కొంత నిదానించినట్టు చెప్పారు. కొత్త ఎగుమతి ఆర్డర్లు రాక 13 నెలల కనిష్టానికి చేరినట్టు ప్రంజుల్ భండారీ తెలిపారు. వ్యాపార విశ్వాసం సైతం నవంబర్‌లో పడిపోయినట్టు చెప్పారు. టారిఫ్‌ల ప్రభావంపై పెరిగిన ఆందోళనలను తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.'జీఎస్‌టీ రేట్ల కోత ప్రభావం క్రమంగా ఆవిరవుతోంది. డిమాండ్‌పై టారిఫ్‌ల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇది చాలకపోవచ్చు' అని భండారీ అభిప్రాయపడ్డారు. నవంబర్‌లో తయారీ వ్యయాలు, విక్రయ ధరలు ఎనిమిది నెలల కనిష్ట స్థాయిలో పెరిగాయి. తగ్గిన ఆర్డర్లకు అనుగుణంగా నియామకాలు, కొనుగోళ్ల ప్రణాళికలను సంస్థలు సవరించుకుంటున్నట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ రంగ పీఎంఐ సర్వేలో తెలిసింది. నియామకాలు 21 నెలల కనిష్ట స్థాయిలో పెరిగాయి. వచ్చే 12 నెలల కాలానికి తయారీ ఉత్పత్తిని పెంచుకుంటామన్న విశ్వాసం కంపెనీల్లో కనపించడగా, సానుకూల సెంటిమెంట్ మాత్రం మూడున్నరేళ్ల కనిష్టానికి పడిపోయింది. 400 తయారీ సంస్థలకు సంబంధించి పర్చేంజింగ్ మేనేజర్ల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను హెచ్‌ఎస్‌బీసీ ఇండియా విడుదల చేస్తుంటుంది.



# భారత వృద్ధి రేటు అంచనాలు పెంపు

**న్యూఢిల్లీ:**ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో భారత వృద్ధి రేటు అంచనాను ఏడు శాతానికి పెంచుతున్నట్లు ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ తెలిపింది. అంతకుముందు 6.5% వృద్ధిని అంచనా వేసింది. 2025-26 ప్రథమార్ధంలో దేశీయ వృద్ధి రేటు అంచనాలకు మించి 8% వృద్ధి సాధించిన నేపథ్యంలో వృద్ధి అవుట్‌లుక్‌ను అప్‌గ్రేడ్ చేసింది. భారత వాస్తవ జీడీపీ వృద్ధి రెండో త్రైమాసికంలో 8.2 శాతంగా నమోదై, అంచనాలను మించిందని క్రిసిల్ ఆర్థికవేత్త ధర్మకృతి జోషి తెలిపారు.ద్రవ్యోల్బణం దిగిరావడంతో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీ వృద్ధి మోస్తారు స్థాయిలో 8.7%గా నమోదైంది. అమెరికా సుంకాల విధింపు ప్రభావంతో 2025-26 ద్వితీయార్ధంలో వృద్ధి 6.1 శాతానికి పరిమితం కావొచ్చని జోషి అంచనా వేశారు. "ప్రైవేటు వినియోగం వాస్తవ జీడీపీ వృద్ధికి ప్రధాన ఇంధనంగా నిలిచింది. సప్లై దృష్టి కోణంలో తయారీ, సేవల రంగాల్లో వృద్ధి



గణనీయంగా పెరిగింది. దేశంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గడంతో స్వచ్ఛంద వినియోగ వ్యయం ఊపందుకుంది. మూడో క్వార్టర్‌లో ఈ అనుకూల పరిస్థితులు కలిసొస్తాయి. ప్రభుత్వ పెట్టుబడుల్లో స్థిరత్వం కొనసాగే వీలుంది. ప్రైవేటు పెట్టుబడులు ఆలస్యమైనప్పటికీ.., క్రమంగా పెరగొచ్చు" అని తెలిపారు.

# ఆరు నెలల గరిష్టానికి డీజిల్ విక్రయాలు

**న్యూఢిల్లీ:**పండుగ సీజన్, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దన్నుతో ఎకానమీ పరుగులు తీసిన నేపథ్యంలో దేశీయంగా నవంబర్‌లో డీజిల్ అమ్మకాలు ఆరు నెలల గరిష్టానికి ఎగిశాయి. పెట్రోలియం ప్లానింగ్, అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) డేటా ప్రకారం వార్షిక ప్రాతిపదికన 4.7 శాతం పెరిగి 8.55 మిలియన్ టన్నులుగా నమోదైంది. మే నెల తర్వాత ఇది అత్యధిక స్థాయి. జూన్‌లో వర్షాకాలం మొదలైనప్పటి నుంచి సెప్టెంబర్ వరకు తగ్గుముఖం పట్టిన అమ్మకాలు అక్టోబర్‌లో తిరిగి కొంత పుంజుకుని 6.79 మిలియన్ టన్నులకు చేరుకోగా, నవంబర్‌లోనూ అదే ధోరణి కొనసాగింది. 2023 నవంబర్ నాటి 7.52 మిలియన్ టన్నులతో పోలిస్తే తాజాగా 13.61 శాతం, కోవిడ్ పూర్వం 2019తో పోలిస్తే వార్షికంగా 2 శాతం మేర డీజిల్ వినియోగం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో డీజిల్ అమ్మకాలు వార్షికంగా 2.76 శాతం పెరిగి 61.85 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. మరోవైపు, నవంబర్లో పెట్రోల్ వినియోగం 2.19 శాతం పెరిగి 3.5 మిలియన్ టన్నులుగా నమోదైంది. విమాన ఇంధనం వినియోగం 4.7 శాతం పెరిగి 7,83,000 టన్నులకు, ఎల్‌పీజీ విక్రయాలు 7.62 శాతం వృద్ధితో 3 మిలియన్ టన్నులకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో పెట్రోల్ డిమాండ్ 6.25 శాతం పెరిగి 28.35 మిలియన్ టన్నులకు చేరింది.

# వైబ్ కోడింగ్.. 'ఏఐకి అంత సీన్ లేదు'

**న్యూఢిల్లీ:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత 'వైబ్ కోడింగ్'పై టెక్ దిగ్గజాల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నేచురల్ లాంగ్వేజీలో ఆదేశాలు ఇస్తూ ఏఐ ద్వారా కోడ్‌ను రాయించుకునే ఈ విధానంపై గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అనుకూలంగా స్పందిస్తుంటే, టెక్ టైకూన్ జోహో సీఈఓ శ్రీధర్ వెంబు అంతగా దీన్ని సపోర్ట్ చేయడం లేదు.అందుకు వారు చెబుతున్న కారణాలు విభిన్నంగా ఉన్నాయి. అవి ఏమిటో చూద్దాం. వైబ్ కోడింగ్ అనేది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో కొత్తగా వాడుకలోకి వచ్చిన ఒక విధానం. ఇందులో సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని వ్యక్తులు కూడా తమ ప్రాజెక్ట్ లక్ష్యాలను సాధారణ, రోజువారీ భాషలో ఏఐ ఆధారిత టూల్స్‌కు కమాండ్ ఇస్తారు. ఏఐ ఆ ఆదేశాలను అర్థం చేసుకొని దానికి సంబంధించిన ఫంక్షనల్ కోడ్‌ను జనరేట్ చేస్తుంది. కోడింగ్ పరిజ్ఞానం లేనివారు కూడా యాప్‌లు, వెబ్‌సైట్‌లు లేదా ప్రోటోటైప్‌లను సులభంగా తయారు చేయవచ్చు.

### సుందర్ పిచాయ్..

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వైబ్ కోడింగ్‌ను సానుకూలంగా చూస్తున్నారు. టెక్నికల్ పరిజ్ఞానం లేని వ్యక్తులు కూడా తమ ఆలోచనలను ప్రోటోటైప్‌లుగా మార్చవచ్చని చెబుతున్నారు. గతంలో ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ఆలోచన గురించి మాటల్లో వివరించేవారు. ఇప్పుడు, వైబ్ కోడింగ్ ద్వారా ఆ ఆలోచనకు కోడెడ్ వెర్షన్ లేదా ప్రోటోటైప్‌ను జనరేట్



చేసే వీలుందన్నారు.

### శ్రీధర్ వెంబు..

జోహో సీఈఓ శ్రీధర్ వెంబు వైబ్ కోడింగ్ పట్ల అంతగా సానుకూలంగా లేరు. ఏఐ జనరేట్ చేసే కోడ్ మనకు అద్భుతంగా అనిపించినప్పటికీ, కంప్యూటర్ ఎలా పనిచేస్తుందనే క్లిష్టమైన, లోతైన అవగాహన అవసరమన్నారు. ఏఐ సాధారణంగా రీయూజబుల్ కోడ్‌ను రాయడంలో సహాయపడుతుందన్నారు. కానీ, కోర్ లాజిక్, కొత్త సమస్యలను పరిష్కరించే సామర్థ్యాలు ఏఐకి ఉండవని చెప్పారు. ఇవి మానవ సృజనాత్మకత, అనుభవంపై ఆధారపడి ఉంటాయని వెంబు నమ్ముతున్నారు. కోడింగ్ అనేది ఓ మ్యాజిక్ అన్నారు.

వైరుధ్యంలో ఏకాభిప్రాయం

ఈ రెండు దృక్పథాల మధ్య పిచాయ్ కూడా ఓ పోడ్‌కాస్ట్‌లో వైబ్ కోడింగ్ పరిమితులను అంగీకరించారు. కొన్ని రకాల లార్జ్, సెక్యూరిటీ సిస్టమ్స్‌కు వైబ్ కోడింగ్ సరిపోదన్నారు. అందుకు

## ఎగసి అలసిన పసిడి..



ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.

## నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే మంగళవారం నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈరోజు ఉదయం 09:30 సమయానికి నిఫ్టీ 27 పాయింట్లు తగ్గి 26,146కు చేరింది. సెన్సెక్స్ 146 పాయింట్లు నష్టపోయి 85,488 వద్ద ట్రేడవుతోంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.35 | ₹ 6.37 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,19,350 (22 క్యారెట్లు) | ₹ 1,30,200 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,96,000

# కొనసాగుతున్న వరద సహాయక చర్యలు

- ఇండోనేసియా, శ్రీలంక, థాయ్‌లాండ్‌ల్లో మృతులు వెయ్యికిపైనే
- శ్రీలంక అధ్యక్షుడితో మాట్లాడిన ప్రధాని మోదీ

జకార్తా/న్యూఢిల్లీ: ఇండోనేసియా, థాయ్‌లాండ్, శ్రీలంకల్లో ఇటీవల సంభవించిన వర్షాలు, వరదలకు సంభవించిన ఘటనల్లో మరణాలు వెయ్యి దాటేశాయి. గల్లంతైన వారి సంఖ్య వందల్లో ఉంది. ఆయా దేశాల్లో వరద సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇండోనేసియాలోని సుమత్రా దీవిలో వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో కనీసం 604 మంది చనిపోయారని అధ్యక్షుడు ప్ర'వొ సుబియాంతో తెలిపారు.వేలాది మంది నిరాశ్రయులుగా మారారని, ఇంకా 464 మంది జాడ తెలియాల్సి ఉందని వెల్లడించారు. గత వారం వరదలు సంభవించిన కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ సహాయక బృందాలు చేరుకునేందుకు వీలు కావడం లేదన్నారు. రోడ్లు, సమాచార వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. తీవ్రంగా దెబ్బతిన్న నార్త్ సుమత్ర, వెస్ట్ సుమత్ర, ఆసెహ్ ప్రావిన్స్‌లను ఆయన సోమవారం పర్యటించి, బాధితులను పరామర్శించారు.అదేవిధంగా, థాయ్‌లాండ్‌లో సంభవించిన భారీ వర్షాలు, వరదల్లో 176 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 1.5 లక్షల కుటుంబాలపై వర్షాల ప్రభావం పడింది. దీంతో, ప్రభుత్వం మొదటి విడతలో తీవ్రంగా నష్టపోయిన 26



వేల మందికి 74 లక్షల డాలర్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు, శ్రీలంకలో దిత్వా తుపాను సంబంధిత ఘటనల్లో 366 మంది చనిపోగా 367 మంది గల్లంతయ్యారని అధికారులు సోమవారం ప్రకటించారు.సుమారు 2.18 లక్షల మందికి ప్రభుత్వం తుఫాను షెల్టర్లలో ఆశ్రయం కల్పించింది. తేయాకు తోటలు ఎక్కువగా ఉండే కొండప్రాంతాల్లో నష్టం ఎక్కువగా ఉంది. భారత ప్రధాని మోదీ సోమవారం శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకెతో ఫోన్‌లో మాట్లాడారు. దిత్వా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కార్యక్రమాలకు అవసరమైన సాయం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. భారత ప్రభుత్వం శ్రీలంకకు ఇప్పటికే రెండు విడతలుగా ఆహారం, అత్యవసర వస్తు సామగ్రితోపాటు సిబ్బందిని కూడా పంపించడం తెల్సిందే.


# ట్రంప్ గుండె గట్టిదే

## - ఏమాత్రం తగ్గని ఎనర్జీ లెవల్స్

**న్యూఢిల్లీ:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై పుకార్లు షికార్లు చేయడం సాధారణంగా మారిపోయింది. ఆయన మునుపటిలా లేరని.. ఎనర్జీ లెవల్ దారుణంగా పడిపోయిందని బహుశా వయోభారమే అందుకు కారణమై ఉండొచ్చని తాజాగా న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. ఇది సాధారణంగానే ఆయనకు కోపం తెప్పించింది. ట్రంప్ ఆరోగ్యంపై వస్తున్న కథనాలను వైట్‌హౌజ్ కొట్టిపారేసింది. తాజాగా ఆయన తీయించుకున్న ఎమ్మారై స్కాన్‌తో ప్రెస్ సెక్రటరీ కరోలైన్ లెవిట్ మీడియా ముందుకు వచ్చారు. సాధారణంగా ఆయన వయసు ఉన్నవాళ్లకు ఇమేజింగ్ పరీక్షలు చేయాలని వైద్యులు సూచిస్తుంటారు. అలా ఆయనకు నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి ఆందోళనకరమైన అంశాలు కనిపించలేవు.ఆయన గుండె సాధారణంగానే ఉంది. రక్తనాళాల్లో ఎలాంటి బ్లాకులు లేవు. రక్తప్రవాహానికి ఆటంకం.. గుండె, ప్రధాన రక్తనాళాల్లో ఎలాంటి అసాధారణతలు కనిపించలేదు. ఆయన పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు" అని మీడియా కథనాలను ఖండించారామె. మరోవైపు న్యూయార్క్ టైమ్స్ కథనం మీద ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు కూడా. "ఇప్పటిదాకా నా జీవితంలో ఏనాడూ ఇంతలా కష్టపడలేదు. అంతగా పని చేస్తూ.. పర్‌ఫెక్ట్‌గా ఫలితాలు రాబట్టగలుగుతున్నా. శారీరకంగా, మానసికంగా నేను ఫిట్‌గా ఉన్నా. నా స్టామినా విషయంలో సందేహమే అక్కర్లేదు" అని మొన్నీమధ్యే సోషల్ మీడియాలో ఓ పోస్ట్



చేశారు. న్యూయార్క్ టైమ్స్‌ను తిట్టిపోసిన ఆయన.. ఆ కథనం వెనుక రాజకీయాల ప్రభావం ఉండి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. అలాగే.. ఎప్పటిలాగే దానిని అమెరికన్ల శత్రువుగా అభివర్ణించారు. అలాగే ఆ కథనం రాసిన కేటీ రోగర్స్‌కు నానాశాపనార్థాలు పెట్టారు. 28 ఏళ్ల కరోలైన్ లెవిట్ అమెరికా చరిత్రలో అత్యంత యువ ప్రెస్ సెక్రటరీ ఘనత దక్కించుకుంది. 2022లో న్యూ హాంప్‌షైర్ 1వ కాంగ్రెస్ జిల్లా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చాక ఆమెకు వైట్‌హౌజ్‌లో బాధ్యతలు అప్పగించారు. అందగత్తె మాత్రమే కాదు.. తెలివైంది కూడా అంటూ ఆయన తరచూ ఆమెపై ప్రశంసలు గుప్పిస్తుంటారు. ఈ ఏడాదిలోనే ఆమె వివాహం జరిగింది కూడా.



# జీపీఎస్ స్పూఫింగ్ ఎందుకు ప్రమాదకరం?


**న్యూఢిల్లీ:**భారతదేశంలోని ప్రధాన విమానాశ్రయాలపై సైబర్ దాడులు జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించింది. ఇది దేశ విమానయాన మౌలిక సదుపాయాల భద్రతపై ఆందోళనలను పెంచుతూ, డిజిటల్ భద్రతా లోపాలను మరోసారి హైలైట్ చేసింది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు రాజ్యసభలో ఇచ్చిన వివరణ ప్రకారం.. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, అమృత్‌సర్, హైదరాబాద్ వంటి ఏడు ప్రధాన విమానాశ్రయాల్లో జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) స్పూఫింగ్ జరిగినట్లు చెప్పారు. దాంతో జీఎన్‌ఎస్‌ఎస్ (గ్లోబల్ నావిగేషన్ సాటిలైట్ సిస్టమ్) ప్రభావితం అయినట్లు తెలిపారు. ఈ దాడుల కారణంగా నావిగేషన్ వ్యవస్థల్లో సాంకేతిక అవరోధాలు తలెత్తినప్పటికీ, విమాన కార్యకలాపాల్లో ఎలాంటి అంతరాయం జరగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈమేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.తప్పుడు సిగ్నల్స్‌ను ప్రసారం చేసి విమానాల నావిగేషన్ వ్యవస్థలను ప్రభావితం చేసే ఒక సైబర్ దాడి. ఇది వాస్తవ స్థానం, ఎత్తు వంటి ముఖ్య సమాచారాన్ని ఎఫెక్ట్ చేస్తుంది. ఇది భద్రతా ప్రమాదాలకు దారితీయవచ్చు. 2023 నవంబర్‌లో డీజీసీఏ(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) జీఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థ ప్రభావితం చెందడంపై అడ్వైజరీ జారీ చేసినప్పటికీ, ఈ తరహా ఘటనలు 2025లో కూడా కొనసాగినట్లు తెలుస్తుంది. అయితే దాడుల మూలాలను గుర్తించేందుకు ప్రభుత్వం వైర్‌లెస్ మానిటరింగ్ ఆర్గనైజేషన్ సహాయంతో పరిశోధన ప్రారంభించింది. ప్రభావిత విమానాశ్రయాలు ప్రస్తుతం హై అలర్ట్‌లో ఉన్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలు నిరంతర భద్రతా ప్రోటోకాల్స్ పాటిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.ఈ సందర్భంగా మంత్రి నాయుడు మాట్లాడుతూ..'ఈ దాడుల వల్ల విమాన కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం లేదు. అయినా ఆకస్మిక చర్యలు, మెరుగైన సైబర్ ప్రతిచర్యలు అమలు చేస్తున్నాం' అని తెలిపారు.

## అధిష్టానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారు

పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా పలు ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషయాల్లో చర్చలు జరపడానికి పార్టీ హైకమాండ్ పిలిస్తే తాము ఇద్దరం ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని.. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల డీకే శివకుమార్ సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి.. అల్పాహారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పుపై కొద్ది రోజులుగా అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. ఇందులోభాగంగానే నేడు మరోసారి డీకే నివాసంలో భేటీ అయ్యారు.కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు

## ద్వితీయ శ్రేణి నగరాల్లో పెరిగిన ఇళ్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశంలోని 15 ప్రధాన ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇళ్ల అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 4% పెరిగి రూ.37,409 కోట్లకు చేరినట్లు స్థిరాస్తి డేటా అనలిటిక్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ నివేదిక తెలిపింది.వార్షిక ప్రాతిపదికన గృహ విక్రయాల సంఖ్య (వాల్యూమ్స్ పరంగా) 4% తగ్గి 39,201 యూనిట్లకు పరిమితమైనట్లు నివేదిక పేర్కొంది. ఇక కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన హౌసింగ్ యూనిట్ల సంఖ్య(కొత్త సప్లై) 10% క్షీణించి 28,721కు దిగివచ్చింది.అహ్మదాబాద్, సూరత్, గాంధీ నగర్, వడోదర, జైపూర్, నాసిక్, నాగ్‌పూర్, మొహాలి, భువనేశ్వర్, లక్నో, భూపాల్, కొయంబత్తూర్, గోవా త్రివేండ్రం, కొచ్చి.... ఈ 15 నగరాల్లో అతిపెద్ద రియల్ ఎస్టేట్ మార్కెట్ అహ్మదాబాద్‌లో వార్షిక ప్రాతిపదికన ఇళ్ల అమ్మకాలు 6% తగ్గి 13,021 యూనిట్లకు పరిమితమయ్యాయి. సూరత్‌లో విక్రయాలు 8% క్షీణించి 4,936 యూనిట్లకు దిగివచ్చాయి. కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణ, అమ్మకాల్లో 60% గుజరాత్‌లోని ప్రధాన నగరాలైన అహ్మదాబాద్, సూరత్, గాంధీ నగర్, వడోదరల్లో నమోదయ్యాయి. భారత ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ప్రధాన శక్తి కేంద్రాలుగా టైర్-2 నగరాలు ఎదుగుతున్నాయని ప్రాప్‌ఈక్విటీ ఫౌండర్, సీఈఓ సమీర్ జసుజా తెలిపారు. ఉద్యోగ అవకాశాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాంతాల మధ్య



మెరుగుతున్న అనుసంధానం(కనెక్టివిటీ) అంశాలు రియల్ ఎస్టేట్ విభాగాల్లో డిమాండ్‌ను పెంచుతున్నాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో కొత్త గృహ ప్రాజెక్టుల లాంచింగ్ క్షీణించడమనేది మందగమనానికి సంకేతంగా కాకుండా, రియల్ ఎస్టేట్ డెవలపర్లు తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వ్యవస్థాపకుడు కీర్తి చిలుకూరి తెలిపారు.

## 13 నెలల కనిష్టానికి పారిశ్రామిక వృద్ధి

దేశ పారిశ్రామిక రంగం పనితీరు జోరు అక్టోబర్‌లో నిదానించింది. 13 నెలల కనిష్ట స్థాయిలో 0.4 శాతంగా నమోదైంది. విద్యుత్, మైనింగ్, తయారీ రంగాల్లో పనితీరు మందగించింది.పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 2024 అక్టోబర్‌లో 3.7 శాతం వృద్ధిని చూడడం గమనార్హం.ఈ ఏడాది సెప్టెంబర్ నెల పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటును గతంలో ప్రకటించిన 4 శాతం నుంచి 4.6శాతానికి సవరిస్తున్నట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) ప్రకటించింది.పారిశ్రామికోత్పత్తిలో భాగమైన తయారీరంగం అక్టోబర్‌లో 1.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2024 అక్టోబర్‌లో వృద్ధి 4.4 శాతం కంటే తక్కువ.మైనింగ్ రంగంలో ఉత్పత్తి 1.8 శాతం తగ్గింది. క్రితం ఏడాది అక్టోబర్‌లో 0.9 శాతం వృద్ధి చెందింది.విద్యుదుత్పత్తి సైతం 6.9% తగ్గింది. క్రితం ఏడా ది ఇదే నెలలో 2% వృద్ధిని చూడడం గమనార్హం.క్యాపిటల్ గూడ్స్‌లో ఉత్పత్తి 2.4 శాతం పెరిగింది. కన్జ్యూమర్ డ్యూరబుల్స్‌లో ఉత్పత్తి 0.5 శాతం తగ్గింది. క్రితం ఏడాది ఇదే నెలలో 5.5 శాతం వృద్ధి చెందడం గమనించొచ్చు.కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్స్‌లో ఉత్పత్తి 4.4 శాతం తగ్గింది. ఇన్‌ఫ్రా/కన్‌స్ట్రక్షన్ గూడ్స్‌లో 7.1 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి 2.7 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 4 శాతంగా ఉంది.



## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### టీయూడబ్ల్యూజే మహాధర్నా కరపత్రాల ఆవిష్కరణ



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (జనంసాక్షి) : జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ధర్నా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు కొత్తగా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

డిసెంబర్ 3న హైదరాబాద్ మసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరగనున్న మహా ధర్నాకు రాష్ట్ర,జాతీయ, జిల్లా, మండల నాయకులు తోడ్పడాలని,యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర లీగల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రేగుల దేవేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, జిల్లా జాయింట్ సెక్రెటరీ రాపల్లి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ దూలం సంపత్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మ్యాన శ్రీనివాస్, ఉల్లెందుల మల్లేశం, సయ్యద్ పాష, జర్నలిస్టులు గడిల ప్రవీణ్ కుమార్, ఏం.ఏ కలీం పాషా, గంప మహేష్, తోట అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 5న పెద్దపల్లి మెగా జాబ్ మేళా

- 15 కంపెనీలు - డిగ్రీ నుంచి ఐటిఐ వరకు అర్హులకు అవకాశం
- పంచాయతీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు
- పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పరిశీలించిన కలెక్టర్
- పెండింగ్ భూ సేకరణ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం
- శ్రీపాద ఎస్డీఆర్, జాతీయ రహదారి పనులు వేగవంతం




పెద్దపల్లి,నవంబర్ 30 (జనంసాక్షి) : నిరుద్యోగ యువతకు మరో బంగారు అవకాశం. జిల్లాలో డిసెంబర్ 5న సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో టాస్క్ రీజనల్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఐటి, నాన్-ఐటి మొత్తం 15 ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి. డిగ్రీ, బీటెక్, పోస్టు గ్రాడ్యుయేషన్, ఐటిఐ, డిప్లొమా పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. కంపెనీ ప్రతినిధులు అక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించి, ఆన్‌స్పాట్ సెలక్షన్ చేస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా 3 నుంచి 4 సెట్ల రెస్యూమ్ కాపీలతో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. అదే రోజు పంచాయతీ ఎన్నికల నిర్వహణపైనా కలెక్టర్ శ్రీహర్ష కీలక సమావేశం నిర్వహించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది కేటాయింపు జరగాలని, నామినేషన్ల వివరాలను ఎప్పటికప్పుడు టి-యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి కొనుగోలు, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం, బ్యాలెట్ బాక్సుల పంపిణీ వంటి అంశాలపైనా సూచనలు జారీ చేశారు. మరో సమావేశంలో మంచిర్యాల-వరంగల్ 4 లైన్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, మంథని శ్రీపాద ఎస్డిఆర్ నిర్మాణాల కోసం పెండిరగ్‌లో భూ సేకరణ పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శ్రీపాద ఎస్డిఆర్‌కు సంబంధించి భూ సర్వే పనులు కూడా త్వరగా ముగించాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పరిశ్రమల హబ్‌గా తెలంగాణ

- రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి
- పెట్టుబడులు రావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మహేశ్వరం,డిసెంబర్2(జనంసాక్షి): పరిశ్రమల హబ్‌గా తెలంగాణ రాష్ట్రం మారుతుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ పనులపై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మహేశ్వరం మండలం కేసితండాలో జేఎస్ డబ్లూ డిఫెన్స్ డ్రోన్ల తయారీ కంపెనీకి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ...రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. పెట్టుబడులు రావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. డ్రోన్ల తయారీలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ విజన్ కు అనుగుణంగా చేపడుతున్నామన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సుమారు8 వేల కోట్ల రూపాయలతో దావోస్ లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కుదిరిన ఒప్పందం ప్రకారం జేఎస్ డబ్లూకు భూమిని కేటాయించామన్నారు. జేఎస్ డబ్లూ జాతీయ భద్రతను బలోపేతం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి,జేఎస్ డబ్లూ కంపెనీ ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను సన్మానించిన టీఎన్జీవో నాయకులు

కరీంనగర్, డిసెంబర్ 02 (జనంసాక్షి) : ప్రజాసేవ, పరిపాలన, వినూత్న కార్యక్రమాల రూపకల్పనలో చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కి ప్రతిష్ఠాత్మక భారత్ గౌరవ్ అవార్డు ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా టీఎన్జీవో సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... పేదలు, అనాథలు, బలహీన వర్గాల కోసం కృషి చేస్తున్నాం జిల్లా కలెక్టర్ కు ఈ అవార్డు రావడం సంతోషకరమైన విషయమన్నారు. కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనాథ బాలికకు వివాహం నిర్వహించడం మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచిందన్నారు.

'శుక్రవారం సభ' పేరిట ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం మహిళల అభ్యున్నతికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందనే భావనతో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళలందరికీ 50 వేల ఖరీదైన ఉచిత వైద్య పరీక్షలు చేయించడం గొప్ప విషయమని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నూతన ప్రోత్సాహం ఇస్తూ, మళ్లీ బడిబాట పట్టించే ప్రత్యేక మార్గదర్శక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. పనిచేసే ప్రాంతపు భాష, సంస్కృతులను స్వయంగా నేర్చుకుంటూ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించిన అరుదైన అధికారిణి పమేలా సత్పతి గారేనని అన్నారు. బధిర విద్యార్థుల అవసరాలను అర్థం చేసుకోవడానికి స్వయంగా సైన్ లాంగ్వేజ్ నేర్చుకుని దివ్యాంగుల కోసం విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షకార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంఘం లక్ష్మణరావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగి శ్రీనివాస్, కార్యదర్శి సర్దార్ ఆర్మీందర్ సింగ్, తిరుమల, శారద, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కార్యదర్శులు కోట రామస్వామి, శంకర్, లవ్ కుమార్, కమలాకర్, కరుణాకర్ పాల్గొన్నారు.

### 'కోట పబ్లిక్ స్కూల్ విద్యార్థి జోయల్‌కు'

## జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి

- 'నీటి సంరక్షణ - నది శుద్ధీకరణ' ప్రాజెక్టుతో రాష్ట్రస్థాయికి ఎంపిక.
- అభినందించిన కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి.అంజిరెడ్డి



కరీంనగర్, డిసెంబర్ 02 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో కోట పబ్లిక్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి కొమ్ము జోయల్ ప్రథమ బహుమతి దక్కించుకున్నాడు. "నీటి సంరక్షణ, నిర్వహణ (నది శుద్ధీకరణ)" అంశం పై జోయల్ రూపొందించిన ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకొని అందరి ప్రశంసలు పొందిన్నారు. ఈ విజయంతో అతడు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా కోట రెసొనెన్స్ జూనియర్ కళాశాలలు, కోట పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి జోయెల్‌ను ప్రత్యేకంగా మంగళవారం జరిగిన ఒక కార్యక్రమం లో అభినందించారు. ఈ సందర్భంగా కోట విద్యా సంస్థల అధినేత డాక్టర్ డి. అంజిరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు విద్యాసంస్థల్లో తమ వంతు కృషి కొనసాగుతుందని ఆయన తెలిపారు. జోయల్ సాధించిన ఈ విజయంతో పాఠశాల పేరు మరింత ఎత్తుకు వెళ్లిందని పేర్కొన్నారు.

జనజీవనానికి అత్యంత కీలకమైన నీటి సంరక్షణపై అవగాహన పెంచే విధంగా జోయల్ చేసిన ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. నదుల కాలుష్యానికి కారణాలు, శుద్ధీకరణ పద్ధతులు, ప్రజల్లో అవగాహన అవసరం వంటి అంశాలను తన నమూనాలో ప్రతిబింబించాడు. రాష్ట్రస్థాయిలో కూడా ఇదే ప్రతిభను కనబరుస్తాడన్న నమ్మకం ఉందన్నారు. కరీంనగర్ లోని కోట పబ్లిక్ స్కూల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



## నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

కో ట్ పల్లి డిసెంబర్ 2( జనం సాక్షి): సర్పంచ్ ఎన్నికల మూడు రోజుల నామినేషన్ల చివరి రోజు అయిన ఈరోజు శ్రీసుధీర్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జిల్లా పరిషత్ సీఈవో కోటేపల్లి మండలానికి విజిట్ చేసి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. కోటేపల్లి క్లస్టర్ నామినేషన్ సెంటర్‌ను సందర్శించి, హెల్ప్ డెస్క్‌లో అభ్యర్థులకు నామినేషన్లు దాఖ్లు చేయ డంలో పంచాయతీ సెక్రటరీలు ఎలా సహాయం చేస్తున్నారో తెలుసుకున్నారు. రిటర్నింగ్ అఫీసర్ల తో మాట్లాడి వారి పనిని పరిశీలించారు. తర్వాత మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చి ఎన్నికల నామినేషన్ల గురించి రివ్యూ నిర్వహిం చి, కొన్ని సూచనలు మరియు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు.





## శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో బిల్డర్ల నయా ట్రెండ్

### వేర్వేరుగా అనుమతులు... ఒక్కటిగా నిర్మాణం

- అధికారుల చేయూతతో పెట్రేగుతున్న అక్రమార్కులు!?
- జిహెచ్ఎంసి ఖజానా పుట్టి ముంచుతున్న వైనం

శేరిలింగంపల్లి, నవంబర్ 30 (జనంసాక్షి) : జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో కొత్త తరహా మోసం పురుడు పోసుకుంది. చాప కింద నీరులా... ఎవరికి అర్థం కాని విధంగా... అంతుబట్టని మహమ్మారిలా చడీచప్పుడు లేకుండా సాఫీగా సాగిపోతూ కోట్లాది రూపాయల జిహెచ్ఎంసి ఖజానాకు చిల్లులు పెడుతూ అక్రమార్కుల జేబుల్ని నింపేస్తోంది. కంచ చేనుమేసిన చందంగా ఇందులో పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల క్రియాశీల పాత్రను, ప్రభుత్వానికి దక్కాల్సిన సొమ్మును కొల్లగొడుతున్న తీరుకు ఒక విధంగా అభినందనలు తెలపాల్సిందే అంటే అతిశయోక్తి కాదు! ప్రభుత్వం ఎన్ని రకాలుగా ప్రజాధనాన్ని సద్వినియోగపరుస్తూ ప్రజాసంక్షేమ కార్యక్రమాల వైపు సదరు సొమ్మును మళ్లించాలని చూస్తున్నా... గోతికాడి నక్కలను తలపించే లా అక్రమార్కుల కుట్రలు, కుయుక్తులకు కొంతమంది తిన్నంటి వాసాలు లెక్కపెడుతున్న అధికారులు తోడ్పాటునందిస్తుండడంతో గుట్టుచప్పుడు కాకుండా అడ్డదారుల్లో విలువైన సొమ్ము దారి మళ్ళీ పోతోంది!!

**వేర్వేరుగా అనుమతులు ఒక్కటిగా నిర్మాణం...**

ఎలా వస్తాయో తెలియదు... ఎవరు చెప్తారో తెలియదు... వింటేనే ఒళ్ళు గగుర్పొడిచేలా కొందరి ఆలోచనలు గమనిస్తుంటే రోమాలు నిక్కబడుచుకోవడం, ఒళ్ళు గగుర్పొచడం జరుగుతుంది. సరిగ్గా ఇలాంటి ఘటనలే, ఈ పరిస్థితులే ప్రస్తుతం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో రాజ్యమేలుతూ నయా ట్రెండును సృష్టిస్తుండడం విస్మయానికి గురిచేస్తుంది. నిబంధనలలోని లోసుగులను వెలికితీసి వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న కొంతమంది అక్రమార్కులు 'తిలా'పాపం తలాపిడికెడు అన్న చందంగా తమకు వచ్చిన ఆలోచనను తమతో అంటగాగే అధికారులతో కలిసి అనుకూలంగా మార్చుకుంటూ భారీగా ప్రభుత్వ ఖజానాకి గండి కొడుతూ అక్రమంగా వచ్చిన సొమ్ములను వాటాలుగా పంచుకుంటు ఒడడం శేరిలింగంపల్లిలో కొనసాగుతున్న నయాతరహా మోసానికి నిలువెత్తు నిదర్శనం. ఓ 300 గజాలు ఉన్న స్థలానికి అనుమతులను తీసుకొని బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాలంటే ముందుగా అనుమతులు, ఆ తర్వాత భవన నిర్మాణ శైలిని బట్టి వివిధ స్లాబులలో రుసుములు, ఆనక సదరు భవనాన్ని మార్టిగేజి చేసి అనుకున్న విధంగా కస్టమర్లకు సౌకర్యాలు, నాణ్యతయుతమైన సదుపాయాలను అందజేసి వారి సంతృప్తి మేరకు చివరలో మార్టిగేజ్ ని జిహెచ్ఎంసి నుండి రిలీజ్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఉన్న చిన్న లూపును ఆసరాగా చేసుకుంటున్న అక్రమార్కులు సదరు 300 గజాల స్థలాన్ని రెండు భాగాలుగా లేదా 150 గజాల చొప్పున వేర్వేరుగా అనుమతులను తీసుకొంటే అనుమతులకు చెల్లించాల్సిన ఫీజు భారీగా తగ్గుతుంది, వ్యక్తిగత ఇంటి నిర్మాణం రూపంలో జిహెచ్ఎంసి కి మార్టిగేజ్ చేయకుండా అవకాశం లభిస్తుంది. దీనిని అడ్డుపెట్టుకొని రెండు స్థానాలకు సంబంధించి నిర్మాణాన్ని ఒకేసారి చేపట్టడంతోపాటు దానిని కలిపి కట్టడం ద్వారా బిల్డర్ అనుకున్న లక్ష్యాన్ని అడ్డదారిలో పూర్తి చేసుకోవడానికి, ప్రభుత్వ ఖజానాకి గండికొట్టి అడ్డగోలుగా వెనుకేసుకోవడానికి వారికి ఇది వరంలా దోహదపడుతుంది.

**అధికారుల అండదండలు... పెట్రేగుతున్న అక్రమార్కులు**

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అక్రమ పద్ధతిలో జిహెచ్ఎంసి ఖజానాకు గండి కొడుతున్న వైనం 'ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు...' అనే సామెతను తలపిస్తుంది. సర్కిల్ పరిధిలోని శేరిలింగంపల్లి డివిజన్ పరిధి జెవి కాలనీలో ఈ తరహా నాయా ట్రెండ్ ఆకాశమే హద్దుగా సాగుతోందని పలువురు జెవి కాలనీకి చెందిన నివాసితులు పేర్కొంటున్నారు. పెద్ద స్థలాన్ని చిన్నదిగా మార్చి వేరువేరు అనుమతుల ద్వారా ప్రభుత్వానికి అందాల్సిన ప్రయోజనాలను తగ్గించి వాటిని పరోక్షంగా తమకు సహకరిస్తున్న అధికారులకు, సొంత జేబులకు మళ్లించుకుంటుండడం విస్తు గొలుపే అంశం. జెవి కాలనీతోపాటు నల్లగండ్ల, ప్రశాంతి హిల్స్, స్ప్రింగ్ వ్యాలీ ప్రాంతాలలో సైతం ఇదే తరహాలో అక్రమార్కులు జిహెచ్ఎంసి ఖజానాకు గండికోడుతూ కోట్లకు పడగెత్తుతున్నారనేది నిర్వివాదాంశం. శేరిలింగంపల్లి ప్రాంతంలో ఉపాధి రంగం, ఐటీ రంగం, ఉద్యోగాలు విరివిగా లభిస్తూ నగరంలోనే మెరుగైన ఆవాస ప్రాంతంగా విరాజిల్లుతున్న సందర్భాన్ని అవకాశంగా మలుచుకుంటున్న అక్రమార్కులు జిహెచ్ఎంసి పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో చేతులు కలిపి కొత్త పద్ధతిలో అక్రమాలకు తెరతీస్తూ జిహెచ్ఎంసి ఖజానా పుట్టి ముంచుతున్నారని పలు స్వచ్ఛంద సంస్థలు దుమ్మెత్తి పోస్తున్నాయి. శేరిలింగంపల్లి సర్కిల్ లో జరుగుతున్న తతంగాన్ని చూస్తున్న చందానగర్, పరిసర సర్కిళ్ల బిల్డర్లు సైతం అధికారులతో మిలాఖతై ఇదే ఒరవడిని కొనసాగించ డానికి ఎవరి స్థాయిలో వారు పావులను కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ దాష్టీకాలను నిశితంగా తనిఖీ చేసి జిహెచ్ఎంసి ఖజానాను, తద్వారా ప్రభుత్వ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి సీనియర్ జూడో ఛాంపియన్ షిప్

### పారమిత పాఠశాలల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు.



కరీంనగర్, డిసెంబర్ 02 (జనంసాక్షి) : పోటీలలో పారమిత విద్యార్థి ప్రతిభ నవంబర్ 29 నుండి 30 వరకు హైద్రాబాద్ జిల్లాలో తెలంగాణ జూడో అసోసియేషన్ ఆద్వర్యంలో జరిగిన 10 వ సీనియర్స్ రాష్ట్ర స్థాయి జూడో ఛాంపియన్ షిప్ పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎ. అభినవ్ సాయి 73 కె.జి కేటగిరి విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పథకం సాధించాడని పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరావు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎ. అభినవ్ సాయి ని పాఠశాల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వి.యు.యం.ప్రసాద్, వినోద్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ హన్మంత రావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్త రబీంద్ర పాత్రో, వ్యాయామ ఉపాధ్యాయులు గోలి సుధాకర్, సరిగొమ్ముల రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు అంతరాయం

### బాహుబలి యత్రం వెన్నకి..



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (జనంసాక్షి) : వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనులకు సాంకేతిక కారణాలతో అంతరాయం ఏర్పడింది. రాజన్న ఆలయాన్ని రూ150 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ఇటీవల పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా 30 అడుగుల లోతు వరకు రంధ్రాలు తవ్వి అప్పటికప్పుడే కాంక్రీట్తో పైల్ పిల్లర్లు నిర్మించేందుకు చెన్నై నుంచి (బాహుబలి) భారీ హైడ్రాలిక్ యంత్రాన్ని రప్పించి పనులు ప్రారంభించారు. ఆలయ దక్షిణ ప్రాకారం విస్తరణ పనుల కోసం రోడ్డుపై హైడ్రాలిక్ యంత్రం తో పైల్స్ పిల్లర్ల నిర్మాణానికి యత్నించే క్రమంలో భూమికి కొద్ది అడుగుల లోతులోనే రాళ్లు అడ్డుగా రావడం, ఇంకొన్ని చోట్ల భూమి లోపలి భాగం బలంగా లేకపోవడం,కొన్నిచోట్ల 30 అడుగుల కన్నా ఎక్కువ లోతుకు వెళ్లాల్సి రావడంతో పైల్ నిర్మాణం సాధ్యం కాదని సిబ్బంది స్పష్టం చేసినట్లు సమా చారం. హైదరాబాద్ నుంచి సాయిల్ మెకానిక్, ఇతర నిపుణులను రప్పించి పరిశీలించగా భూమి లోపల భాగంలో ఉన్న తేడాల వల్ల హైడ్రాలిక్ యంత్రంతో కాకుండా ఓపెన్ విధానంలో తవ్వి,ఫుటింగ్ వేసి పిల్లర్లు నిర్మించాలని నిర్ణయిం చినట్టు తెలిసింది. హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు ఇన్చార్జి కలెక్టర్,వీటీడీఏ వైస్ చైర్మన్ గరిమా అగర్వాల్ ను కలిసి సాంకేతికపరమైన ఇబ్బందులను వివరించినట్లు తెలిసింది. దీంతో పనులను తాత్కాలికంగా నిలిపివేసి హైడ్రాలిక్ యంత్రాన్ని వెనక్కి పంపించారు. ఓపెన్ విధానం ద్వారా తవ్వి పనులు ప్రారంభించనున్నారు.

## మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక వైద్య కేంద్రం

- కార్మికులు, సిబ్బందికి రూ.30 లక్షల జీవిత బీమా
- పిపీఈ కిట్ల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పమేలా సత్పతి





కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 02(జనంసాక్షి): మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా వారి కోసం ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేసి సేవలు అందిస్తామని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. వారధి సొసైటీ సహకారంతో మున్సిపల్ కార్మికులకు పిపిఈ కిట్ల పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులు విధిగా పిపిఈ కిట్లను ధరించాలని, ఆరోగ్య జాగ్రత్తలను తప్పక పాటించాలని సూచించారు. ఇప్పటికే మునిసిపల్, పంచాయతీ కార్మికులకు జిల్లా యంత్రాంగం తరపున ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తున్నామన్నారు. ప్రస్తుతం కార్మికులతో సహా జవాన్లు ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ వర్కర్లు ఎలక్ట్రిసిటీ కార్మికులతో సహా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న సిబ్బందికి రూ.30 లక్షల ప్రమాద బీమా చేయించామని వివరించారు. కార్మికుల శ్రేయస్సు కోసం ప్రత్యేక వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కేంద్రంలో వైద్యుడు సహా మందులు అందుబాటులో ఉంటాయని, కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఈ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమం కోసం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. కార్మికులు వారి కేవైసీ వివరాలు సమర్పించాలని సూచించారు. కార్మికుల కోసం ప్రతి నెలా ఈఎస్ఐ చెల్లిస్తున్నామని, అనారోగ్య రీత్యా సెలవులు అవసరమైన వారు ఈఎస్ఐ ద్వారా జీతాలు పొందవచ్చని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రతి కార్మికునికి బీమా, వైద్య సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అనారోగ్యంతో ఉన్న కార్మికులు మెడికల్ ఇన్ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్మికుల ఏ సమస్య అయినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహినుద్దీన్, వేణుమాధవ్, మెడికల్ ఆఫీసర్ సుమన్, వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆరాచక రాజకీయాలు మానుకోవాలి

### స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో లేనిపోని ఆరోపణలు : మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి



తాండూరు డిసెంబర్ 2(జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ ఆరాచక రాజకీయాలు మానుకో వాలని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆరోపిం చారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌడీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు .సామాన్యులపై అరాచకాలు చేయొద్దని పేర్కొ న్నారు. బిఆర్ఎస్ పార్టీ బలమేందో సర్పంచ్ ఎన్నికల్లో చూపిస్తామని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భయభ్రాంతు లకు గురిచేసి బలవంతంగా కాంగ్రెస్ పార్టీ కండువాలను వేస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పైలెట్ చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గంలో వేడెక్కిస్తున్నాయి. కాంగ్రెస్ నాయకులు తమ దౌర్జన్యం, రౌడీ రాజకీయాలను మానుకోవాలని, లేదంటే బీఆర్ ఎస్ బలం ఏంటో చూపిస్తామని తమ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేసి, బెదిరించి బలవంతంగా కాంగ్రెస్ కండు వాలు కప్పుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. పార్టీ అభ్యర్థులను కిడ్నాప్ చేసి, వారిపై దాడులు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులపై రోహిత్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, నాయకులు సాయిపూర్ నరసింహులు,శ్రీనివాస్ యాదవ్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇయ్యాలే నామినేషన్ల ఉపసంహరణ

- అన్నా జర తప్పుకో రాదే
- అన్ని గ్రామ పంచాయతీలో ద్విముఖ పోటీ
- కొన్నిచోట్ల ఏకగ్రీవం అయ్యే అవకాశం
- కాంగ్రెస్ పార్టీ తరపున పోటాపోటీ నామినేషన్లు

**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 2 (జనం సాక్షి):** అన్నా ఇయ్యాలనే నామినేషన్ల ఉపసంహరణ.. జర తప్పుకో రాదే. ఇవి చేతులు కావు కాళ్లు అనుకో ఒక్క ఛాన్స్ ఇవ్వవే అంటూ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యర్థి అభ్యర్థిని వేడుకుంటున్నారు. వికారాబాద్ జిల్లా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా తాండూర్ బషీరాబాద్ యాలాల పెద్దేముల్ కొడంగల్ దౌల్తాబాద్ బొమ్మరాస్పేట్ దుద్యాల మండలాలలోని 262 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవి కోసం తీవ్ర పోటీ ఉంది. 1043 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవి కోసం పోటీ పడడానికి నామినేషన్లు వేశారు. 2198 గ్రామపంచాయతీ వార్డు పదవి కోసం3943 మంది నామినేషన్లు వేశారు. బుధవారం నాడు నామినేషన్ల పరిశీలన ఉంది. ప్రత్యర్థులను ఎన్నికల పోటీ నుంచి తప్పించడానికి సర్పంచ్ వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థులు నానా తంట పడుతున్నారు. అవసరం ఉన్నచోట నజరానా ప్రకటించి. కొన్నిచోట్ల తనదైన శైలిలో వేడుకొని మరికొన్ని చోట్ల పార్టీ పెద్దల అంగీకారంతో ప్రత్యర్థి అభ్యర్థిని ఎన్నికల్లో పోటీ చేయకుండా నామినేషన్ ఉపసంహరించే ప్రయత్నాన్ని వేగవంతం చేశారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో రెబెల్ అభ్యర్థుల బెడద అధికంగా ఉంది. అన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ముగ్గురు వేసి చొప్పున నామినేషన్లు వేశారు. సర్పంచ్ వార్డ్ పదవుల కోసం అధిక గ్రామపంచాయతీలో ఇద్దరేసి చొప్పున నామినేషన్లు వేశారు. టిఆర్ఎస్ పార్టీ కి చెందిన అభ్యర్థులు ఒక్కరేసి చొప్పున నామినేషన్లు వేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికంగా సర్పంచ్ పదవుల కోసం పోటీపడుతుండడంతో పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారింది. ఎవ్వరికీ సర్ది చెప్పక బుజ్జగించక ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది న వారికి ప్రాధాన్యత ఉంటుందని సాంకేతాలు పంపడంతో ప్రధానంగా కాంగ్రెస్ నాయకుల మధ్య సర్పంచ్ పదవి కోసం గట్టి పోటీ ఉంది. కానీ తమ వంతు ప్రయత్నంగా టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల ప్రత్యర్థి అభ్యర్థులను బ్రతిమిలాడుకొని కొన్ని ప్రలోభాలు చూపి నామినేషన్ ఉపసంహరించే ప్రయత్నం జోరుగా సాగుతుంది. కానీ ఎక్కువ చోట అన్ని పార్టీలకు చెందిన నాయకులు నీవే నామినేషన్ ఉపసంహరించుకో అంటే నీవే ఉపసంహరించుకో అంటూ పట్టింపులకు వచ్చారు. ఇదిలా ఉంటే కొన్ని గ్రామపంచాయతీలో నజరానా లేదా గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు కొందరు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉంది. దీంతో కొన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యే ఛాన్స్ ఉంది. ఇంత బాహాటంగా గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అవుతుంటే ఎన్నికల పరిశీలకుల జాడ కనిపించడం లేదు. ఎన్నికల్లో దుబారా ఖర్చు నివారణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా స్థాయిలో ఎన్నికల పరిశీలకులను నియమించి ఎన్నికల నిర్వహణ నిఘా వేసింది. సర్పంచ్ అభ్యర్థులు 1.50 నుంచి 2.50 లక్షల వరకు ఖర్చు చేయవలసి ఉంటుంది. కానీ నామినేషన్ల రోజే ప్రచారం జోరందుకుంది. ఇక ఎన్నికల్లో ఖర్చు ఒక లెక్క.. ఇప్పటికైనా అధికారులు ఎన్నికల్లో దుబారా ఖర్చు పై నిఘా వేస్తారని ఆశిద్దాం...

# పురపాలికల్లో ఆదాయ వృద్ధికి ఇంటింటి సర్వే

- పన్ను భారం లేకుండా రూ.900 కోట్ల లక్ష్యం
- చీర్యాల వార్డులో రూ.2 కోట్ల అదనపు ఆదాయం
- ప్రైవేట్ ఏజెన్సీలతో ఆరు మున్సిపాలిటీల్లో కసరత్తు



**మేడ్చల్-మల్కాజిగిరి, డిసెంబర్ 2 (జనం సాక్షి):** హైదరాబాద్ శివారు పురపాలికల్లో సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కోసం ఆదాయాన్ని పెంచేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా ప్రత్యేక వ్యూహంతో ముందడుగు వేస్తున్నారు. ప్రజలపై అదనపు పన్ను భారం వేయకుండా, మిస్సింగ్ ఇంటి నంబర్లు, కమర్షియల్ అసెస్‌మెంట్, ట్రేడ్ లైసెన్స్, ఖాళీ స్థలాల పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని చీర్యాల వార్డులో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన సర్వేతో గతంలో రూ.1.03 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.3.03 కోట్లకు చేరింది. ఈ విజయంతో ఉత్సాహించిన అధికారులు, జిల్లాలోని మరో ఆరు మున్సిపాలిటీల్లో ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వే చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గతంలో పురపాలక సంఘాల్లో ఉద్యోగులు నిర్వహించిన భవన సర్వేలు నిర్లక్ష్యంగా జరగడం, అధికారుల అలసత్వం, కొందరి అవినీతి ఆరోపణలతో ఆదాయ లక్ష్యాలు నీరుగారాయి. ఈ నేపథ్యంలో రాధికా గుప్తా చొరవతో పుర కమిషనర్లతో సమీక్షలు నిర్వహించి, ప్రైవేట్ ఏజెన్సీల సహాయంతో సమర్థవంతమైన సర్వేకు ప్రణాళిక రూపొందించారు. చీర్యాల వార్డులో అక్టోబర్, నవంబర్ నెలల్లో 45 రోజుల పాటు జరిగిన సర్వేలో 1389 గృహాల్లో 100 గృహాలను కమర్షియల్ భవనాలుగా గుర్తించారు. అదనపు అంతస్తులు, గదుల నిర్మాణాలు, రెసిడెన్షియల్ ఏరియాల్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న హాస్టళ్లు, విద్యాసంస్థలు, దుకాణాలపై కమర్షియల్ పన్ను విధించారు. ఇంటి నంబర్లు తీసుకోని కొత్త గృహాలను కూడా గుర్తించి పన్ను విధింపు చేశారు. దీంతో ఒక్క చీర్యాల వార్డులోనే రూ.2 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది.

ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని, డిసెంబర్ నుంచి జనవరి వరకు నిజాంపేట, కొంపెల్లి, గుండ్లపోచంపల్లి, దుండిగల్, పోచారం, దమ్మాయిగూడలోని మిగిలిన 17 వార్డుల్లో ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వే చేపట్టేందుకు రాధికా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నిజాంపేటలో రూ.78.08 కోట్లు, పోచారంలో రూ.27.71 కోట్లు, కొంపెల్లిలో రూ.17.99 కోట్లు, గుండ్లపోచంపల్లిలో రూ.21.35 కోట్లు, దుండిగల్‌లో రూ.40.99 కోట్లు, దమ్మాయిగూడలో రూ.23.27 కోట్ల ఆదాయం సమకూరుతోంది. సర్వే పూర్తయితే ఈ ఆదాయం రెట్టింపు కాగలదని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలోని 16 పురపాలక సంఘాల్లో ఈ విధానం విజయవంతమైతే, ప్రస్తుతం ఏటా రూ.403 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.900 కోట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్లు, కొత్త కాలనీల్లో వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఆస్పత్రులు, పరిశ్రమలు విస్తరిస్తున్నప్పటికీ, ట్రేడ్ లైసెన్స్ జారీలో లోపాలు, పన్ను మదింపులో తేడాలు కనిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని గృహాలపై 100 శాతం జరిమానాతో పాటు సవరణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ఆదాయం కోల్పోతున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రైవేట్ ఏజెన్సీల సహాయంతో సర్వేలు నిర్వహించడం ద్వారా పారదర్శకత, సమర్థతను పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, తూముకుంట, గుండ్లపోచంపల్లి, అలియాబాద్, ఎల్లంపేట, ఎంసీపల్లి, కొంపెల్లి, దుండిగల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మినహా మిగిలినవి జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి. అయితే, విలీన ఉత్తర్వులు రాకముందే 13 పురపాలక సంఘాల్లో సర్వేలు పూర్తి చేసి, ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# నవాబుపేట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- ఎన్నికల సంధార్బంగా పోలీస్ అధికారులు వివిధ శాఖలతో కలసి సమన్వయంతో పనిచేయాలి : వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**నవాబుపేట్, డిసెంబర్ 2 ( జనం సాక్షి) :** నవాబుపేట్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను వికారాబాద్ జిల్లా ఎస్పీ నూతనంగా వికారాబాద్ కు బదిలీ అయిన సందర్భంగా నవాబుపేట్ పోలీస్ పోలీస్ స్టేషన్ను సందర్శించి మోమిన్ పెట్ సీఐ వెంకట్,ఎస్సై పుండ్లిక్ తో సమావేశమై స్టేషన్ సమస్యలు తెలుసుకుని రికార్డులను పరిశీలించిన వికారాబాద్ జిల్లా ఎస్పీజరగనున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ల ఆవరణలను, స్టేషన్‌లోని రికార్డులను, రిసెప్షన్ వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ల నిర్వహణ మరియు సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఎక్ మామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధికారులను మరియు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలని ఎస్సైని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా తమకు కేటాయించిన పోలింగ్ లొకేషన్ల యొక్క భౌగోళిక పరిస్థితులు, గత ఎన్నికల చరిత్ర, అక్కడ ఉన్న సున్నితమైన అంశాల గురించి ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, టీమ్ వర్క్ తో పని చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలి

- పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుంది.
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**పెద్దేముల్ డిసెంబర్ 2(జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం మంబాపూర్ మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్ తన అనుచరులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ విడి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి సాయిని మహాదేవమ్మ మద్దతుగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ ఎస్ పార్టీకి సంబంధించిన తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారుకాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న సాయిని మహాదేవమ్మ ను అధిక మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# గ్రామీణ మహిళలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ

**32 జిల్లాల నుంచి 180 మంది మహిళలు హాజరు**

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ పై శిక్షణ అందించారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ లో నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు ఈ శిక్షణ ఇచ్చారు. దీనికి తెలంగాణ ప్రభుత్వంలోని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఈఆర్పీ) సహకారం అందించింది. ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ రెండో బ్యాచ్కు రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి ఎంపికైన 180 మంది మహిళలకు శిక్షణ అందించారు. ఈ రంగంలో రెండు దశాబ్దాలుగా విజయవంతంగా వ్యాపారాలు నడుపుతున్న టీసీఈఐకు చెందిన నిపుణులు ఈ శిక్షణను నిర్వహించారు. మహిళా అభ్యర్థులకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ లోని ఆరు విభిన్న విభాగాలలో శిక్షణ ఇచ్చారు. అవి.. డెకరేషన్ టెక్నిక్స్, తాజా ట్రెండ్స్, సౌండ్, లైట్ మేనేజ్‌మెంట్, ఈవెంట్ ప్రొడక్షన్, కేటరింగ్, ఫుడ్ సర్వీసెస్, మేకప్, గ్రూమింగ్, ఫొటో, వీడియోగ్రఫీలో శిక్షణ అందించారు. క్లాస్‌రూమ్ శిక్షణతో పాటు ప్రత్యక్ష ఈవెంట్లను సందర్శించే ఫీల్డ్ విజిట్స్ కూడా ఏర్పాటు చేశారు. ఈవెంట్ నిర్వహణలో మహిళలకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ 450 పైగా సభ్యులను కలిగి ఉంది. సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై ఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ శిక్షణ పొందిన మహిళా ఈవెంట్ మేనేజర్లను వారి వారి జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.




ఎస్ఈఆర్పీ సీఈఓ డీ దివ్య వర్చువల్‌గా మాట్లాడారు. వారి శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్ఐటీహెచ్ఎం డైరెక్టర్ డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ఇలాంటి మహిళా సాధికారత కార్యక్రమాల్లో భాగం కావడం ఆనందంగా ఉందన్నారు. టీసీఈఐ జనరల్ సెక్రటరీ రవి బూరా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా ఈవెంట్ మేనేజ్‌మెంట్ పారిశ్రామికవేత్తలను శిక్షణ ఇవ్వడానికి ఎస్ఈఆర్పీ, ఎన్ఐటీహెచ్ఎం ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీసీఈఐ అధ్యక్షుడు ఏ బలరాం, ఎస్ఈఆర్పీ (నాన్-ఫార్మ్) డైరెక్టర్ పీ డబ్ల్యు జాన్సన్, ఎస్ఈఆర్పీ సమత, ఎన్ఐటీహెచ్ఎం ట్రైనింగ్ కోఆర్డినేటర్ మిషెల్ ఫ్రాన్సిస్, టీసీఈఐ ఈసీ సభ్యురాలు సంజు దీటి, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ హెడ్ అజయ్ చంద్ర, ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఉదయకుమార్ పాల్గొన్నారు.

# మేడ్చల్ కాంగ్రెస్‌కు నూతన ఊపు

**జిల్లా అధ్యక్షుడిగా వజ్రేష్ యాదవ్ బాధ్యతల స్వీకారం**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (జనం సాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయాలని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచిస్తూ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్‌కు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేందుకు ఇప్పటి నుండే గ్రామ, వార్డు, బూత్ స్థాయిలో క్రమబద్ధమైన బృందాలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించిన మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యతను కార్యకర్తలు నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు, అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేసి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని అత్యంత బలమైన శక్తిగా తీర్చిదిద్దుతానని తెలిపారు, ఈ సందర్భంగా సోనియా గాంధీ, మల్లికార్జున ఖార్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబులకు ధన్యవాదాలు తెలిపారు, కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారీగా నిధుల ప్రవాహం.. ఇక పనుల జాతరే

- ఉప్పల్ డివిజన్‌కు రూ.3.11 కోట్ల నిధుల మంజారు
- సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి




**ఉప్పల్ డిసెంబర్ 02 ( జనం సాక్షి ):** ఉప్పల్ డివిజన్‌కు మరోసారి భారీగా నిధులు మంజూరు అయ్యాయి. డివిజన్‌లోని పలు కాలనీలలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు కూడా జారీ చేశారు. రూ.3.11 కోట్ల నిధులు ఒక ప్రవాహం వలె వచ్చాయి అని . ఇక డివిజన్‌లో అభివృద్ధి పనుల జాతరే జరుగనుంది. ఉప్పల్ కార్పొరేటర్ అన్నారు. డివిజన్‌కు భారీగా నిధులు మంజూరు కావడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి. ఉప్పల్ నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఈ నిధుల మంజూరుకు కావాల్సిన సహకారం అందించారు. కాలనీలలో సమస్యల పరిష్కారానికి కావాల్సిన నిధులను రాబట్టడంలో ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రయత్నం చాలా గొప్పది. వీరందరి కృషి ఫలితంగానే ఉప్పల్ డివిజన్‌లోని అన్ని కాలనీలలో కావాల్సిన అభివృద్ధి పనులకు మరోసారి భారీగా నిధులు మంజూరు అయ్యాయి. అని సంతోషం వ్యక్తం చేశారు. అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు రజితా పరమేశ్వర్‌రెడ్డి ఉప్పల్ డివిజన్‌లోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులను చేపడుతూ సమస్యలను పరిష్కరిస్తున్నట్టుగా కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వివిధ కాలనీలలో అభివృద్ధి పనుల నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను రజితాపరమేశ్వర్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి కాలనీ వాసులకు అందచేశారు.

## నిమ్స్‌కు డా.ఎం.ఎ.పాటిల్ వీల్‌చైర్ల వితరణ

**తన తండ్రి అప్పారావు పాటిల్ జ్ఞాపకార్థంగా అందజేత**

**ఖైరతాబాద్ :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని మైక్రోబ యాలజీ విభాగానికి చెందిన డా.ఎం.ఎ.పాటిల్, తన తండ్రి లేట్ అప్పారావు పాటిల్ జ్ఞాపకార్థంగా ఆసుపత్రికి వీల్ చైర్లు విరాళంగా ఇచ్చారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొ.నగరి బీరప్ప డా.పాటిల్ దాతృత్వాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు రోగుల సౌకర్యాలను మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, ఆర్.ఎం.ఓ డా.సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# పోటీలో ఉందామా.. తప్పుకుందమ్మా..?




- గ్రామాల్లో కొనసాగుతున్న బుజ్జగింపుల పర్వం
- డైలామాలో అభ్యర్థులు


**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (జనంసాక్షి) :** సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ బుధవారం చివరి అంకానికి చేరుకోనుంది. నామినేషన్ ఉపసంహరణ ఉండటంతో బుజ్జగింపుల పర్వానికి 'లక్ష'ణంగా తెరలేపారు కొందరు అభ్యర్థులు నాయకులు. ఈ నేపథ్యంలో నామినేషన్ వేసిన వారిలో కొందరు అభ్యర్థులు పోటీలో ఉందామా..? తప్పుకుందమ్మా.. అనే డైలామాలో వున్నారు. వారి మద్దతుదారులతో చర్చలు చేపడుతున్నారు. మరోవైపు ఎలాగైనా సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని అభ్యర్థులు ఇప్పటికే అన్ని విధాలుగా సంసిద్ధులై ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్పంచ్,వార్డు సభ్యుల నామినేషన్ల పర్వం ముగిసింది. ఇకా గ్రామాల్లో అభ్యర్థుల ప్రచారం ఉపందుకుంది. వేములవాడ డివిజన్ పరిధిలోని 5 మండలల లోని 85 గ్రామపంచాయతీల్లో ఒక్కసారిగా స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయ వేడి రగులుకుంది. నామినేషన్ వేసిన కొందరు సర్పంచ్ అభ్యర్థులు డైలామాలో పడ్డట్టు తెలుస్తోంది. అయితే ఎలక్షన్ ల్లో ఖర్చు పెడితే గెలుస్తామా... లేదా..? పోటీలో ఉందామా..? వద్దా..? అని కొంతమంది అభ్యర్థులు తర్జన బర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంది. ఓటర్లు తమకు అనుకూలంగా ఉన్నారా, లేరా అని అంతర్మథనం చెందున్నారు.పోటీలో ఉన్న మరికొందరు అభ్యర్థులు తమకు పోటీలో వున్నా అభ్యర్థులను విత్ డ్రా కోసం బుజ్జగించే పనిలో పడ్డట్టు తెలుస్తోంది.దీంతో గ్రామాల్లో అభ్యర్థులు ఎవరికీ వారె తమకు పడే ఓట్లు ఎన్ని, పడని ఓట్లు ఎన్ని అని బెరిజు వేసుకుంటున్నారు.తమకు అనుకూలం గా ఓటర్లు ఉన్నారా లేరా అని తమ అనుచరులతో చర్చలు జరుపుతున్నారు.

ఒక వేళ పోటీలో ఎంత ఖర్చు చేయాలి, అంత ఖర్చు పెట్టిన గెలుస్తామా, లేదా అనే ఆలోచన పడుతున్నారు.మరికొందరు అభ్యర్థులు ఎవరికీ వారె గెలుపు ధీమాగా ముందుకు వెళుతున్నారు.దీంతో గ్రామాల్లో స్థానిక పోరుతో రాజకీయ వేడి మొదలైంది. ముఖ్యంగా ఏ అభ్యర్థి గెలుపులోనైనా యువత పాత్రే కీలకం కానుంది. గ్రామ భవిష్యత్ కూడా యువత చేతిలో ఉందని స్థానిక ఓటర్లు చర్చించుకుంటు న్నారు. గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల గెలుపుపై రోజు రోజుకి గ్రామలలో వాతావరణం మారుతుంది. గ్రామాల్లో ఓటర్ల నాడి ఎవరికీ అంతు చిక్కడం లేదంటున్నారు.కొందరు అభ్యర్థులు ఎవరికీ వారే గెలుపు ధీమాగా ముందుకు వెళుతు కులసంఘాలను,మహిళా ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు.ఆయా మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల నాడి ఏంటో ఎవరికీ అంతు చిక్కక పోవడంతో లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియనుడడంతో బరిలో నిలిచే అభ్యర్థుల వివరాలు,గుర్తుల కేటాయింపు జరగనుంది.




# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం





- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లిలో భూ సేకరణ పరిహారం నిర్ధారణకు రైతులతో చర్చ


**ఖమ్మం డిసెంబర్ 2 (జనంసాక్షి) :** సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం ఇవ్వడానికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సింగరేణి మండలం బాజు మల్లాయి గూడెం, రేలకాయలపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం నిర్ధారణకు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి, జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని అన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, భూసేకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు. ఉన్నదాంట్లో మంచి రేటు ఇచ్చే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు.

బాజుమల్లాయి గూడెం గ్రామంలో ఎకరానికి 2 లక్షల 70 వేల రూపాయలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా 5 లక్షల 40 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి 10 లక్షల 80 వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించగా, ఆర్బిట్రేషన్ లో 12 శాతం వడ్డీ క్రింద 64 వేల రూపాయలు కలిపి మొత్తం 11 లక్షల 44 వేలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపామని, అదేవిధంగా రేలకాయపల్లి గ్రామంలో ఎకరానికి 2 లక్షల 92 వేల రూపాయలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా 5 లక్షల 85 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి 11 లక్షల 70 వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించగా, ఆర్బిట్రేషన్ లో 12 శాతం వడ్డి క్రింద 70 వేల 390 వేల రూపాయలు కలిపి మొత్తం 12 లక్షల 40 వేల 390 రూపాయలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపామని, దీనికి రైతులు మరింత పెంచాలని కోరారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్ల, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సెపరేట్ గా పరిహారం అందిస్తామని అన్నారు. కలెక్టర్ గా తనకున్న అధికారాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందజేయుటకు చర్యలు చేపట్టనున్నట్లు, భూ నిర్వాసిత రైతులందరూ అంగీకరించి, భూ సేకరణకు సహకరించాలని, ప్రభుత్వం నుండి పరిహారం త్వరితగతిన అందేలా చూస్తానని కలెక్టర్ అన్నారు. సమావేశంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ తమ భూముల్లో సుబాబుల్ పంట వేశామని, పంట చేతికి వచ్చే సమయానికి, భూములను కోల్పోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని అన్నారు. సుబాబుల్ పంట జీవితకాలాన్ని పరిగణ లోకి తీసుకుని తదనుగుణంగా పరిహారం ఇవ్వాలన్నారు. భూమిలో ఉన్న పైప్ లైన్, చెట్లు, ఇతర పరికరాలు, డ్రిప్ సిస్టం వివరాలు సరిగ్గా నమోదు చేసి పరిహారం అందించాలని అన్నారు. అందరికి ఒకేసారి పరిహారం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్డిసిఎం రాజేశ్వరి, కలెక్టరేట్ భూ సేకరణ అధికారులు, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

# హిడ్మా.. హీరో ఆఫ్ ది ఇయర్



## దేశవ్యాప్తంగా మార్మోగిన గోండు బిడ్డ పేరు



- మొట్టమొదటిసారిగా సోషల్ మీడియాలో భారీ చర్చ
- నూనుగు మీసాల దశ నుంచి అతనో ఆదివాసీల గుండెచప్పుడు
- ఆపరేషన్ కగార్‌కు కంగారు పుట్టించిన యోధుడు
- యువతకు మరో చేగువేరా కామ్రేడ్ మాద్వి హిడ్మా

**'ఒక వీరుడు మరణిస్తే వేల కొలది ప్రభవింతురు' అనే నానుడిని ఓ యోధుడి అమరత్వం రూఢీ చేస్తోంది. వేలాది మంది యువతను ప్రభావితం చేసి అడవి బిడ్డలకు, పర్యావరణ పరిరక్షణకు 'మేము సైతం..' అంటూ కదిలించిన తీరు మరో కొత్త చరిత్రను ఆవిష్కరిస్తోంది. రాజ్యం దృష్టిలో మోస్ట్‌వాంటెడ్‌గా మారితే.. అతని పోరాటం మాత్రం ఆదివాసీల గుండెచప్పుడుగా ప్రతిధ్వనిస్తోంది. రెండున్నర దశాబ్దాలకుపైగా వ్యవస్థలోని లోపాలపై యుద్ధం చేసి ఈ తరపు 'భగత్‌సింగ్'గా అందరి నోటా వినబడుతోంది. విద్యావంతుడు కాకపోయినా కార్పొరేట్ దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాడు. సహజ వనరుల రక్షకుడిగా, పర్యావరణహితుడిగా నిలిచిన హిడ్మా ఇప్పుడు హీరో ఆఫ్ ది ఇయర్‌గా మారడం ఓ చారిత్రక సందర్భం. నేటి యువతరానికి మరో చేగువేరా హిడ్మా..!**

### తడకల గుడిసె నుంచి దేశ గొంతుకగా..

అరికట్టి వారికి వ్యవసాయాన్ని నేర్పించి సాంప్రదాయక విత్తనాలను భద్రపరిచి భవిష్యత్‌తరాలకు అందించడంలో హిడ్మా తీసుకున్న చొరవను ఆదివాసులు గుర్తుచేస్తూనే ఉంటారు. వారి మనుగడ్కెన అడవి ఉనికి ప్రశ్నార్థకం అవుతున్నప్పుడు అడవి రక్షణ కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం నిలబడ్డ హిడ్మాను కేవలం ఆదివాసులే కాదు దేశంలోని పర్యావరణ పరిరక్షకులను కూడా ఆలోచిం పచేసింది. ఇప్పుడు యువతరం గుండెల్లో "హిడ్మా"పేరు మారుమో గడం ఆదివాసులనే కాదు పర్యావరణ పరిరక్షకుల గొంతుకయ్యేలా చేసింది. పర్యావరణాన్ని కొల్లగొడుతున్న కార్పొరేట్ కంపెనీ నిర్వాహకుల ఆకాశ హార్మ్యాల ముందు, కార్పొరేట్ కంపెనీల అసత్య ముందు, చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని సుక్మ జిల్లా పువ్వర్తి గ్రామంలోని తడకల గుడిసెలో జన్మించి ప్రజల కోసం, పర్యావరణం కోసం జీవించిన హిడ్మా ఆదివాసీ గొండి యువకుడు యువత గొంతుకై వినిపిస్తున్నా చారిత్రక సందర్భం. హిడ్మా జీవితం మాత్రం ఎంతో ఉన్నతమైనది. అడవుల విధ్వంసం వెనుక కార్పొరేట్ కుట్రలను అడ్డుకోవడం కోసం మాద్వి హిడ్మా సాగించిన ఉద్యమ ఆచరణ యువతరాన్ని ప్రభావితం చేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

దేశంలో ఇప్పటికే చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుకొని ఉన్న లక్ష చదరపు మీటర్ల వైశాల్యం కలిగి ఉన్న అటవీ ప్రాంతం దేశంలోనే వాతావరణం సమతుల్యత కాపాడేందుకు దోహదం చేస్తుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. బొగ్గు, బాక్సైట్ తవ్వకాల కోసం ఇప్పటికే ఆదాని, వేదాంత లాయిడ్, ఆర్య, అభినవ్ జిందాల్ లాంటి కంపెనీలు ఇప్పటికే కాలుష్యకారకమైన పరిశ్రమలతో ప్రకృతిని ధ్వంసం చేస్తున్న పరిస్థితి ఉందని పర్యావరణవేత్తలు ఆరోపిస్తున్నారు. సుమారు 200 సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలో జెల్ జంగల్ జమీన్ కోసం అనేక పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ క్రమంలో వెల్లువెత్తిన పోరాటాల నుంచి మావోయిస్టు పార్టీ హిడ్మాను యోధునిగా మలిచాయి. నిరంతరం కొనసాగుతున్న ఆదివాసుల వలసలు

సెంట్రల్ డెస్క్ (జనంసాక్షి)

చరిత్రలో ఎందరో అమరులవుతారు. ఎంతోమంది పుట్టుకొస్తుంటారు. కానీ కొందరు మాత్రమే సమాజానికి దిక్సూచిగా మారుతుంటారు. అందులో ఒకడిగా మాద్వి హిడ్మా నిలుస్తానడంలో సందేహం లేదు. భౌతికంగా మరణించినా అతను చూపిన పోరాటబాట శాశ్వతం. ప్రస్తుతం సోషల్ మీడియాలో హిడ్మాను పర్యావరణ పరిరక్షకుడిగా భావిస్తున్న యువతరం స్పందిస్తున్న తీరే ఇందుకు సజీవ సాక్ష్యం. హిడ్మా జీవితం, ఆచరణ అనేక కోణాల్లో భవిష్యత్ తరాలకు అందించిన వారసత్వంగా పరిశీలకులు భావిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఆదివాసీ గ్రామాల్లో, దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోనూ హిడ్మా పేరు మార్మోగుతుందంటేనే అతను నడిచింది ప్రజాబాటేనని అర్థమవుతోంది. తెలుగు, ఒడియా, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రాస్తున్న యువకవులు, రచయితలు, కళాకారులు అతని పేరుతో పాటలు, కవితలు, గ్రాఫిటీలు సృష్టిస్తుండటం సహజంగా ఏర్పడిరదే. కిషన్ జీలాంటి అగ్రనేత చనిపోయినప్పుడు ఆయన చితాభస్మాన్ని ప్రజలు తీసుకెళ్లిన సందర్భం గుర్తుంది. హిడ్మా మాత్రం యువతరానికి ఓ సందేశం అందించి వెళ్లిపోయాడనే భావన వ్యక్తమవుతోంది. ప్రస్తుత సంక్షోభిత పరిస్థితుల్లో కొత్త తరానికి హిడ్మా గొంతుకవ్వడం, భగత్‌సింగ్‌గా ఆయన పోలుస్తుండటం, దేశ రాజధానిలోనూ అనూహ్యంగా యువత నిరసన ప్రదర్శన నిర్వహించడం ప్రజల్లో పోరాట స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తోంది. పర్యావరణం కోసం నిలబడిన తీరు యువతను ప్రభావితం చేసిందని చెప్పక తప్పదు.

### స్పందించిన పౌర సమాజం

హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మునుపెన్నడూ లేనంత స్పందన రావడం పౌర సమాజాన్ని ఆలోచింపజేసింది. కుహనా దేశభక్తులు మినహా సామాన్య పౌరుడు సైతం రాజ్యపు 'బూటకపు' చర్యను వ్యతిరేకించాడు. పదుల సంఖ్యల్లో ఎన్‌కౌంటర్లు జరిగినప్పటికీ హిడ్మా మృతి తర్వాత పెల్లుబికిన స్పందన దేశంలోనే ఓ భారీ చర్చకు దారితీసింది. సోషల్ మీడియాలో, గూగుల్‌లో ఎక్కడ చూసినా హిడ్మా పేరే వినిపించింది. ఫోన్లలో ఏది తెరచి చూసినా ఆయన గురించే కనిపించింది. ఈ నేపథ్యంలోనే హిడ్మా పుట్టిన ఊరివైపు, ఆయన ఇంటివైపు అందరి దృష్టి మళ్లింది. మేధావులు, జర్నలిస్టులు హిడ్మా చరిత్రను తెలుసుకునేందుకు అడవిబాట పట్టేలా చేసింది. కాలుష్యానికి వ్యతిరేకంగా ఢల్లీలో జరిగిన నిరసనలోనూ హిడ్మా పోస్టర్లు అందరినీ ఆలోచింపజేశాయి. జల్ జంగిల్ జమీన్ కోసం పోరాడుతున్న బిడ్డలను రాజ్యం చంపుకోదు అంటూ నినాదాలు పెల్లుబికాయి. బిర్సా ముండా నుంచి హిడ్మా వరకు అడవులు, పర్యావరణం కోసం పోరాడారని ఆ సందర్భంగా ప్రతిధ్వనించింది. 'మా భూమి, మా అడవి, మా జీవనోపాధి మాకే' అనే నినాదమే హిడ్మాను మరో భగత్‌సింగ్‌గా మార్చిందన్నది అక్షర సత్యం. ఈయేడు ముగిసేసరికి హీరో ఆఫ్ ది ఇయర్ ఎవరని అడిగితే అడవుల్లోని లక్షలాది మంది ఆదివాసీలది ఒకే సమాధానం మాద్వి హిడ్మా.. మా భగత్ సింగ్.




# జనరల్ కోచ్‌లలోనూ దిండ్లు..బెడ్ షీట్లు


- చైన్నై రైల్వే డివిజన్‌లో జనవరి నుంచి అమలు



**చెన్నై, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్.. రైల్వే ప్రయాణికుల కోసం కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది రైల్వే శాఖ. ఇప్పటివరకు ఏసీ కోచ్ లలో మాత్రమే అందుబాటులో ఉన్న బెడ్ షీట్లు, పిల్లోస్ సౌకర్యం.. ఇప్పుడు నాన్ ఏసీ స్లీపర్ కోచ్ లలో కూడా అందుబాటులోకి రానుంది. తొలిసారి దక్షిణ రైల్వే పరిధిలోని చైన్నై రైల్వే డివిజన్ బెడ్ షీట్లు, పిల్లోస్ ను అందిస్తోంది. ఈ సౌకర్యాన్ని ఆన్ డిమాండ్ ఆన్ పేమెంట్ మోడ్ లలో పొందవచ్చు. ప్రయాణికులకు మెరుగైన సేవలందిచే క్రమంలో దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ నాన్ ఏసీ కోచ్ లలో స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు జనవరి 1 నుంచి దిండ్లు, బెడ్ షీట్లు అందించనున్నట్లు ప్రకటించింది. ఎంపిక చేసిన పది రైళ్లలో మూడేళ్ల పాటు ఈ కొత్త సౌకర్యాలను అమలు చేస్తారు. గతంలో ఎసి కోచ్ లలో మాత్రమే ఈ సౌకర్యం ఉండేది. వర్షాకాలం, శీతాకాలంలో రిలాక్స్ , పరిశుభ్రమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించడమే లక్ష్యంగా రైల్వే శాఖ పనిచేస్తోంది. దీంతో ప్రయాణీకులకు సుదూర ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉండనుంది. దుప్పట్లు, దిండ్ల నిర్వహణ పంపిణీని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. సేకరణ, యాంత్రిక వాషింగ్, ప్యాకింగ్, లోడింగ్, పంపిణీ ,నిల్వ - సేవా వ్యవధి అంతటా పరిశుభ్రత,సరఫరా చేయాల్సి ఉంటుంది. సుమారు రూ. 28.27 లక్షల వార్షిక లైసెన్స్ ఫీజులో ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తారు. దిండుతో కూడిన కవర్ ను రూ.30 కి, బెడ్ షీట్ కు రూ.20కి రెంట్ చెల్లించి తీసుకోవచ్చు. రెండూ కావాలంటే రూ. 50 లకు చెల్లించాల్సి ఉంటుంది. జనవరి 1 నుంచి మొత్తం పది రైళ్లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. రాబోయే రోజుల్లో దేశ వ్యాప్తంగా అన్ని జోన్లలో ఈ సౌకర్యాన్ని అమలు చేసే అవకాశం ఉంది.

# రేవంత్ మక్తల్ సభ అట్టర్ ఫ్లాప్

- లిఫ్ట్కు రెండుసార్లు శంకుస్థాపన చేస్తారా
- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాల మొదటి సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. కొడంగల్, నారాయణ్ పేట లిఫ్ట్‌కు పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. మక్తల్‌లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా మరోసారి సీఎం శంకుస్థాపన చేశారన్నారు. ఓకే ప్రాజెక్టుకు సీఎం రెండు సార్లు శంకు స్థాపన చేస్తారా ? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. హామీలు అమలు చేయలేదు కనుకే సీఎం సభకు జనాలు రాలేదన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని సీఎం పూర్తి చేయడం లేదు. కమీషన్ల కోసమే కొడంగల్ లిఫ్టు పథకాన్ని ముందుకు తెచ్చారు.. సీఎం, ఆయన సోదరులు కమీషన్ల కక్కుర్తిలో మునిగిపోయారు. కేసీఆర్ ఫార్మా సిటీకి సేకరించిన 14 వేల ఎకరాలను వాడుకుని ఫ్యూచర్ సిటీ అని మ భ్య పె డు తు న్నా ర న్నా రు. ఎన్నికలప్పుడు ఫార్మా భూములను రైతులకు తిరిగి ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి మాట తప్పారు. ఫ్యూచర్ సిటీని నార్త్ ఇండియా సినీ యాక్టర్లకు అప్పజెబుతున్నారు. రామోజీ ఫిలిం సిటీ ఉండగా ఇంకా వేరే ఫిలిం సిటీలు ఎందుకు? అని ప్రశ్నించారు. కేసీఆర్ కృషి వల్లే కోకాపేటలో ఎకరాకు రూ.150 కోట్ల ధర పలుకుతోంది. కేసీఆర్ వేసిన వెంచర్లలో ప్లాట్లు అమ్ముకుని రేవంత్ బతుకుతున్నాడు. రేవంత్‌కు దమ్ముంటే ఫ్యూచర్ సిటీలో వెంచర్ వేసి కోకాపేట రేటు తెప్పించగలరా ? అని ని పట్నం నరేందర్ రెడ్డి ప్రశ్నించారు.

# ఐఎఎస్ అధికారి కూతురు బలవన్మరణం

- ప్రేమించి పెళ్లి చేసుకుని కట్నవేధింపులకు బలి

**గుంటూరు, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** పెళ్ళైన కొద్ది నెలలకే ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నివాసం ఉంటున్న సీనియర్ ఐఏఎస్ చిన్నరాముడు కుమార్తె మాధురి సాహితీబాయి(27) ఆదివారం రాత్రి తన గదిలోని బాత్‌రూమ్‌లో ఉరివేసుకుంది. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బుగ్గనపల్లి తండాకు చెందిన రాజేష్‌నాయుడిని 2025 మార్చిలో ఆమె ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. వివాహమైన మూడో నెల నుంచి భర్త తనను వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులకు ఆమె తెలియజేయగా, కుమార్తెను అక్కడి పోలీసుల సహకారంతో రెండు నెలల కిందట తాడేపల్లిలోని నివాసానికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఆమె పుట్టింటిలోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆదివారం బలవన్మరణానికి పాల్పడింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నరాముడు మీడియాతో మాట్లాడుతూ.. 'ఉద్యోగం ఉందని మోసం చేసి మా కుమార్తెను రాజేష్‌నాయుడు మహానందిలో రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నాడు. పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి చేస్తామని చెప్పి అతడితో మా కుమార్తెను పంపాం. ఈ క్రమంలో ఆమెను అదనపు కట్నం తెమ్మంటూ రాజేష్ వేధింపులకు గురి చేశాడు. నీకు తానే దిక్కు, చంపేస్తానని బెదిరించేవాడు. కనీసం మాకు ఫోన్ చేయాలన్నా భర్త అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడ ఉండలేనని కుమార్తె చెప్పడంతో రెండు నెలల కిందట ఇంటికి తీసుకొచ్చాం. వచ్చిన నాటి నుంచి తన భర్తది నిజమైన ప్రేమ కాదని, అందుకే తీసుకెళ్లేందుకు రావడం లేదని కుమార్తె బాధపడుతూ ఉండేది. మాకు ఇలా దూరమవుతుందని అనుకోలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# బీమా సొమ్ము కోసం అన్నను చంపిన తమ్ముడు

- ప్రమాద కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజం

**కరీంనగర్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** జరిగిన ఓ రోడ్డు ప్రమాదంపై దర్యాప్తు చేసిన పోలీసులకు అది హత్యగా తేలింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో జరిగింది. బీమా సొమ్ము కోసం ఓ వ్యక్తి.. సొంత అన్నను దారుణంగా హత్య చేసిన ఘటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగింది. టిప్పర్‌తో ఢీకొట్టి చంపి.. ప్రమాదంగా చిత్రీకరించాడు. మూడ్రోజుల క్రితం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నవంబరు 29న రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి వెంకటేశ్ (39) టిప్పర్ ఢీకొని మృతి చెందినట్టు పోలీసులకు సమాచారం అందింది. శనివారం రాత్రి మట్టి తరలిస్తున్న టిప్పర్ బ్రేక్ డౌన్ కాగా.. వెంకటేశ్ టిప్పర్ ముందు భాగంలో మరమ్మతు చేస్తున్నాడు. ఇది గమనించని మృతుడి తమ్ముడు నరేష్.. టిప్పర్ స్టార్ట్ చేసి ముందుకు నడిపించాడు. వెంకటేశ్‌పై నుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు' అని మృతుడి తండ్రి నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నిందితుడి వ్యవహార శైలిపై అనుమానం రావడంతో మరింత లోతుగా విచారణ జరిపారు. వెంకటేశ్ హత్యకు కుట్ర ప్రణాళికను నిందితులు ఫోన్‌లో వీడియో తీశారు. ఆ వీడియో దొరకడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మృతుడు వెంకటేశ్ పేరుతో రెండు నెలల్లోనే 10 కంపెనీలలో రూ.4.14 కోట్ల విలువైన బీమా పాలసీలు నరేశ్ తీసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. బీమా సొమ్ము కోసమే ఈ హత్య జరిగినట్టు పోలీసులు తేల్చారు.

# అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ స్వీప్ చేయాలి

- మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపు



**మంచిర్యాల, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** చెన్నూరు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయాలని.. అందుకు పార్టీ కార్యకర్తలు, లీడర్లు సమష్టిగా కృషి చేయాలని కార్మిక, గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి, సమస్యలు తీరు తాయని భావిస్తూ ప్రజలు హస్తంపార్టీలో చేరు తున్నారని స్పష్టం చేశారు. మంత్రి వివేక మంగళవారం మంచిర్యాల జిల్లా చెన్నూరు క్యాంపు ఆఫీస్ ను సందర్శించారు. నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలకు సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ ఆశావాహులకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో కొమ్మెర మాజీ సర్పంచ్ తాళ్లపెల్లి సత్యనారాయణగౌడ్ తో పాటు చెన్నూరు. కో టపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన టీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, లీడర్లు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రాష్ట్ర కార్మిక, గను లశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చేస్తున్న అభివృద్ధిపట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పలువురు స్పష్టం చేశారు.

# జైలులో ఇమ్రాన్ ఖాన్ క్షేమం

- ప్రభుత్వ అనుమతితో జైలును సందర్శించిన సోదరి

**లాహోర్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతిచెందారంటూ వచ్చిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన జైల్లో సురక్షితంగానే ఉన్నారని సోదరి ఉజ్మా ఖానుమ్ తెలిపారు. అయితే, మానసికంగా వేధిస్తున్నట్లు ఆరోపించారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించా లంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే. దీంతో ఉజ్మాతో పాటు ఓ లాయర్ ఆయన్ని కలిసేందుకు జైలు అధికారులు మంగళవారం అనుమతించారు. కొన్నిరోజులుగా ఇమ్రాన్ మరణించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వదంతులు వ్యాపించిన విషయం తెలిసిందే. వీటన్నింటినీ అక్కడి ప్రభుత్వం ఖండించింది. అయినప్పటికీ.. ఆయన్ని చూపించాలని, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు వెల్లడించాలని మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలని కుటుంబ సభ్యులు కోరారు. అందుకు జైలు అధికారులు మంగళవారం వరకూ నిరాకరిస్తూ వచ్చారు. దీంతో ఇమ్రాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇమ్రాన్‌ను కలిసేందుకు అధికారులు అనుమతించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370